


www.andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI




శుక్రవారం | 28-2-2020 | పేజీలు: 12 + 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 60 సంచిక (Issue) : 314 | శ్రీవికారినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం; తిథి: చవితి ఉ. 6.45 తదుపరి పంచమి; నక్షత్రం: అశ్విని తె. 4.04 తదుపరి భరణి; వర్జ్యం: రా. 11.34-1.22; దుర్ముహూర్తం: ఉ. 8.59-9.45, మ. 12.52-1.38; అమృతఘడియలు: రా. 7.59-9.47; రాహుకాలం: ఉ. 10.30-12.00; సూర్యోదయం: 6.39; సూర్యాస్తమయం: 6.18 | విజయవాడ సిటీ*

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bangalore

# ఒక్క రాష్ట్రం చర్యతో దేశ ఖ్యాతికి దెబ్బ!



- ప్రభుత్వం మారినా ఒప్పందాలు నిలవాలి
- కాదంటే.. ఆ రాష్ట్రానికి నిధుల్లో కోత పెట్టాలి
- తప్పు చేసిన వారిని శిక్షించాలి
- అంతేతప్ప, దేశాన్ని దెబ్బతీయకూడదు
- కేంద్ర మంత్రి పీయూష్ తీవ్ర వ్యాఖ్యలు
- ఏపీ పేరెత్తకుండానే జగన్ సర్కారుకు చురకలు

## పీపీఏలపై సమీక్ష దేశ ప్రతిష్ఠను దెబ్బతీసింది

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఒక్క రాష్ట్రం తీసుకున్న నిర్ణయంతో అంతర్జాతీయంగా మొత్తం దేశ ప్రతిష్ఠ దెబ్బతిందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ పేరు ప్రస్తావించకుండా... 'దక్షిణాదిలోని ఒక రాష్ట్రం' అని పరోక్ష వ్యాఖ్యలు చేశారు. ఈ నెల 20వ తేదీన ఢిల్లీలో జరిగిన సీఐఐ - ఆస్కాన్ సదస్సులో పీయూష్ చేసిన విమర్శలు ఆలస్యంగా వెలుగులోకి వచ్చాయి. "విద్యుత్ కొనుగోలు ఒప్పందాలపై దక్షిణాదిన ఓ రాష్ట్రం చేపట్టిన సమీక్ష వల్ల భారతదేశం ప్రతిష్ఠ తీవ్రంగా దెబ్బతినింది" అని కేంద్ర మంత్రి అన్నారు. ఈ సమస్యకు పరిష్కారాన్ని కనుగొనేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. "రాజకీయ, ప్రభుత్వాల మార్పులకు అతీతంగా... చట్టపరమైన ఒప్పందాలకు కట్టుబడి ఉండేలా ఒక నియమావళి రూపొందించాల్సిన అవసరం ఏర్పడింది. ఏదైనా రాష్ట్రం సదరు ఒప్పందాలను పునఃసమీక్షిస్తే... ఆ రాష్ట్రానికి విడుదల చేసే నిధుల్లో రిజర్వు బ్యాంకు కోత విధించి... ఆ మొత్తాన్ని కాంట్రాక్టు సంస్థకు చెల్లించేలా ఉండాలి. అంతే తప్ప మొత్తం దేశ ఖ్యాతిని నాశనం చేసే పరిస్థితికి అవకాశం కల్పించవద్దు" అని పీయూష్ గోయల్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. "ఏదైనా తప్పు జరిగితే... అది చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోండి! కానీ, దేశ ప్రగతిగాథను చంపేయకండి" (డోంట్ కిల్ ది ఇండియాస్ స్టోరీ) అని హితవు పలికారు. దురదృష్టవశాత్తు, కొన్ని రాష్ట్రాలు కేంద్రం ఏం ప్రతిపాదించినా దానిని కచ్చితంగా వ్యతిరేకించాలన్నట్టుగా వ్యవహరిస్తున్నాయని తెలిపారు.




ఈశాన్య ఢిల్లీలో కాలిపోయిన ఓ భవనం; అల్లర్లలో గల్లంతైన షాబాజ్ కోసం విలపిస్తున్న తల్లి

# మృతులు 38

## నివురుగప్పిన నిప్పులా ఢిల్లీ

- 48 ఎఫ్ఐఆర్‌లు దాఖలు చేసిన పోలీసులు
- రెండు ప్రత్యేక దర్యాప్తు బృందాల ఏర్పాటు
- 514 మందిని ప్రశ్నిస్తున్నాం: కేంద్ర హోం శాఖ
- దాడుల్లో ఆప్ నేత తాహిర్ హుస్సేన్ పాత్ర!
- ఆయన మేడపై యాసిడ్, పెట్రోల్ బాంబులు
- తాహిర్‌పై హత్య, గృహ దహన కేసు నమోదు
- తప్పు మావాళ్లదైతే రెట్టింపు శిక్ష వేయండి: కేజ్రీ
- అమిత్ షాపై వేటు.. కోవింద్‌ను కోరిన కాంగ్రెస్
- ఘర్షణలకు కాంగ్రెస్సే కారణం: జావడేకర్
- హింసపై ట్రంప్ స్పందించలేదు: శాండర్స్
- అమెరికా ఎన్నికల్లో వేలు పెడతాం: బీజేపీ నేత
- అకాలీదళ్ ఎంపీ అసంతృప్త స్వరం
- పోలీసుల తీరుపై గుజ్రాల్ విమర్శలు
- జస్టిస్ మురళీధర్ బదిలీపై రగడ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27: బూడిద కుప్పలుగా మారిన వాహనాలు.. పొగచూరిన గోడలు.. సగం కాలిపోయిన ఇళ్లు.. రోడ్ల మీద పగిలిన అద్దాలు.. ఇంకా చల్లారని మంటలు! ఈశాన్య ఢిల్లీ ఇంకా బీభత్సంగానే ఉంది. ఏ క్షణంలో ఏమవుతుందోనన్న ఉద్రిక్తభరిత వాతావరణంలోనే ప్రజలు చెదిరిన జీవితాలను.. పోగొట్టుకున్న జీవనోపాధి కార్యకలాపాలను మళ్లీ ప్రారంభిస్తున్నారు. సీఏఏకు వ్యతిరేకంగా జరిగిన ఘర్షణలు, దాడుల్లో మృతుల సంఖ్య 38కి చేరింది. హింసాత్మక ఘటనల సంఖ్య తగ్గినా.. పరిస్థితి ఇంకా పూర్తిగా అదుపులోకి రాలేదు. జోహ్రి ఎన్‌క్లేవ్ ప్రాంతంలో ఒక వ్యక్తి మృతదేహం డ్రెయినేజీలో లభ్యమైంది. మౌజ్‌పూర్, భజన్‌పురా తదితర ప్రాంతాల్లో వాహనాలను, దుకాణాలను తగలబెట్టిన ఘటనలు జరిగాయి. కాగా.. సోమవారం నుంచి జరిగిన హింసకు సంబంధించి

మిగతా 11వ పేజీలో...



ఆప్ కౌన్సిలర్ తాహిర్ హుస్సేన్, ఆయన ఇంట్లో దొరికిన యాసిడ్ బ్యాగులు, పెట్రోల్ బాంబులు




# వైసీపీ వీరంగం!

- నిరసనలపై ముఖ్య నేతల సమీక్ష, పర్యవేక్షణ
- అడ్డుకుని తీరాలని స్పష్టమైన ఆదేశాలు
- గుడ్లు, టమోటాలతో వచ్చిన నిరసనకారులు
- బాబు బయటికి రాకుండా వాహనం అడ్డగింత
- నినాదాలు చేస్తూ కారుపై గుడ్లు, చెప్పులు
- ఎయిర్‌పోర్టులో కుండీలు పగలగొట్టి విధ్వంసం
- సుమారు 4 గంటలు కారులోనే టీడీపీ అధినేత
- తర్వాత కారు దిగి నడిచివెళ్లేందుకు యత్నం
- అదీ కుదరదంటూ అడ్డుకున్న పోలీసులు
- నేతలతో కలిసి రోడ్డుపైనే బాబు బైఠాయింపు
- 'మీ భద్రత కోసం అరెస్టు' అంటూ నోటీసులు
- ఎయిర్ పోర్టు వీఐపీ లాంజ్‌కు బాబు తరలింపు
- రాత్రి 7.35కు విమానంలో హైదరాబాద్‌కు

## అనుమతి ఇచ్చి మరీ అడ్డుకున్నారు!

విశాఖ పోలీసుల తీరుపై విమర్శలు

## బాబు యాత్రకు 'అధికారిక' అడ్డంకులు

## విమానాశ్రయంలో రోజంతా ఉద్రిక్తత



అనుకున్నది అనుకున్నట్లుగా చేశారు! చంద్రబాబును అడ్డుకోండి అని మంత్రులే స్వయంగా పిలుపునిచ్చారు. పార్టీ నేతలు 'ప్రణాళిక' రచించారు. పోలీసులు పరోక్షంగా సహకరించారు! విపక్ష నేత, తెలుగుదేశం అధ్యక్షుడు చంద్రబాబు విశాఖలో పర్యటించకుండా... విమానాశ్రయం నుంచే పంపించేశారు. చంద్రబాబు పర్యటనను అడ్డుకోవడమే లక్ష్యంగా అధికార పార్టీ శ్రేణులు చేసిన ఆందోళనలతో... విశాఖ విమానాశ్రయం వద్ద గురువారం ఉదయం నుంచి రాత్రి దాకా హైడ్రామా నెలకొంది! 2



1) చెప్పులు, ప్లకార్డులతో వైసీపీ మద్దతుదారులు
2) బాబు ఆగ్రహం
3) చేతిలో గుడ్డుతో ఓ మహిళ
4) బాబు కారుపై కోడిగుడ్ల దాడి

## ఏం చేస్తారయ్యా చంపేస్తారా?

- అయితే షూట్ చేయండి
- లేదంటే ఎన్‌కౌంటర్ చేయండి
- పోలీసులపై చంద్రబాబు ఫైర్
- ఇదేనా రక్షణ తీరంటూ మండిపాటు

10

## ఏప్రిల్ 20 నుంచి ఎంసెట్

నోటిఫికేషన్ విడుదల 3

## అమ్మకానికి 1200 ఎకరాలు

8









# కాలేజీల్లో కల్లోలం!

## 3 క్వార్టర్లుగా ట్యూషన్ ఫీజుల్లేవ్

## ఇప్పటిదాకా ఖరారు చేయని రుసుములు

- 'ఎగవేత'పై కాలేజీల సందేహం
- వసతి చార్జీలు తల్లుల ఖాతాలో!
- మరి... కాలేజీలు నడిచేదెలా?
- అప్పులు చేసి సిబ్బందికి జీతాలు
- విద్యార్థుల నుంచి వసూలు కష్టమే
- ఇంటర్ హాల్ టికెట్‌తో లింక్ కట్
- నేరుగా సైట్ నుంచి తీసుకోవచ్చు
- ప్రిన్సిపాల్ సంతకమూ అక్కర్లేదు
- ఇక కాలేజీల 'ముందస్తు' వసూళ్లు

ఫీజులను విద్యార్థుల నుంచైనా వసూలు చేసుకోవాలి. లేదా... ప్రభుత్వమైనా ఫీజు రీయింబర్స్‌మెంట్ చేయాలి. ఇదేదీ కాకపోతే... కళాశాలలు ఆర్థికంగా కుదేలవుతాయి. సిబ్బందికి జీతాలు కూడా చెల్లించలేక విలవిల్లాడతాయి. కళాశాలల నిర్వహణ కోసం అప్పుల పాలవుతాయి. ప్రస్తుతం

మిగతా 11వ పేజీలో...

## విలేజ్ క్లినిక్స్.. 24 గంటలూ!



- ప్రాథమిక వైద్యం, ఉచితంగా మందులు
- చిన్నారుల కోసం 'వైఎస్ఆర్ చిరునవ్వు'
- ఆరోగ్య శాఖ సమీక్షలో సీఎం జగన్ 2



తుళ్లూరులో రాజధాని మహిళల ఆందోళన

# 'వన్ సైడ్ గేమ్' కుదరదు!

## రాజధాని కోసం రైతులిచ్చిన భూముల్ని ఇళ్ల స్థలాలకు ఎలా ఇస్తారు?



- ఆ అధికారం మీకెక్కడిది?
- రాజధానిలో అభివృద్ధే చేపట్టలేదు
- 5% భూముల్ని ఎలా వినియోగిస్తారు?
- ప్రభుత్వ భూమిని పంపిణీ చేస్తే మాకేం అభ్యంతరం లేదు
- హైకోర్టు ధర్మాసనం తీవ్ర వ్యాఖ్యలు
- బయటివారు వస్తేనే నగర జనాభా పెరుగుతుంది.. ఏజీ వాదన 9





## పరంజ్యోతి

## విజ్ఞానాన్ని సాధించే క్రమం



*ఆచార్యాత్ పాదమాదత్తే పాదం శిష్యః స్వమేధయా!*
*పాదం సబ్రహ్మచారిభ్యః పాదం కాలక్రమేణచ!*

ఒక విద్యార్థి జ్ఞాన సముపార్జన క్రమాన్ని తెలిపే శ్లోకమిది. విద్యను నేర్చుకునే విధానాన్ని నాలుగు పాదాలుగా విభాగిస్తే.. గురువు వద్ద శిష్యుడు నేర్చుకునేది ఒకపాదం మాత్రమే. లోతుగా అధ్యయనం చేసి, బుద్ధితో విచారించి, సూక్ష్మాంశాలు పరిశోధించి, విశ్లేషణ శక్తి ఉపయోగించి, ఆంతర్యాన్ని గ్రహించి మరొక పాదం నేర్చుకుంటాడు. తోటి విద్యార్థులతో జరిపే చర్చలతో, మీమాంసాదులతో అవగాహన పెంచుకోవడం ద్వారా మరో భాగం నేర్చుకుంటాడు. నేర్చిన విద్యను ఆచరణలో పెడుతూ, కాలక్రమేణా తన, ఇతరుల అనుభవాల ద్వారా పూర్తిగా నేర్చుకుంటాడు. స్థూలంగా చెప్పాలంటే.. గురువు బోధనల ద్వారా వికసన పొందుతాడు. బుద్ధితో విశ్లేషణ చేసుకొని, తనలోని పరిమితులను చెరిపివేసుకొని, జ్ఞానాన్ని విస్తరించుకుంటాడు. జ్ఞాన విస్తరణ వల్ల విషయాన్ని చూసే విధానంలో మార్పు వస్తుంది. నైపుణ్యాలు పెరుగుతాయి. పూర్వ నిశ్చితాభిప్రాయాలను త్రోసిరాజని హేతుబద్ధమైన, తార్కికమైన ఆలోచన చేసే శక్తి పెరుగుతుంది. విద్యాధికులతో చర్చోపచర్చలు, వాదప్రతివాదనలు చేస్తూ తన అభిప్రాయాలను, ప్రతిపాదనలను ఇతరులతో పంచుకుంటూ తనలోని లోతుపాతులు, తప్పొప్పులను దిద్దుకుంటూ, విద్యను వివిధ కోణాలలో ఆధునికీకరించుకుంటూ ముందుకు సాగడం వల్ల విద్య వ్యాప్తమౌతుంది. తన వాదమే యథార్థమనే భావన గతించి.. సత్యాన్ని ఆవిష్కరించ గలుగుతాడు. ఈ స్థితిలో తనలోని జ్ఞానం తెలివిగా, విజ్ఞానంగా, వివేచనగా, వివేకంగా రూపాంతరం చెందుతుంది. జీవితం పరీక్షలు పెడుతూ పాఠం నేర్పుతుంది కాబట్టి జీవన విధానంలో వ్యక్తి వివేచన ఎన్నో పరీక్షలను ఎదుర్కొంటుంది. అప్పుడప్పుడూ తన విజ్ఞానం ఇచ్చిన ఉత్సాహం, అధికమైన ఆత్మవిశ్వాసం వల్ల అహంకారం పలకరించే అవకాశం ఉంటుంది. అప్పుడు తాను వివిధ మార్గాల ద్వారా నేర్చుకున్న విజ్ఞతను జీవన గమనంలో ప్రతిక్షేపించడం ద్వారా తన విజ్ఞానం, విజ్ఞత, ప్రాజ్ఞత, నైపుణ్యాలు సమగ్రతను సంపూర్ణతను సంతరించుకుంటాయి. దీనిని ప్రచారం చేయడం వల్ల సత్యం, శాశ్వతం, అనంతం, ఆనందమయమైన విజ్ఞానం పరివ్యాప్తమై సమాజానికి ఉపకరిస్తుంది. ఆ పరిపూర్ణతను సాధించడమే మానవ జీవన గమ్యం. వికసన విస్తరణగా, విస్తరణ వ్యాప్తంగా, వ్యాప్తం పరివ్యాప్తంగా రూపాంతరం చెందడం వల్ల సమగ్రతను, సంపూర్ణతను పొందిన వ్యక్తిత్వం తన పరిమితులకు అతీతంగా స్పందించడం నేర్చుకుంటుంది. భౌతిక, మానసిక, భావోద్వేగ, సామాజిక, ఆధ్యాత్మిక జీవన పార్శ్వాలలో తనస్థాయిని ఉన్నతీకరించుకుంటుంది. అసాధ్యాలనుకున్న లక్ష్యాలు ఛేదించే సన్నద్ధత ఆవిష్కృతమౌతుంది. దార్శనికత పెరుగుతుంది. అంతర్గత దృష్టికోణం నుండి చూచే అలవాటు నైజంగా మారుతుంది. దానితో మూలాలను అన్వేషించగలుగుతాం. సమస్యలకు భయపడి పారిపోకుండా ఎలాంటి సమస్యకైనా సకారాత్మక వైఖరితో పరిష్కారాన్ని కనుగొనగలుగుతాం.

**- పాలకుర్తి రామమూర్తి, 9441666943**

# వైసీపీ వీరంగం!

- బాబు యాత్రకు 'అధికారిక' అడ్డంకులు..
- విమానాశ్రయంలో రోజంతా ఉద్రిక్తత

విశాఖపట్నం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): విపక్షనేత చంద్రబాబు ఉత్తరాంధ్రలో చేపట్టిన 'ప్రజా చైతన్య యాత్ర'ను అడ్డుకోవడమే లక్ష్యంగా అధికార పార్టీ నేతలు పక్కా వ్యూహం రచించారు. విశాఖ జిల్లా వైసీపీ ప్రజా ప్రతినిధులు, పలువురు ముఖ్య నేతలు మర్రిపాలెంలోని ఆర్‌అండ్‌బీ బంగ్లాలో మకాం వేశారు. 'ఆందోళనలను' పర్యవేక్షించారు. ఉదయం 9 గంటలకే అందరినీ విమానాశ్రయానికి తరలించారు. 'మధ్యాహ్నం భోజనాలు లేకపోయినా ఫర్వాలేదు. చంద్రబాబు తిరిగి వెళ్లేదాకా ఆందోళన చేయండి' అంటూ స్పష్టమైన సూచనలు చేశారు. 'ఉత్తరాంధ్ర ద్రోహి చంద్రబాబు, గోబ్యాక్ చంద్రబాబు'... అంటూ ప్లకార్డులు సిద్ధం చేసుకున్నారు. ఆందోళనకారులకు కోడిగుడ్లు, టమోటాలు కూడా సరఫరా చేశారు. ప్లకార్డులు, నల్లజెండాలు, కోడిగుడ్లతో వచ్చిన నిరసనకారులను పోలీసులు ఎంచక్కా విమానాశ్రయం పోర్టికో వరకు అనుమతించారు. టీడీపీ నేతలు, కార్యకర్తలను మాత్రం అడ్డుకున్నారు. 10.30 గంటలకు వైసీపీ శ్రేణులు ఒక్కసారిగా ఎయిర్‌పోర్టు ప్రాంగణం లోపలకు చొచ్చుకెళ్లాయి. పోలీసులు చూసీచూడనట్టు వదిలేయడంతో.. టెర్మినల్ పోర్టికో వరకు చేరుకున్నారు. 11.30 గంటలకు చంద్రబాబు విశాఖ విమానాశ్రయానికి చేరుకున్నారు. టెర్మినల్ నుంచి బయటకు వచ్చి కారెక్కగానే... ఆందోళనకారులు ఆయన వాహనం వైపు దూసుకొచ్చేందుకు యత్నించారు. మరికొందరు వైసీపీ కార్యకర్తలు చెప్పులు, కోడిగుడ్లు, టమోటాలు చంద్రబాబు వాహనంపైకి విసరడం ప్రారంభించారు. చంద్రబాబు వాహనం 150 మీటర్లు దూరం వెళ్లడానికి సుమారు గంట సమయం పట్టింది. ఆ తర్వాత కొంతమంది రోడ్డుకు అడ్డంగా పడుకున్నారు. అదే సమయంలో ఎయిర్‌పోర్టు బయట, హైవే వద్ద వేచి ఉన్న మరికొందరు వైసీపీ కార్యకర్తలు అక్కడకు చేరుకున్నారు. పోలీసులూ మొత్తం వ్యవహారాన్ని చూస్తూ నిల్చున్నారు. ఇదే అదనుగా వైసీపీ కార్యకర్తలు రెచ్చిపోయారు. కొందరు టీడీపీ సానుభూతిపరుల వద్దకు వచ్చి వారిపై ఉమ్మేశారు. ఎమ్మెల్యే వెలగపూడి వాహనం అద్దాలు పగలగొట్టారు. చంద్రబాబు కాన్వాయ్‌పైకి చెప్పులు, కోడిగుడ్లు విసిరారు. చంద్రబాబు వాహనంపైనా కోడిగుడ్లు పడ్డాయి. సుమారు మూడు గంటలు.. కారులోనే కూర్చున్న చంద్రబాబు ఓపిక నశించి కిందికి దిగారు. మాజీ మంత్రులు అచ్చెన్నాయుడు, నిమ్మకాయల చినరాజప్పతో కలిసి నడుచుకుంటూ ఎయిర్‌పోర్టు బయటకు వెళ్లేందుకు యత్నించారు. ఈ సమయంలో వైసీపీ కార్యకర్తలు మరింత పెద్దఎత్తున నినాదాలు చేశారు. డీసీపీ-2 బిల్లా ఉదయ్‌కుమార్ అక్కడికి చేరుకుని... నడుచుకుంటూ వెళ్లేందుకు వీల్లేదని చంద్రబాబు బృందాన్ని అడ్డుకున్నారు. దీంతో తాను వెనక్కి వెళ్లే ప్రసక్తే లేదని చంద్రబాబు రోడ్డుపైనే బైఠాయించారు.

నిరసన పేరిట నాలుగు గంటలపాటు వైసీపీ శ్రేణులు చెలరేగినా పోలీసులు వారిని అదుపు చేయలేకపోయారు. చివరికి.. చంద్రబాబునే వెనక్కి తిరిగి వెళ్లిపోవాలని కోరడం ప్రారంభించారు. అందుకు ఆయన నిరాకరించారు. కొద్ది నిమిషాలు వేచి చూసిన పోలీసు అధికారులు ఉన్నతాధికారులతో చర్చించి చంద్రబాబును అక్కడినుంచి బలవంతంగా తరలించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో ఎమ్మెల్యేలు వెలగపూడి, వాసుపల్లిలను అరెస్టు చేసి తీసుకెళ్లిపోయారు. "నేను నిబంధనల ప్రకారమే నడుచుకుంటున్నాను. అనుమతి తీసుకున్నాకే పర్యటనకు వచ్చాను" అని చంద్రబాబు తెలిపారు. దీంతో వెస్ట్ డివిజన్ ఏసీపీ అప్పటికప్పుడు ఒక నోటీసు ఇచ్చారు. "మీ భద్రత, రక్షణ కోసమే సీఆర్పీసీ 151 కింద ముందస్తు అరెస్టు చేస్తున్నాం. సహకరించండి" అంటూ తెల్లకాగితంపై పెన్నుతో రాసిచ్చారు. ఆ తర్వాత... చంద్రబాబును, ఆయనతో ఉన్న నేతలను సాయంత్రం 3.50 గంటల ప్రాంతంలో విమానాశ్రయంలోని వీఐపీ లాంజ్‌లోకి తరలించారు.



విశాఖ నుంచి హైదరాబాద్ చేరుకున్న చంద్రబాబు

### తిరిగి వెళ్లిపోవాలని...

విశాఖ నుంచి హైదరాబాద్ లేదా విజయవాడకు వెళ్లిపోవాలని చంద్రబాబును పోలీసులు కోరారు. దానికి ఆయన నిరాకరించారు. తనను అరెస్టు చేయడంపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తానన్నారు. రాత్రికి విమానాశ్రయంలోనే పడుకుంటానని స్పష్టం చేశారు. అలా కుదరదని పోలీసులు చెప్పగా... అదే సమయంలో అక్కడికి వచ్చిన విమానాశ్రయం డైరెక్టర్ రాజకిశోర్‌తో చంద్రబాబు మాట్లాడారు. విమానాశ్రయంలో పోలీసుల అధికారం ఏమిటని ప్రశ్నించారు. ఉత్తరాంధ్రలో పర్యటించకుండా వెనుతిరిగేది లేదని తేల్చిచెప్పారు. అంతకు ముందు పార్టీ కార్యాలయం వద్ద బస్సులో బస చేసేందుకు కూడా ఆయన నిర్ణయించారు. ఆ మేరకు నాయకులు కూడా ఏర్పాట్లు చేశారు. అయితే... భద్రతా కారణాల రీత్యా సహకరించాలని పోలీసులు పదేపదే చంద్రబాబును కోరారు. దీంతో చంద్రబాబు అంగీకరించారు. పోలీసులు ఆయనను రాత్రి 7.30 గంటలకు హైదరాబాద్ వెళ్లే ఇండిగో విమానం ఎక్కించారు. శాంతి భద్రతలకు ఇబ్బంది కలగకుండా సహకరించాలని కోరడంతో చట్టంపై గౌరవంతో తాను అంగీకరిస్తున్నానని, విశాఖ విమానాశ్రయంలో జరిగిన ఘటనపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తానని చంద్రబాబు స్పష్టం చేశారు.

### మహిళా కానిస్టేబుళ్లతో రోప్ పార్టీ

ముఖ్య నేతల పర్యటనలకు... మరీ ముఖ్యంగా నిరసనలు వ్యక్తమయ్యే అవకాశమున్నప్పుడు పోలీసులు రోప్ పార్టీని ఏర్పాటు చేస్తుంటారు. ఆందోళనకారులను అడ్డుకునేందుకు వీలుగా పురుష పోలీసులనే ఇందుకు వినియోగిస్తారు. కానీ... గురువారం తొలిసారిగా మహిళా కానిస్టేబుళ్లకు రోప్ పార్టీ బాధ్యతలు అప్పగించారు. మగ పోలీసులను ఆందోళనకారుల వద్ద బందోబస్తుకు ఏర్పాటు చేశారు. ఆందోళనకారుల్లో మహిళలూ ఉన్నారు. వారిని పక్కకు తప్పించేందుకు లేడీ కానిస్టేబుళ్లు మాత్రం లేరు. 'మహిళలను మేం తాకొద్దు. వారికి పక్కకు లాగితే కఠిన చర్యలకు గురికావాల్సి ఉంటుంది' అంటూ మగ పోలీసులు చూస్తూ నిల్చున్నారు. అధికార పార్టీకి సహకరించేందుకే పోలీసులు ఇలా వ్యూహాత్మకంగా వ్యవహరించారని టీడీపీ నేతలు ఆరోపించారు.

## రెవెన్యూ 'చందాల'పై కలెక్టర్ సీరియస్!

- మీడియాకు ఎలా తెలిసిందని అధికారులపై ఆగ్రహం?
- విచారణ కమిటీ ఏర్పాటుకు ఆదేశం

కర్నూలు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): 'సీఎం సభకు చందాలు ఎందుకు వసూలు చేశారు? అసలీ విషయం మీడియా వరకు ఎలా వెళ్లింది. శాఖల్లో ఏం జరుగుతోందో కూడా గమనించలేకపోతున్నారా?' అంటూ కలెక్టర్ వీరపాండియన్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. 'సారు సభకు చందాలేయండి' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' ప్రధాన సంచికలో గురువారం కథనం ప్రచురించిన విషయం తెలిసిందే. అయితే సీఎం సభకు కొన్ని శాఖలకు మాత్రమే ఇలా ఖర్చులను అప్పగించామని, ఇందులో రెవెన్యూ శాఖ లేదని కలెక్టరేట్ వర్గాలు చెబుతున్నాయి. రెవెన్యూ అధికారులు ఎందుకు వసూళ్లకు పాల్పడుతున్నారన్న అంశంపై కలెక్టర్ కొంతమంది అధికారులతో చర్చించినట్లు తెలిసింది. ఈ వ్యవహారంపై విచారణ కమిటీని ఏర్పాటుచేయాలని, వీలైనంత త్వరగా నివేదిక సమర్పించాలని కలెక్టర్ ఆదేశించినట్టు సమాచారం. సభలు, సమావేశాలకు ఇలా వసూళ్లు చేయడం పరిపాటిగా మారిన క్రమంలో అసలు చందాలకు ఆస్కారమే లేదని కొందరు అధికారులు కప్పిపుచ్చే ప్రయత్నాలు చేస్తున్నారు. ఏ సభలు, సమావేశాలు జరిగినా.. నేటికీ కొన్ని తహసీల్దార్ కార్యాలయాలు ఖర్చుల్ని భరిస్తూ వస్తున్నాయి. అవినీతికి పాల్పడటానికి ఈ ఘట్టాన్ని కొందరు అధికారులు ఓ సాకుగా మార్చుకుంటున్నారు. ప్రస్తుతం ఈ వ్యవహారం బయటకు ఎలా పొక్కిందన్న దానిపై అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. అధికారుల తీరు, చందాల వసూళ్లపై డీఆర్వో పుల్లయ్య ఆధ్వర్యంలో విచారణ కమిటీకి కలెక్టర్ ఆదేశించడంతో రెవెన్యూశాఖ అలెర్ట్ అయ్యింది. అసలు అలాంటి ఘటనలే జరగలేదన్న దిశగా నివేదికలు సిద్ధం చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు సమాచారం. మరోవైపు రెవెన్యూ శాఖలో జరిగిన చందాల వ్యవహారానికి ఆ శాఖ ఉన్నతాధికారిగా ఉన్న ఆర్డీవోను విచారణాధికారిగా నియమించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

### 75 శాతం హాజరు లేకున్నా వసతి దీవెన

- సాంఘిక సంక్షేమశాఖ వివరణ

అమరావతి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): 75 శాతం హాజరు లేకపోయినా జగనన్న వసతి దీవెన అమలు చేస్తున్నట్లు సాంఘిక సంక్షేమశాఖ డైరెక్టర్ హర్షవర్ధన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 'జగనన్నా... ఇంత దగానా' శీర్షికతో గురువారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంపై ఆయన వివరణ ఇచ్చారు. పట్టణ ప్రాంతాల్లో 1500 చదరపు అడుగులకు మించి సొంత నివాసం ఉంటే... అలాంటి వారు మాత్రమే ఈ పథకానికి అనర్హులవుతారని పేర్కొన్నారు. వసతి దీవెన పథకానికి విద్యుత్ వినియోగంపై ఎలాంటి ఆంక్షలూ లేవన్నారు. ప్రభుత్వ హాస్టల్ విద్యార్థులకు గతంలో ఏ విధంగా కాస్మొటిక్ చార్జీలు మంజూరుచేశారో ఇప్పుడు కూడా అలాగే మంజూరవుతాయని పేర్కొన్నారు. కాగా వివిధ స్కాలర్‌షిప్పుల మొత్తాన్ని చంద్రబాబు ప్రభుత్వం పెంచిన తర్వాత ఇచ్చిన ఉత్తర్వులను పరిగణనలోకి తీసుకోకుండా... అంతకు ముందు ఇచ్చిన రేట్లను సూచిస్తూ సాంఘిక సంక్షేమ డైరెక్టర్ వివరణ ఇచ్చారు.

# 49,500 కోట్ల రుణం తెండి!

- తక్కువ వడ్డీకే తీసుకురావాలి
- జలవనరుల శాఖకు సీఎం జగన్ నిర్దేశం
- ప్రాధాన్య ప్రాజెక్టులకు 18 వేల కోట్లు
- సీమ ఎత్తిపోతలకు 24 వేల కోట్లు
- ఉత్తరాంధ్రకు 7,500 కోట్లు సమీకరించండి
- సీమ ప్రాజెక్టులపై డీపీఆర్‌లతో రండి
- అధికారులకు ముఖ్యమంత్రి ఆదేశం

అమరావతి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం కోసం రూ.49,500 కోట్లు రుణం తీసుకు రావాలని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆదేశించారు. అది తక్కువ వడ్డీకే తీసుకోవాలని జల వనరుల శాఖకు సూచించారు. తక్కువ వడ్డీకి రుణాలిచ్చే ఆర్థిక సంస్థల నుంచి ప్రాధాన్య ప్రాజెక్టుల కోసం రూ.18 వేల కోట్లు, రాయలసీమ ఎత్తిపోతల పథకం కోసం రూ.24 వేల కోట్లు, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి కోసం రూ.7,500 కోట్లు రుణం తీసుకోవాలని తెలిపారు. గురువారమిక్కడ తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో రాయలసీమ ఎత్తిపోతలపై ఆయన సమీక్ష జరిపారు. మంత్రి అనిల్‌కుమార్, జల వనరులు, ఆర్థిక శాఖ అధికారులు, ఈఎన్‌సీ సి.నారాయణరెడ్డి తదితరులు హాజరయ్యారు. రాయలసీమ ఎత్తిపోతల పథకానికి సమగ్ర వ్యయ నివేదిక (డీపీఆర్)ను సిద్ధం చేయాలని సీఎం పేర్కొన్నారు. ఏ ప్రాజెక్టుకు ఎంత వ్యయమవుతుందని ఆరా తీశారు. సీమ ప్రాజెక్టుల టెండర్ల ప్రక్రియను పూర్తిచేసే పనులు ప్రారంభించాలన్నారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి టెండర్ల ప్రక్రియను కూడా పూర్తి చేసి వెంటనే పనులు ప్రారంభించాలని చెప్పారు. గోదావరి-కృష్ణా-బానకచర్ల అనుసంధాన ప్రణాళికలను అధికారులు వివరించారు. వీలైనంత తక్కువ వ్యయంతో ఎక్కవ లబ్ధి చేకూరేలా సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం పేర్కొన్నారు. శ్రీశైలంలో 797 అడుగుల స్థాయి నుంచి రోజుకు 3 టీఎంసీల చొప్పున బానకచర్ల క్రాస్ రెగ్యులేటర్‌లోకి ఎత్తిపోసి.. అక్కడి నుంచి తెలుగుగంగ, ఎస్సార్బీసీ, గాలేరు-నగరి, కేసీ కెనాల్ ద్వారా సాగు, తాగునీటి కష్టాలు తీర్చాలన్నది సీమ ఎత్తిపోతల పథకం లక్ష్యం. దీనికి రూ.33,869 కోట్లు ఖర్చవుతాయని జల వనరుల శాఖ అంచనా. ఇటీవల ప్రపంచ బ్యాంకు ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఈ పథకం గురించి సీఎం ప్రస్తావించారు. ప్రతిపాదనలు సమర్పిస్తే పరిశీలిస్తామని వారు పేర్కొన్నారు.



జలవనరుల శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి జగన్, అధికారులు

### మిగతా నిధుల్ని ఎక్కడి నుంచి తెస్తారు?

రాయలసీమ పథకానికయ్యే రూ.33,869 కోట్లలో మొత్తం కాకున్నా.. కొంత మొత్తమైనా రుణంగా ఇవ్వాలని ఆసియా అభివృద్ధి బ్యాంకు (ఏడీబీ)ను ఆర్థిక శాఖ కోరింది. గురువారం ఉదయం ఏడీబీ అధికారులతో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.ఎస్.రావత్, జల వనరుల మంత్రి అనిల్ కుమార్, ఈఎన్‌సీ నారాయణరెడ్డి సమావేశమయ్యారు. తాము కొంత ఇస్తే మిగిలిన నిధుల సమీకరణ ఎలా చేస్తారని ఏడీబీ ప్రశ్నించింది. సాగునీటి ప్రాజెక్టులకు రుణసహకారంలో ప్రత్యేక నియమావళి ఉంటుందని.. పూర్తిస్థాయిలో సమగ్ర ప్రాజెక్టు వ్యయ నివేదికతో పాటు.. పూర్తిస్థాయి నిధుల సమీకరణ వివరాలను అందజేయాలని తెలిపింది. దీంతో ఏడీబీ రుణంపై అధికారుల్లో సందేహాలు మొదలయ్యాయి.

## 24 గంటలూ విలేజ్ క్లినిక్స్!

- ప్రాథమిక వైద్యం, ఉచితంగా మందులు
- 2వేల జనాభాకు ఒక యూనిట్‌గా ఏర్పాటు
- చిన్నారుల కోసం 'వైఎస్ఆర్ చిరునవ్వు'
- ఆరోగ్య శాఖ సమీక్షలో సీఎం జగన్

అమరావతి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): చిన్న చిన్న ఆరోగ్య సమస్యలకు పెద్దాస్పత్రులకు పరిగెత్తకుండా.. గ్రామాల్లోనే ప్రాథమిక చికిత్స, అవసరమైన మందులు అందించేందుకు వీలుగా విలేజ్ క్లినిక్‌లను అందుబాటులో ఉంచాలని ముఖ్యమంత్రి జగన్ సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 2వేల జనాభాను ఒక యూనిట్‌గా తీసుకుని అక్కడి పరిస్థితులకు తగినట్టుగా 'వైఎస్ఆర్ విలేజ్ క్లినిక్'లు అందుబాటులోకి తీసుకురావాలని చెప్పారు. ఆరోగ్యశాఖపై గురువారం ఆయన సమీక్ష నిర్వహించారు. విలేజ్ క్లినిక్‌ల్లో బీఎస్సీ నర్సింగ్ చదివిన స్టాఫ్ ఒకరు 24 గంటలూ అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయాలున్న చోటల్లా ఈ క్లినిక్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి పార్లమెంటు నియోజకవర్గంలో ఒక బోధనాస్పత్రి ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.

### జూలై 8న వైఎస్ఆర్ చిరునవ్వు

ఒకటి నుంచి 6వ తరగతి విద్యార్థులకు ఉచితంగా దంత వైద్యం అందించాలని సీఎం నిర్ణయించారు. ఈ కార్యక్రమానికి 'వైఎస్ఆర్ చిరునవ్వు' అని పేరు పెట్టారు. జూలై 8న దీన్ని ప్రారంభించాలని ఆదేశించారు. దీనిలో భాగంగా ప్రతి విద్యార్థికీ టూత్‌పేస్ట్, బ్రష్ ఉచితంగా ఇవ్వాలన్నారు. పీహెచ్‌సీల్లో డెంటల్ చెకప్ కూడా ఉండాలన్నారు. కార్యక్రమాన్ని ప్రారంభించే ముందు పూర్తిగా అధ్యయనం చేయాలని సూచించారు. కంటివెలుగు కార్యక్రమం ఎలా అమలవుతుందో పరిశీలించాలన్నారు.

# 'బీపీఎస్'కు డెత్‌లైన్!

**రేపటితో గడువు సరి.. ఆర్నెల్లలో 60 శాతమే పూర్తి**
**పెండింగ్‌లో 17 వేల దరఖాస్తులు**
**రెండ్రోజుల్లో పరిశీలన సాధ్యమయ్యేనా!?**

**(ఆంధ్రజ్యోతి, అమరావతి)**

భవన నిర్మాణ క్రమబద్ధీకరణ (బీపీఎస్-2019) దరఖాస్తుల పరిశీలన ప్రక్రియలో అధికారుల అలసత్వం ఇప్పుడు దరఖాస్తుదారులకు సంకటంగా మారింది. నిర్ణీత గడువు ఈ నెల 29వ తేదీతో ముగియనుండగా ఇప్పటి వరకు వాటిల్లో రమారమి 60 శాతం ప్రాసెసింగ్ మాత్రమే పూర్తయింది! డీటీసీపీ వి.రాముడితో సహా పురపాలక శాఖ ఉన్నతాధికారులు ఆరు నెలల నుంచి పర్యవేక్షిస్తూ.. ఆదేశాలు జారీ చేసినప్పటికీ రాష్ట్రంలోని పట్టణ స్థానిక సంస్థ (యూఎల్‌బీ)లు, పట్టణాభివృద్ధి సంస్థ (ఉడా)ల్లో అత్యధికం నిమ్మకు నీరెత్తినట్లుగా ఉండడంతో ఈ పరిస్థితి తలెత్తింది! ఏవేవో కారణాలతో రోజులు దొర్లించేసిన ఈ సంస్థల అధికారులు గడువు ముగిసేందుకు కేవలం 2 రోజులు మాత్రమే మిగిలిన తరుణంలో.. ఇప్పుడెంతగా పరుగులు తీసినా మిగిలిన 40 శాతం దరఖాస్తుల పరిశీలన ఏ విధంగా చేయగలరో అంతుబట్టని పరిస్థితి!.

**దరఖాస్తులు 41,462.. పరిశీలన 25 వేలలోపే!:** రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల్లో నిబంధనలను ఉల్లంఘించి లేదా అనుమతులు పొందిన ప్లాన్లను అతిక్రమించి వెలసిన నిర్మాణాల క్రమబద్ధీకరణకు అవకాశం కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గతేడాది జనవరిలో బీపీఎస్-2019ని ప్రకటించింది. దాని కింద దరఖాస్తు చేసుకునే గడువు అదే సంవత్సరం ఆగస్టు 31వ తేదీతో ముగిసింది. అప్పటికి 41,462 దరఖాస్తులందాయి. బీపీఎస్-2019 నిబంధనల ప్రకారం దరఖాస్తు గడువు పూర్తయిన నాటి నుంచి 6 నెలల్లోపు అంటే.. ఈ నెల 29వ తేదీకల్లా అన్ని అప్లికేషన్ల పరిశీలన (ప్రాసెసింగ్)ను ఆయా పట్టణ స్థానిక సంస్థలు లేదా 'ఉడా'లు ముగించాల్సి ఉంది. పరిశీలనలో దరఖాస్తులను ఆమోదించడమో లేక తిరస్కరించడమో చేస్తారు. ఆమోదం పొందిన దరఖాస్తుదారులు క్రమబద్ధీకరణ రుసుము (పీనలైజేషన్ ఛార్జీలు)గా ఎంత చెల్లించాలో తెలియజేసి, వారు ఆ మొత్తాలను జమ చేయగానే వారికి చెందిన నిర్మాణాలు, కట్టడాలను క్రమబద్ధీకరిస్తారు.

ఒకవేళ తిరస్కరిస్తే, అందుకు కారణం తెలియజేస్తూ దరఖాస్తుదారుడికి సమాచారం పంపుతారు. దీని ప్రకారం.. బీపీఎస్ అమలులో దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ అత్యంత కీలకమూ, నిర్ణీత సమయంలో కచ్చితంగా పూర్తి చేయాల్సినదన్న విషయం ఎవరికైనా అర్థమవుతుంది. దీనివల్ల దరఖాస్తుదారులకు ఎంతో ఉపశమనం కలగడమే కాకుండా, అటు ప్రభుత్వానికి పెద్దమొత్తంలో ఆదాయం సమకూరుతుంది. కానీ.. యూఎల్‌బీలు, 'ఉడా'ల్లోని పట్టణ ప్రణాళికా విభాగపు సిబ్బంది అలసత్వంవల్ల ప్రభుత్వ లక్ష్యం కుంటుపడుతోంది. ఉన్నతాధికారులు ఎంతగా వెంటాడినా.. సిబ్బందిలో ఇంత అలసత్వానికి గల కారణమేమిటో అంతుబట్టడంలేదు. ఫలితంగా ప్రాసెసింగ్‌కు నిర్దేశించిన 6 నెలల గడువు దాదాపుగా ముగిసేసరికి మొత్తం 41,462 దరఖాస్తుల్లో గురువారం సాయంత్రానికి కేవలం 24,329 దరఖాస్తుల ప్రాసెసింగ్ మాత్రమే పూర్తయింది. ఇక.. 2 రోజుల గడువు (శుక్ర, శనివారాలు)లో మిగిలిన 17,133 దరఖాస్తుల పరిశీలన జరగాల్సి ఉంది. ఇక, ఆర్నెల్లలో 60 శాతం మాత్రమే చేయగలిగిన అధికారులు.. కేవలం రెండంటే రెండు రోజుల్లో మిగిలిన 40 శాతం దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను ఏ విధంగా ముగిస్తారో చూడాలిమరి!.

## లోకం తీరు




### ఉష్ణోగ్రతలు

| కేంద్రం | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| కడప | 36.0 | 22.0 |
| కర్నూలు | 35.5 | 24.1 |
| శ్రీకాకుళం | 33.5 | 22.0 |
| విజయవాడ | 33.1 | 23.8 |
| గుంటూరు | 32.7 | 21.4 |
| హైదరాబాద్ | 31.3 | 19.0 |

### ఈ వేసవిలో ఉష్ణోగ్రతలు హెచ్చే!

అమరావతి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది వేసవిలో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే కాస్త హెచ్చుగానే నమోదు కానున్నాయి. వివిధ రాష్ట్రాలతో పాటు ఆంధ్రలోనూ గతం కంటే ఒక సెల్సియస్ పెచ్చుగా ఉండనుంది. మార్చి, ఏప్రిల్, మే నెలల్లో ఎండలు బాగా ఉంటాయని.. 1982-2008 వాతావరణ స్థితిగతుల ఆధారంగా భారత వాతావరణ శాఖ(ఐఎండీ) అంచనా వేసింది. హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, పశ్చిమ రాజస్థాన్, అరుణాచల్‌ప్రదేశ్ కంటే ఇతర రాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు ఎక్కువగానే ఉంటాయని ఐఎండీ పేర్కొంది. హరియాణా, చండీగఢ్, ఢిల్లీ, పశ్చిమ ఉత్తర ప్రాంతాల్లో 0.5, మిగిలిన రాష్ట్రాల్లో 1 సెల్సియస్ పెరిగే అవకాశం ఉందని అంచనా ఉన్నట్లు అమరావతి వాతావరణ కేంద్రం గురువారం రాత్రి ఓ ప్రకటనలో వెల్లడించింది.



### బీజేపీ నయా జాతీయవాదానికి సావర్కర్ రక్షణ

బీజేపీ నయా జాతీయవాదం పేరుతో చేస్తున్న రాజకీయాలకు హిందూ సిద్ధాంతకర్త వీర్ సావర్కర్‌ను రక్షణగా ఉపయోగించుకుంటోంది. నిజానికి సావర్కర్‌పై బీజేపీకి ప్రేమ లేదు. మా ప్రభుత్వాన్ని విమర్శించే మహారాష్ట్ర బీజేపీ నేతలు సావర్కర్‌ను ఎందుకు గౌరవించడం లేదని కేంద్రాన్ని ప్రశ్నించాలి.

**- సామ్నా, శివసేన అధికార పత్రిక**



### శివసేన గాజులు తొడుక్కుందేమో.. మేము కాదు

మజ్లిస్ పార్టీ నేత వారిస్ పఠాన్ వ్యాఖ్యలపై మౌనంగా ఉన్న శివసేన గాజులు తొడుక్కుందేమో. మేము అలా కాదు. పఠాన్ వ్యాఖ్యలకు అదే రీతిన జవాబిచ్చే దమ్ము బీజేపీకి ఉంది. పఠాన్ వంటి వారికి ఎలా సమాధానమివ్వాలో మాకు బాగా తెలుసు.

**- దేవేంద్ర ఫడణవీస్, మహారాష్ట్ర బీజేపీ నేత**

### ధనుర్వాతానికి బూస్టర్ డోస్ అక్కర్లేదు

వాషింగ్టన్, ఫిబ్రవరి 27: చిన్నతనంలో అన్ని డోసుల డీటీపీ(డిఫ్తీరియా, టెటనస్, పెర్టుసిస్) టీకాను వేసుకుంటే అదే జీవితాంతం పనిచేస్తుందని, ప్రతీ పదేళ్లకొకసారి బూస్టర్ డోసు తీసుకోవాల్సిన అవసరం లేదని అమెరికా వైద్యులు తెలిపారు. చిన్నతనంలో అన్ని డోసులు తీసుకోనివారే బూస్టర్ డోసులు తీసుకోవాలని సూచించారు. ఓరేగావ్ హెల్త్ అండ్ సైన్స్ వర్సిటీకి చెందిన వైద్యులు 15 ఏళ్లపాటు కొన్ని లక్షల మందిపై పరిశోధనలు చేసి ఈ విషయాన్ని వెల్లడించారు. తల్లిదండ్రులు వారి పిల్లలకు చిన్నతనంలోనే టీకాలు వేయించాలని చెప్పారు. ఈ వివరాలను క్లినికల్ ఇన్ఫెక్షన్ డిసీస్ అనే జర్నల్‌లో ప్రచురించారు.

### ఉద్యోగ భద్రత లేకపోతే వ్యక్తిత్వంపై ప్రతికూల ప్రభావం

మెల్‌బోర్న్, ఫిబ్రవరి 27: ఉద్యోగ భద్రత లేకపోవడం మనిషి వ్యక్తిత్వంపై ప్రతికూల ప్రభావం చూపుతుందని ఆస్ట్రేలియా శాస్త్రవేత్తల పరిశోధనల్లో వెల్లడైంది. అభద్రతా భావం వల్ల భావోద్వేగాలను నియంత్రించుకోలేరని, ఇతరుల పట్ల సానుకూలంగా ఉండరని, నైతిక విలువలపైన కూడా ఆ ప్రభావం ఉంటుందని వారు చెప్పారు. 1,046 మందిపై 9 సంవత్సరాల పాటు అధ్యయనం నిర్వహించి ఈ విషయాన్ని వెల్లడించారు. "ఉద్యోగ భద్రత లేకపోవడం వల్ల ఎక్కువ పనిచేస్తారని చాలా మంది అనుకుంటారు. కానీ దీర్ఘకాలంలో వారి వ్యక్తిత్వం, సామాజిక సంబంధాలపైన ఇది ప్రతికూల ప్రభావం చూపిస్తుంది" అని తెలిపారు. ఈ వివరాలను అప్లైడ్ సైకాలజీ అనే జర్నల్‌లో ప్రచురించారు.



నామమా...

# స్మార్ట్‌సిటీ లోగోనా?

- గరుడ వారధిపై తిరునామాలతో చిక్కులు
- తెంగలై, వడగలై వర్గీయుల అభ్యంతరాలు
- పైనుంచి వాహనాల రాకపోకలపైనా వివాదం
- స్తంభంపై స్మార్ట్‌సిటీ లోగో వేసిన కార్పొరేషన్

తిరుపతి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న 'గరుడవారధి' స్తంభాలపై తిరునామాలు వేయడం వివాదాస్పదమైంది. వాహదారులకు ట్రాఫిక్ కష్టాలను నివారించి, తిరుమల వెళ్లే భక్తులకు సౌకర్యంగా ఉండేలా గరుడ వారధి పేరుతో భారీ ఫ్లైవోవర్‌ను తిరుపతి స్మార్ట్‌సిటీ కార్పొరేషన్, టీటీడీ సంయుక్త భాగస్వామ్యంతో నిర్మిస్తున్నారు. ప్రస్తుతం పిల్లర్ల నిర్మాణం చురుగ్గా సాగుతోంది. వారధి పొడవునా పిల్లర్లపై శ్రీవారి తిరునామాలు అచ్చుపోసేలా డిజైన్ రూపొందించారు. అయితే వాహనాలు వెళ్లే వారధికి దిగువన తిరునామాలు చెక్కడంపై వివాదం చెలరేగింది. స్వామి నామాలు ఉండే స్తంభాలపై నుంచి వాహనాలు వెళ్లడం అపచారమని, భక్తుల మనోభావాలు దెబ్బతింటాయని కొందరు అభ్యంతరం చేస్తున్నారు. మరోవైపు ఆ నామాలు వైష్ణవ సంప్రదాయాల్లోని 'తెంగలై' వర్గానికి చెందిన నామాలను పోలి ఉన్నాయంటూ 'వడగలై' వర్గీయులు టీటీడీకి, కార్పొరేషన్‌కు ఫిర్యాదు చేసినట్టు సమాచారం. దీంతో వడగలై వర్గీయుల అభ్యర్థన మేరకు ఓ స్తంభంపై ఒకవైపున శ్రీవారికి అలంకరించే నామం తరహాలో పెయింట్ వేసి చూపించారు. మరోవైపు తొలుత వేసిన తెంగలై తరహా నామాన్ని ఉంచారు. అయితే రెండో వర్గీయులు దీనితో సంతృప్తి చెందలేదని తెలుస్తోంది. గరుడ వారధికి తమవాటా నిధులు విడుదల చేసిన తర్వాత నామాల గురించి మాట్లాడే ఆలోచనలో టీటీడీ ఉంది. భక్తుల మనోభావాలకు అనుగుణంగా స్తంభాలపై నామాలు పూర్తిగా తీసేసే యోచన కూడా ఉన్నట్టు తెలుస్తోంది. ఈ విషయంలో టీటీడీదే తుది నిర్ణయమని, నామాలు తీసేయమంటే పూర్తిగా తీసేసి, ఆ స్థానంలో స్మార్ట్‌సిటీ లోగోలు వేస్తామని కార్పొరేషన్ అంటోంది. అందుకు తగ్గట్టుగానే గురువారం ఒక స్తంభానికి ఒకవైపు స్మార్ట్‌సిటీ లోగో వేశారు. మరి తిరునామాలపై టీటీడీ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాలి.



## ఏప్రిల్ 20 నుంచి ఎంసెట్

- రేపటి నుంచి దరఖాస్తుల స్వీకరణ

అమరావతి (ఆంధ్రజ్యోతి), జేఎన్టీయూకే, ఫిబ్రవరి 27: ఏపీ ఎంసెట్-2020 నోటిఫికేషన్ విడుదలైంది. జేఎన్టీయూకే గురువారం ఈ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈనెల 29 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ మొదలు కానుంది. ఏప్రిల్ 20 నుంచి 23 వరకు ఆన్‌లైన్ ఎంసెట్ ఇంజనీరింగ్ పరీక్ష.. 23, 24 తేదీల్లో అగ్రికల్చర్ మెడికల్ పరీక్ష జరగనుంది. రెండు విభాగాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఏప్రిల్ 22, 23 తేదీల్లో పరీక్ష నిర్వహిస్తారు. అభ్యర్థులు ఒక స్ట్రీమ్‌కు రూ.500, రెండు స్ట్రీమ్‌లకు అయితే రూ.1000 ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఎటువంటి ఆలస్య రుసుం లేకుండా మార్చి 29 వరకు, రూ.500 ఆలస్య రుసుంతో ఏప్రిల్ 5 వరకు, రూ.1000 ఆలస్య రుసుంతో ఏప్రిల్ 10 వరకు, రూ.5000 ఆలస్య రుసుంతో ఏప్రిల్ 15 వరకు, రూ.10,000 ఆలస్య రుసుంతో ఏప్రిల్ 19 వరకు దరఖాస్తులు సమర్పించవచ్చు. ఏప్రిల్ 16 నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈసారి ఎంసెట్ దరఖాస్తులోనే ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ అమలు కానుందని అర్హులైన వారు వినియోగించుకోవచ్చని ఎంసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ వి.రవీంద్ర తెలిపారు. ఏపీతో పాటు తెలంగాణలోని హైదరాబాద్‌లో కూడా పరీక్షా కేంద్రాలు కేటాయించనున్నామన్నారు. ఎంసెట్ ర్యాంకుల నిర్ధారణలో ఎంసెట్ మార్కులను 75 శాతం, ఇంటర్ మార్కులను 25 శాతం కింద పరిగణిస్తామని తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు https://sche.ap.gov.in/eamcet వెబ్‌సైట్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు.

## ఏపీ నిట్‌లో ఎంటెక్ కోర్సులు

తాడేపల్లిగూడెం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఏపీ నిట్)లో ఈ ఏడాది నుంచి ఎంటెక్ కోర్సులను ప్రారంభించనున్నారు. శాశ్వత క్యాంపస్ నిర్మాణం అందుబాటులోకి రావడంతో కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ ఎంటెక్ కోర్సులకు అనుమతులు మంజూరు చేసింది. న్యూఢిల్లీలో బుధవారం నిర్వహించిన బీవోజీలో ఈ విషయమై చర్చించారు. ఆగస్టు నుంచి అడ్మిషన్‌లు ఇచ్చేలా ఆమోదముద్ర వేశారు. ఈ మేరకు కంప్యూటర్ సైన్స్, బయో టెక్నాలజీ, మెకానికల్, సీఈసీ, ఈఈఈ, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, మైక్రోబయాలజీ, మెటలర్జీ తదితర ఇంజనీరింగ్ విభాగాల్లో ఎంటెక్ కోర్సులను ప్రారంభించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ ఏడాది ఆగస్టు నుంచి అడ్మిషన్‌లు ప్రారంభించనున్నారు.

# సీఎస్.. ఇదేం పని?

### ఆరోపణలేంటో చెప్పకుండా కేసు ఎలా పెట్టాలన్నారు?

- సీఈవోపై జూనియర్‌తో ఫిర్యాదా?
- ఆపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడమా?
- మీరేం చేశారో అర్థం కావడం లేదు
- క్రమశిక్షణ చర్యలు పూర్తయ్యేదాకా సస్పెన్షన్ ఎలా కొనసాగుతుంది?
- డిప్యుటేషన్‌లో ఉద్యోగి తప్పులు చేస్తే ఆయన సొంత శాఖకు నివేదించాలి
- కృష్ణకిశోర్ కేసులో క్యాట్ ఆసక్తికర వ్యాఖ్యలు





అమరావతి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీలం సాహ్ని తీరును కేంద్ర పరిపాలనా ట్రిబ్యునల్ (క్యాట్) ఆక్షేపించింది. అఖిల భారత రెవెన్యూ (ఐఆర్ఎస్) అధికారి జాస్తి కృష్ణకిశోర్ విషయంలో సీఎస్ ఇచ్చిన ఆదేశాలు అర్థం కాని రీతిలో ఉన్నాయని ఆక్షేపించింది. ఆయన సస్పెన్షన్ ఉత్తర్వులను రద్దుచేస్తూ క్యాట్ చైర్మన్ జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి, సభ్యుడు బి.వి.సుధాకర్ ఇటీవల తీర్పు ఇచ్చిన సంగతి తెలిసిందే. కృష్ణకిశోర్ సస్పెన్షన్‌కు ముందు ఆయనపై కేసు నమోదు చేయాలని సీఎస్ ఇచ్చిన ఆదేశాలను క్యాట్ అందులో ప్రముఖంగా ప్రస్తావించింది. ఇది చాలా అరుదైన కేసు. అఖిల భారత సర్వీసు అధికారిపై కేసు నమోదు చేసి.. అక్రమాలపై విచారణ చేయాలని నేరుగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశించడం చాలా అరుదు. సహజంగా ఏ ఉద్యోగైనా తప్పు చేస్తే.. అది చట్టప్రకారం శిక్షార్హమవుతుంది. దీనికి సంబంధిత విభాగం తగిన అనుమతులు తీసుకుని కేసు నమోదు చేసి విచారణ చేస్తారు. ఆ తర్వాత ఆ ఉద్యోగిని అరెస్టు చేస్తే దాని పర్యవసానంగా సస్పెండ్ అవుతారు. ఆ తర్వాత చార్జిషీటు నమోదు చేస్తారు. కానీ ఇక్కడ ఎలాంటి ఫిర్యాదు లేదు.. దర్యాప్తు సంస్థ నుంచి ఇంకా ఎలాంటి చర్యలు మొదలే కాలేదు. కానీ రాష్ట్రానికి డిప్యుటేషన్‌పై వచ్చిన.. కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన ఓ సీనియర్ అధికారిపై కేసు నమోదు చేయాలని సీఎస్ ఎలా ఆదేశించారో అర్థం కాని అంశంగా ఉంది. ఇంతటి తీవ్రమైన, సున్నితమైన అంశంలో తగిన పరిశీలన చేసినట్లుగా కనిపించడం లేదు. ఇక సీఎస్ ఇచ్చిన ఆదేశాలకు కట్టుబడి, ఓ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ గత ఏడాది డిసెంబరు 15న సీఈవోపై ఫిర్యాదు చేశారు. ఓ సబార్డినేట్ అధికారి తన సీఈవోపై ఫిర్యాదు చేయడం, దాని ఆధారంగా ఎఫ్ఐఆర్ నమోదుచేయడం చాలా ఆసక్తికరమైన అంశం అని అభిప్రాయపడింది.

#### చార్జ్‌మెమో కూడా లేదుగా..!

కృష్ణకిశోర్ సస్పెన్షన్ ఉత్తర్వులో ఈ కేసుకు సంబంధించి ఎలాంటి తీవ్రమైన అభియోగాలను ప్రస్తావించలేదని, కనీసం ఎలాంటి చార్జ్‌మెమోను కూడా పేర్కొనలేదని క్యాట్ ఆక్షేపించింది. క్రమశిక్షణ చర్యలు పూర్తయ్యేవరకు సస్పెన్షన్ కొనసాగుతుందని పేర్కొనడం మరో ఆసక్తికరమైన అంశమని తన తీర్పులో పేర్కొంది. ఈ చర్య సీసీఎస్ రూల్స్‌కు విరుద్ధమని స్పష్టం చేసింది. సస్పెన్షన్ ఉత్తర్వు 90 రోజుల పాటే అమల్లో ఉంటుంది. అప్పటికీ ఎలాంటి చార్జ్‌మెమో ఇవ్వకపోతే ఆ ఉత్తర్వును సమీక్షించాలి. చార్జ్‌మెమో ఇచ్చిన తర్వాత కూడా.. క్రమశిక్షణ చర్యలు ముగిసేవరకు సస్పెన్షన్ కొనసాగుతుందన్న ప్రశ్నే ఉత్పన్నం కాదు. కాబట్టి ఇది ఏ కోణంలో చూసినా చట్టబద్ధమైనది కాదు. ఒక ఉద్యోగి డిప్యుటేషన్‌లో ఉన్నప్పుడు.. ఆయనపై చర్యలు తీసుకునే అధికారం డిప్యుటేషన్ ఇచ్చిన విభాగానికి ఉంటుంది. అయితే దీనికి కొన్ని పరిమితులు ఉంటాయి. డిప్యుటేషన్ కాలంలో ఉద్యోగి తప్పులుచేస్తే వాటిని ఆయన సొంత శాఖకు నివేదించాలి. అప్పుడు ఆ విభాగం డిప్యుటేషన్ రద్దుచేసి వెనక్కి పిలిపించడమో లేక చర్యలు తీసుకోవాలనో అనుమతి ఇస్తుంది. అప్పుడు డిప్యుటేషన్‌కు తీసుకున్న విభాగం గౌరవం పెరుగుతుంది. కానీ ఈ కేసులో ఇలాంటి చర్యలేవీ తీసుకున్న దాఖలాలు లేవు. కౌంటర్ అఫిడవిట్‌లోనూ ఈ అంశాలను ప్రస్తావించలేదు' అని క్యాట్ పేర్కొంది. ఈ సందర్భంగా పలు పాత కేసుల్లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులను కూడా ప్రస్తావించింది. డిప్యుటేషన్ సమయంలో, దాని కాలపరిమితి ముగిశాక తిరిగి ఉద్యోగిని సొంత శాఖకు పంపించే విషయంలో అనుసరించాల్సిన పద్ధతులను వివరించింది. ఎగత ఏడాది జూలైలోనే ఈడీబీ సీఈఓగా జాస్తి కృష్ణకిశోర్‌ను తప్పించారు. ఐదు నెలల పాటు ఆయన్ను ఖాళీగా ఉంచారు. ఈ కాలంలో ఆయన ఎలాంటి అభ్యంతరకరమైన పనులు చేసినట్లుగా ఎక్కడా ప్రస్తావించలేదు. ఉమాపతి చౌదరి వర్సెస్ స్టేట్ ఆఫ్ బిహార్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల ప్రకారం.. డిప్యుటేషన్ అంటే ఒక ఉద్యోగికి మరో విభాగంలో ప్రత్యేకమైన అసైన్‌మెంట్ అప్పగించడం అన్నమాట. ప్రజాప్రయోజనం కోసమే డిప్యుటేషన్ ఇస్తుంటారు. ఇది ఏకాభిప్రాయంతో కూడినది. డిప్యుటేషన్ తీసుకునే విభాగం, సొంత శాఖతో పాటు ఉద్యోగి అంగీకారం కూడా ఉండాలి. అయితే ఎప్పుడైనా తాను సొంత శాఖకు వెళ్లాలనుకున్నప్పుడు సొంత శాఖ, ఉద్యోగి సమ్మతి ఉంటే సరిపోతుంది. అయితే ఈ కేసులో ఉద్యోగితోపాటు, ఆయన సొంత విభాగమూ వెనక్కి రావడానికి అంగీకరించాయి అని గుర్తుచేసింది.

## పది వేల ఎకరాలు సిద్ధం : సీఎస్ నీలం సాహ్ని

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 27 : ఉగాదికి రాష్ట్రంలోని అర్హులైన పేదలందరికీ ఇళ్ల పట్టాలు అందజేసేందుకు 10 వేల ఎకరాల ప్రభుత్వ భూమిని సిద్ధం చేశామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీలం సాహ్ని వెల్లడించారు. తూర్పుగోదావరి జిల్లా కాకినాడలో గురువారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా నీలం సాహ్ని మీడియాతో మాట్లాడారు. ూరాష్ట్రంలో 22.30 లక్షల మంది లబ్ధిదారులు ఉన్నారు. వారందరికీ ఒకేసారి స్థలం పట్టాలు అందజేసేందుకు చర్యలు చేపడుతున్నాం. అన్ని జిల్లాల కంటే అత్యధికంగా తూర్పుగోదావరి జిల్లాలో 3.10 లక్షల మంది లబ్ధిదారులు ఉన్నారు. వారికి అవసరమైన భూమిని సేకరించడం, పట్టాలు అందించే ప్రక్రియను తూర్పుగోదావరి కలెక్టర్ మురళీధర్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ లక్ష్మీషా విజయవంతంగా పూర్తి చేస్తున్నారు. విశాఖపట్నంలో ఇళ్ల స్థలాల కోసం ల్యాండ్ పూలింగ్‌లో భూ సేకరణ చేపడుతున్నాం అని వివరించారు.

## 26 లక్షల మందికి స్థలాలు : ప్రవీణ్ ప్రకాశ్

బాపట్ల, ఫిబ్రవరి 27: జగనన్న ఇళ్లస్థలాల కార్యక్రమం ద్వారా రాష్ట్రంలో 26 లక్షల మందికి నివేశన స్థలాలు పంపిణీ చేయనున్నామని, చారిత్రాత్మకమైన ఈ కార్యక్రమానికి మార్చి 25న అంకురార్పన చేస్తున్నామని ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ వెల్లడించారు. గుంటూరు జిల్లా బాపట్లలో కలెక్టర్ శామ్యూల్ ఆనంద్‌కుమార్‌తో కలిసి ఆయన పేదల స్థలాల కోసం నివేశన భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో ప్రవీణ్ ప్రకాశ్ మాట్లాడారు. "పేదల స్థలాల సేకరణలో తూర్పు గోదావరి, గుంటూరు జిల్లాలు మాత్రమే వెనుకబడి ఉన్నాయి. కృష్ణా, ప్రకాశంజిల్లాల్లో ప్రక్రియ చివరి దశకు చేరుకొంది. గుంటూరు జిల్లాలో 2. 50లక్షలు పైచిలుకు లబ్ధిదారులకు పట్టాలు ఇస్తాం. నివేశన స్థలాలకు గతంలో డీ ఫారాల పట్టాలు ఇచ్చేవారు. ఇప్పుడు నేరుగా తహసీల్దార్ రిజిస్ట్రేషన్ చేసి.. లబ్ధిదారుడికి ఆ స్థలంపై అన్నిరకాల హక్కులు కల్పించనున్నాం. దేశంలో ఎక్కడా లేని విధానమిది" అని వివరించారు.

## 1094 గ్రామాల్లో వాల్టా చట్టం అమలు

- భూగర్భ జలవినియోగ నిషేధం పొడిగింపు

అమరావతి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భూగర్భ జలవనరుల సంరక్షణకు ఏపీ వాటర్, ల్యాండ్ అండ్ ట్రీస్ యాక్ట్ 2002(వాల్టా) ద్వారా భూగర్భజల వాడకంపై నిషేధాన్ని పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. భూగర్భ జలవనరులు అడుగంటి 11 జిల్లాల్లోని 1094 గ్రామాలు దుర్భిక్షం ఎదుర్కొంటున్నాయని భూగర్భజల వనరులశాఖ గుర్తించింది. ఈ గ్రామాల్లో బోర్లు వేసి నీటిని వినియోగించేందుకు ప్రస్తుతం వాల్టా చట్టం ప్రకారం ఉన్న నిషేధాన్ని తిరిగి ఆదేశాలిచ్చే వరకూ పొడిగిస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది ఆదేశాలిచ్చారు.

## ఎస్సీ కార్పొరేషన్ ఆస్తుల పంపిణీకి కమిటీ

అమరావతి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఎస్సీ ఫైనాన్స్ కార్పొరేషన్ స్థానంలో ప్రభుత్వం మాదిగ, మాల, రెల్లి ఫైనాన్స్ కార్పొరేషన్లను తీసుకొచ్చిన నేపథ్యంలో వాటి ఆస్తులను మూడు కార్పొరేషన్లకు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేసింది. ఏపీ ఎస్సీ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ మెంబర్ కన్వీనర్‌గా, ఆర్థికశాఖ అసిస్టెంట్ సెక్రెటరీ ఐఎస్‌వీఎస్ సుబ్రమణ్యం, సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ సెక్రటరీ, ఎన్ఐసీకి చెందిన అలైస్ సైంటిస్ట్‌ను సభ్యులుగా నియమిస్తూ సాంఘిక సంక్షేమశాఖ కార్యదర్శి ముద్దాడ రవిచంద్ర ఉత్తర్వులు జారీచేశారు.

## కృష్ణా, గోదావరి కాల్వల ప్రక్షాళనకు అపెక్స్ కమిటీ

అమరావతి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): కృష్ణా, గోదావరి డెల్టా కాలువలను శుభ్రం చేయడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'ఏపీ మిషన్ ఫర్ కృష్ణా, గోదావరి'కి ఎన్జీవోలతో అపెక్స్ కమిటీని నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులిచ్చింది. ఈ మిషన్‌కు ముఖ్యమంత్రి చైర్మన్‌గా, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వైస్ చైర్మన్‌గా, మిషన్ డైరెక్టర్ సభ్యకార్యదర్శిగా, పంచాయతీరాజ్, మున్సిపల్, జలవనరులశాఖల ముఖ్యకార్యదర్శులు ఎక్స్‌అఫీషియో సభ్యులుగా వ్యవహరిస్తారు. అలాగే, నదులను శుభ్రపర్చడం, కంపోస్టు యూనిట్ల నిర్వహణలో అనుభవమున్న ఆరుగురు పర్యావరణ వేత్తలు, ఎన్జీవో ప్రముఖులను ప్రభుత్వం నామినేట్ చేసింది. ఇందులో హైదరాబాద్‌కు చెందిన సామాజిక కార్యకర్తలు పిన్నమనేని రాజశ్రీ, కల్లు పరూష, షీటల పర్మార్, సి.సంస్మృతరెడ్డి, ఉపాధ్యాయిని వేములపల్లి సునీత, న్యాయవాది టి. సుజన్‌కుమార్‌రెడ్డి ఉన్నారు.


ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలికవసతుల సంస్థ లిమిటెడ్
(ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రంగ సంస్థ)
చీఫ్ ఇంజినీర్ (నార్త్) కార్యాలయం, APIIC లిమిటెడ్, 9వ అంతస్తు APIIC టవర్స్, IT పార్క్, మంగళగిరి, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన
(రివర్స్ టెండరింగ్)
టెండరు ప్రకటన నం. 29,38,39/CE(N)/APIIC/2019-20, తేది: 25.02.2020
టెండరు ప్రకటన నం.29: కృష్ణాజిల్లా, మల్లవల్లి, స్టేట్‌ఫుడ్ పార్క్ వద్ద వరద నీటి డ్రెయిన్ల నిర్మాణంతో కలిపి మిగిలిన అంతర్గత రోడ్ల నిర్మాణం. ECV: రూ.2,10,46,884.00/-
టెండరు ప్రకటన నం.38: గుంటూరు జిల్లా, ఇండస్ట్రియల్ నడికుడి ఫేజ్-1 వద్ద అంతర్గత రోడ్లుMR-6, CR-I (P), CR-2 (P) మరియు CR-3 పటిష్ట పరుచుట (IALA క్రింద) ECV: రూ.34,40,590.00
టెండరు ప్రకటన నం.39: IALA నిధులతో విజయవాడ వద్ద బందరు రోడ్ నుండి ఇండస్ట్రియల్ పార్క్‌లో పంటకాలువ రోడ్ వరకు 100'-0" రోడ్‌కు WMM, BM & SDBC ఏర్పాటు చేయుట. ECV: రూ.70,30,375.00/-
బిడ్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 28.02.2020న సా.6.00 గం.ల నుండి, బిడ్ దాఖలుకు ఆఖరి తేది: 16.03.2020న మ.3.00గం. వరకు.
టెండరు ప్రకటన వివరాలు మరియు బిడ్ డాక్యుమెంట్లను www.apeprocurement.gov.in నుండి డౌన్‌లోడ్ చేసుకొనవచ్చును.
సం/- చీఫ్ ఇంజినీర్ (నార్త్)APIIC లిమిటెడ్,మంగళగిరి



APGVB ANDHRA PRADESH GRAMEENA VIKAS BANK
Head office :: Warangal
NOTICE FOR INVITING TENDERS
(Refer Tender(s) Notice APGVB/PER&HRD/TENDERS/HOUSEKEEPING/29 & 30/2019-20, Dated: 24/02/2020)
Sealed Tender(s) documents are invited for HOUSEKEEPING SERVICES (Sweeping, Cleaning & Maintenance of Branches/Offices) at Telangana & Andhra Pradesh States for APGVB. For details, see tender documents placed in our Banks' website: www.apgvbank.in. The last date for submission of tenders are 16/03/2020 at HO, Warangal.
General Manager (I)


# కర్నూలులో తిరగనివ్వం

- రౌడీషీటర్లు, హంతకులకు భయపడేవాళ్లం కాదు
- మంత్రి అనిల్‌కు ఎమ్మెల్యే ఆర్థర్ అనుచరుల హెచ్చరిక
- ఎమ్మెల్యే సమక్షంలో జరిగిన సమావేశంలోనే ఘటన
- వైసీపీలో పతాక స్థాయికి వర్గ పోరు

కర్నూలు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): అధికార వైసీపీలో వర్గపోరు పతాకస్థాయికి చేరింది. కర్నూలు జిల్లా నందికొట్కూరు ఎమ్మెల్యే ఆర్థర్ నివాసంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలోనే ఆయన అనుచరులు జలవనరుల మంత్రి అనిల్ కుమార్‌కు తీవ్ర హెచ్చరికలు చేశారు. మంత్రి అనిల్‌ని జిల్లాలో ఎక్కడా తిరగనివ్వబోమన్నారు. సమావేశంలో పలువురు కార్యకర్తలు మాట్లాడుతూ మంత్రి అనిల్ కుమార్‌తోపాటు వైసీపీ నాయకుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డిపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. 'జిల్లాలో ఇంకో నియోజకవర్గ వ్యవహారంలో జోక్యం చేసుకున్నావా? నందికొట్కూరులోనే అత్యుత్సాహమెందుకు? ఎస్సీ అభ్యర్థి అంటే అంత చులకనా! మార్కెట్ కమిటీని యథావిధిగా ప్రమాణ స్వీకారం చేయించకుంటే బిడ్డా.. మళ్లీ కర్నూలులో అడుగు కూడా పెట్టవు. ఇప్పట్నుంచి అనిల్ కుమార్ ఎక్కడ అడుగు పెట్టినా ఎదుర్కోవాలే! నేరస్థులు, హంతకులు, రౌడీషీటర్లకు భయపడే వాళ్లం కాదు' అంటూ ఆర్థర్ అనుచరులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నందికొట్కూరు మార్కెట్ యార్డు చైర్మన్ పదవిని తమ వర్గానికి ఇవ్వాలంటూ ఎమ్మెల్యే ఆర్థర్ ఒక పేరును పార్టీ అధిష్ఠానానికి పంపారు. అయితే తమ వర్గానికి కూడా న్యాయం చేయాలంటూ సిద్ధార్థ రెడ్డి కూడా మరో పేరును ప్రతిపాదించారు. సిద్ధార్థ రెడ్డి వైపే పార్టీ మొగ్గు చూపుతోందని, అందుకు మంత్రి అనిల్ మద్దతు పలుకుతున్నారని స్థానికంగా విమర్శలు హల్‌చల్ చేస్తున్నాయి. స్థానికంగా అనేక కాంట్రాక్టులపై కూడా సిద్ధార్థ రెడ్డి జోక్యం చేసుకుంటున్నారని ఎమ్మెల్యే అనుచరులు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలోనే వర్గ పోరు మొదలైనట్టు తెలుస్తోంది. నియోజకవర్గంలో ఇప్పటికే పార్టీలో చీలికలు ఏర్పడి అధిష్ఠానానికి తలనొప్పిగా మారింది. ఈ క్రమంలో నేటికీ యార్డు చైర్మన్లపై ఉత్తర్వులు జారీ కాలేదు. కాగా పార్టీలో కొందరు కార్యకర్తల్ని చేర్చుకుంటున్నామంటూ ఎమ్మెల్యే అనుచరులు సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే ఆర్థర్ ఉండగానే ఈ హెచ్చరికలు చేయడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. కర్నూల్లో ఇప్పటికీ ఏ నీటి ప్రాజెక్టు చేపట్టకపోవడంతో వైసీపీపై జిల్లావాసులు గుర్రుగా ఉన్నారు. ఈ క్రమంలో ఎమ్మెల్యేల రూపంలో రోజుకో వివాదం ఆ పార్టీ పరువును బజారున పడేస్తోంది. ఈనెల 18న కర్నూలు వచ్చిన సీఎం సభలోనూ సిద్ధార్థరెడ్డికి అవమానం తప్పలేదు. కాన్వాయ్ వస్తున్న క్రమంలో ఆ పక్కనే నడుస్తున్న ఆయనను భద్రతా సిబ్బంది పక్కకు తోసేశారు. దీంతో అధికారులతో సిద్ధార్థకు కొద్దిపాటి వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో నియోజకవర్గంతోపాటు జిల్లాలోనూ తనపై వివాదాలు సృష్టిస్తున్నారని నాయకుల వద్ద సిద్ధార్థరెడ్డి వాపోయినట్లు సమాచారం.

## వైసీపీ రాష్ట్ర కార్యదర్శిపై ఎమ్మెల్సీ దాడి

హిందూపురం, ఫిబ్రవరి 27: అనంతపురం జిల్లాలో వైసీపీ నేతల మధ్య విభేదాలు... దాడుల వరకూ వెళ్లాయి. ఉగాదికి ఇచ్చే ఇళ్ల స్థలాల చదును విషయంలో మాటామాటా పెరిగి వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కొటిపి హనుమంతరెడ్డిపై ఆ పార్టీ ఎమ్మెల్సీ, అధికార ప్రతినిధి మహ్మద్ ఇక్బాల్ దాడిచేశారన్న వార్త హిందూపురంలో ఉద్రిక్తతకు దారి తీసింది. కొటిపి వద్ద పట్టణ ప్రజలకు ఇళ్ల స్థలాల కోసం కేటాయించిన భూమిని ఎమ్మెల్సీ వర్గీయులు కొన్ని రోజులుగా చదును చేస్తున్నారు. ఈ పనులను హనుమంతరెడ్డి అడ్డగించి.. మాట్లాడేందుకు ఎమ్మెల్సీ మహ్మద్ ఇక్బాల్ ఇంటికి వెళ్లాడు. అక్కడ ఇరువురి మధ్య మాటామాటా పెరిగి జరిగిన ఘర్షణలో హనుమంతరెడ్డి ముక్కులోంచి రక్తస్రావమైంది. ఎమ్మెల్సీ తన ముఖంపై పిడిగుద్దులు గుద్దినట్లు హనుమంతరెడ్డి చెప్పారు. దీనిపై ఇక్బాల్ స్పందిస్తూ... తన ఇంటి వద్దకు హనుమంతరెడ్డి వచ్చారని, అయితే తామెవరూ దాడి చేయలేదని చెప్పారు.



గవర్నర్ చేతుల మీదుగా గోల్డ్‌మెడల్ అందుకుంటున్న కర్రి రామారెడ్డి

## 65 ఏళ్ల వయస్సులో గోల్డ్‌మెడల్

- న్యాయశాస్త్రంలో డా. రామారెడ్డికి బంగారు పతకం

ఏఎన్‌యూ/రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 27: చదువుకోవాలన్న ఆసక్తి.. నిరంతర సాధన ఉంటేచాలు విద్యార్జనకు వయసుతో సంబంధం లేదు. లేటు వయసులోనూ డిగ్రీలు మన సొంతమవుతాయి. రాజమహేంద్రవరానికి చెందిన ప్రముఖ మానసిక వైద్యనిపుణులు కర్రి రామారెడ్డి ఇదే విషయాన్ని మరోమారు నిరూపించారు. డాక్టర్‌గా పనిచేస్తున్నప్పటికీ మిగిలిన వృత్తులకు సంబంధించిన కోర్సులను సైతం అలవోకగా పూర్తిచేస్తూ ఇప్పటివరకూ 30 డిగ్రీలు అందుకున్న రామారెడ్డి తాజాగా.. 65 ఏళ్ల వయసులో న్యాయశాస్త్రంలో గోల్డ్‌మెడల్ సాధించి అందరికీ స్ఫూర్తిగా నిలిచారు. ఈ క్రమంలో మరో బంగారు పతకాన్ని ఆయన ఖాతాలో వేసుకున్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో దూరవిద్యలో న్యాయశాస్త్రం అభ్యసించిన ఆయన నాలుగు ఎల్ఎల్ఎం కోర్సుల్లోని నాలుగు బ్రాంచ్‌లలో కలిపి అగ్రస్థానంలో నిలిచారు. ఈ క్రమంలో 'ప్రొఫెసర్ ఏకసిరి రాజా హరగోపాలరెడ్డి, విజయలక్ష్మి గోల్డ్ మెడల్‌ను సొంతం చేసుకున్నారు. గురువారం జరిగిన స్నాతకోత్సవంలో గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ చేతులమీదుగా ఆయన గోల్డ్‌మెడల్ అందుకున్నారు. రామారెడ్డి రాజమహేంద్రవరంలో మానసిక వైద్యశాలను నడుపుతూ విద్యా రంగంలో కూడా రాణించడం విశేషం. ప్రస్తుతం ఆయన ఆంధ్రా యూనివర్సిటీలో ఎంఏ ఫిలాసఫీ, పాండిచ్చేరి యూనివర్సిటీలో యోగా థెరపీపై పీహెచ్ డీ, కేరళ యూనివర్సిటీలో సర్టిఫికెట్ కోర్సు, లాలో పీహెచ్‌డీ చేస్తున్నారు.

## మహిళా పోలీసు.. చదువుల్లో ఫస్టు!



గవర్నర్ నుంచి పతకాలు అందుకుంటున్న గీతాంజలి

అమరావతి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): గ్రామ సచివాలయంలో పనిచేస్తున్న మహిళా పోలీసు సాళ్లూరి గీతాంజలి మూడు బంగారు పతకాలను గవర్నర్ చేతులమీదుగా అందుకున్నారు. తెనాలి మండలం మల్లెపాడు గ్రామ సచివాలయ మహిళా పోలీసుగా ఇటీవల ఉద్యోగం సంపాదించుకున్న ఆమె.. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ స్నాతకోత్సవంలో గురువారం గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ నుంచి అందుకున్నారు. ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీలో టాపర్‌గా నిలిచి ఒక బంగారు పతకం దక్కించుకోగా, మిగిలిన రెండు పతకాలు కెమిస్ట్రీలోని అన్ని విభాగాల్లో 78 శాతం మార్కులు సాధించినందుకు ఇచ్చారు.

## 30 మందితో ఇంటర్ బోర్డు పునర్వ్యవస్థీకరణ

అమరావతి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ బోర్డును ప్రభుత్వం 30 మందితో పునర్వ్యవస్థీకరించింది. ఈ బోర్డుకు విద్యాశాఖ మంత్రి చైర్మన్‌గా వ్యవహరిస్తారు. 9 మంది ఎక్స్ అఫిషియో మెంబర్లు, 14 వర్సిటీల వైస్‌చాన్సెలర్లు, ఆర్థికశాఖ జాయింట్ సెక్రెటరీ, ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్, నలుగురు డిగ్రీ కాలేజీల ప్రిన్సిపాల్స్ మెంబర్లుగా ఈ బోర్డు ఏర్పాటైంది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బి.రాజశేఖర్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు.

## తీరప్రాంత రక్షణకు మరో కోస్ట్‌గార్డ్ సిద్ధం

చెన్నై, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): సముద్రతీర రక్షణకు ఉపయోగపడే కోస్ట్‌గార్డ్ నౌక గురువారం జలప్రవేశం చేసింది. ఎల్‌అండ్‌టీ ప్రైవేటు నౌకా నిర్మాణ సంస్థతో ఏడు ఆధునిక పెట్రోలింగ్ నౌకల తయారీకి 2015లో కుదిరిన ఒప్పందం మేరకు 6వ నౌకను గురువారం కోస్ట్‌గార్డ్‌కు అప్పగించారు.

# 'బీమా' భ్రమే!

- అయోమయంలో వైఎస్సార్ బీమా పథకం
- రూ.350కోట్లు ప్రీమియం కట్టిన ప్రభుత్వం
- అయినా బాధితులకు అందని క్లెయిములు
- సాయంకోసం 50వేల కుటుంబాల ఎదురుచూపులు

అమరావతి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వైఎస్సార్ బీమా అమలవుతోందో, లేదో తెలియని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం ప్రీమియం చెల్లించినా బాధితులకు క్లెయిములు మాత్రం అందడం లేదు. వైఎస్సార్ బీమా కింద అర్హత ఉండి ఇంకా క్లెయిమ్స్ రూపంలో ప్రయోజనాలు అందాల్సిన కుటుంబాలు 50వేల వరకు ఉంటాయని సమాచారం. గతంలో చంద్రన్న బీమా పేరుతో ఈ పథకం విజయవంతంగా అమలైంది. దీని అమల్లో దేశంలో ఏపీనే నంబర్ వన్‌గా ఉండేది. రూ.800కోట్లు ప్రీమియం చెల్లించి రూ.2,000కోట్ల వరకు క్లెయిమ్స్ పరిష్కరించారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దీనిపేరు వైఎస్సార్ బీమాగా మార్చారు. ప్రీమియం కింద రూ.350కోట్లు చెల్లించారు. కానీ, అర్హులకు క్లెయిమ్స్ మాత్రం అందడం లేదు. ప్రీమియం చెల్లించారు కాబట్టి మార్చి వరకు ఈ పథకం అమల్లో ఉన్నట్టే లెక్క. కానీ క్లెయిములు ఎందుకు జరగడం లేదో ఎవరూ చెప్పలేకపోతున్నారు. గతంలో చంద్రబాబు హయాంలో ఏపీలో క్లెయిముల శాతం ఎక్కువగా ఉండడంతో బీమా కంపెనీలు ఈ పథకం నిర్వహణకు ముందుకు రాలేదు. దీంతో టెండర్లు నిర్వహించి ఎల్-1గా నిలిచిన వారికి బాధ్యతలు అప్పగించాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. దీనిపై సీఎం కార్యాలయానికి పంపిన ప్రతిపాదన ఫైలు ఇంకా అక్కడే ఉంది. రాష్ట్రంలో 2.6కోట్ల మంది అసంఘటిత రంగ కార్మికులకు ఈ పథకం అమలు కావాల్సి ఉంది. కుటుంబ యజమానులు/పోషకులైన ఈ కార్మికులు ప్రమాదవశాత్తూ మరణించినా, వృద్ధాప్యం రాకముందే సహజ మరణం చెందినా ఆ కుటుంబం వీధిన పడకుండా ఆదుకునేందుకు గతంలో చంద్రన్న బీమా పేరుతో ఈ పథకాన్ని ప్రారంభించారు. ప్రమాదవశాత్తూ సంభవించిన మరణాలకు రూ.5లక్షల పరిహారం చెల్లిస్తారు. 18-50ఏళ్ల లోపువారు సహజ మరణం చెందితే రూ.2లక్షలు, 51- 60ఏళ్ల లోపు వారు సహజ మరణం చెందితే రూ.30,000 గతంలో ఇచ్చారు. చనిపోయిన వెంటనే దహన సంస్కారాల నిమిత్తం రూ.15వేలు ఇచ్చేవారు. కాగా, క్లెయిములు నేడొస్తాయి, రేపొస్తాయి అంటూ క్షేత్రస్థాయిలో బాధితులకు అధికారులు సర్దిచెబుతున్నప్పటికీ ఈ పథకం రాష్ట్రంలో అమలవుతున్న దాఖలాలు మాత్రం కనిపించడం లేదు.

విశాఖలో వృద్ధ దంపతుల

## దారుణహత్య

గోపాలపట్నం(విశాఖ సిటీ), ఫిబ్రవరి 27: విశాఖ నగరంలోని గోపాలపట్నం ప్రాంతంలో వృద్ధ దంపతులు హత్యకు గురయ్యారు. గుర్తు తెలియని వ్యక్తులు వీరిని హత్య చేసి, బంగారు ఆభరణాలను అపహరించుకుపోయారు. ఇంటిలో వృద్ధ దంపతులు మాత్రమే ఉండడంతో బుధవారం ఉదయం జరిగిన ఈ సంఘటన రాత్రి పది గంటల తరువాత వెలుగు చూసింది. విశాఖలోని 57వ వార్డు పరిధి నరవలో జెర్రిపోతుల సముద్రాలు(70), ఆయన భార్య పార్వతి(62) నివసిస్తున్నారు. ఆర్టీసీలో ఉద్యోగం చేసి పదవీ విరమణ చేసిన సముద్రాలకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. వివాహాలైన వారంతా ఇతర ప్రాంతాల్లో నివసిస్తున్నారు. పెద్ద కుమార్తె వరలక్ష్మి బుధవారం తల్లిదండ్రులకు ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్విచ్ఛాఫ్ అని రావడంతో భర్త త్రిమూర్తులును తండ్రి ఇంటికి పంపింది. రాత్రి తొమ్మిది గంటల సమయంలో స్థానికులను వెంటబెట్టుకుని సముద్రాలు ఇంటికి త్రిమూర్తులు వెళ్లాడు. కిటికీ తెరిచి చూడగా దంపతులిద్దరూ విగత జీవులుగా కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు.


SBI ఇన్‌ఫ్రా మేనేజ్‌మెంట్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్., (SBIIMS)
(పూర్తిగా SBI అనుబంధ సంస్థ)
అమరావతి సర్కిల్ కార్యాలయం, 2వ అంతస్తు, SBI అమరావతి LHO బిల్డింగ్, అబిడ్స్, హైదరాబాద్-1, ఫోన్ నం. 040-23387364, 365
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం & యానాం కేంద్రపాలిత ప్రాంతంలో ఎంపిక చేయబడిన (స్వంత / లీజ్) SBI ఆవరణలలో ఓపెక్స్ (ఆపరేషనల్ ఎక్స్‌పెండిచర్) మోడల్‌పై గ్రిడ్ టైడ్ రూఫ్‌టాప్ సోలార్ PV సిస్టమ్ అమలు చేయుట.
SBI తరపున SBIIMS టెండరు డాక్యుమెంట్‌లోని అర్హతా ప్రమాణాల ప్రకారం సదరు పని కొరకు టెండరులో పాల్గొనుటకు అర్హత, సమర్థత మరియు వనరులు గల విక్రయదారుల నుండి ఇ-టెండర్లు కోరుతోంది. వివరాలకు వెబ్‌సైట్ : www.sbi.co.in < SBI in news < procurement news (or) https://etender.sbi/ కు లాగాన్ చేయవచ్చును.
ఇ-టెండరు దాఖలుకు ఆఖరి తేది 13-03-2020న సా. 05.00 గం.లలోగా. ప్రీబిడ్ సమావేశం 11-03-2020న మ. 03.00 గం.లకు. సవరణ / అనుబంధం ఉన్నట్లో, వెబ్‌సైట్‌లో మాత్రమే ఉంచబడును. కనుక, దరఖాస్తుదారులు పై ప్రయోజనం కొరకు వెబ్‌సైట్‌ను క్రమబద్ధంగా దర్శించవలసిందిగా కోరబడుచున్నారు.
సం/- వైస్ ప్రెసిడెంట్



JAWAHARLAL NEHRU TECHNOLOGICAL UNIVERSITY
KAKINADA - 533 003, A.P. INDIA.
APEAMCET - 2020 NOTIFICATION
(Engineering, Agriculture and Medical Common Entrance Test) (being conducted on behalf of APSCHE)
Engineering, Agriculture and Medical Common Entrance Test - 2020 (APEAMCET - 2020) of Andhra Pradesh will be conducted through computer based test by Jawaharlal Nehru Technological University, Kakinada for entry into the first year of the following professional courses offered for the academic year 2020 - 2021.
a) Engineering, Bio-Technology, B.Tech (Dairy Technology), B.Tech (Agrl. Engg.), B.Tech (Food Science and Technology).
b) B.Sc (Ag) / B.Sc (Hort) / B.V.Sc. & A.H / B.F.Sc. c) B. Pharmacy, Pharma. D.
Candidates who wish to apply for APEAMCET-2020 shall submit their application through online mode only. The detailed information regarding eligibility, age, syllabi, related instructions are available in the website : https://sche.ap.gov.in/eamcet
Date, Timing of the Test and details of Registration Fee

| Stream | Date (s) | Sessions Timings (Two Sessions Every day) | Registration Fee |
|---|---|---|---|
| Engineering (E) | 20.04.2020 & 21.04.2020<br>22.04.2020 & 23.04.2020 | 10.00 AM to 01.00 PM<br>2.30 PM to 5.30 PM | Rs. 500/- |
| Agriculture (A) | 23.04.2020 & 24.04.2020 | 10.00 AM to 01.00 PM<br>2.30 PM to 5.30 PM | Rs. 500/- |
| E & A (Both Streams) | 22.04.2020 & 23.04.2020 | 10.00 AM to 01.00 PM<br>2.30 PM to 5.30 PM | Rs. 1000/- |

Important Dates for Online Application Process

| Commencement of Application submission | Last Date for submissions without Late Fee | Download of Hall Tickets from website |
|---|---|---|
| 29.02. 2020 | 29.03.2020 | 16.04. 2020 |

Registration fee may be paid Online through payment gateway/ credit/debit card/net banking.

| Last Date for submission with Late Fee | |
|---|---|
| Rs. 500/- : 05.04.2020 | Rs. 1,000/- : 10.04.2020 |
| Rs. 5,000/- : 15.04.2020 | Rs.10,000/- : 19.04.2020 |

Place : KAKINADA, Date : 27-02-2020 Sd/- CONVENER, APEAMCET-2020

# దారి చూపిన నితీశ్

బిహార్‌లో ఎన్ఆర్‌సి అమలుచేయబోయేది లేదంటూ ఆ రాష్ట్ర అసెంబ్లీ మంగళవారం ఏకగ్రీవ తీర్మానం చేసింది. దీనితో పాటు, జాతీయ పౌరపట్టిక (ఎన్‌పిఆర్)ను కొత్తగా సవరించి రీతిలో కాక, పదేళ్ళనాటి పూర్వ రూపంలో అమలుచేయాలని కూడా తీర్మానించింది. ట్రాన్స్‌జెండర్లకు సంబంధించిన ఓ కాలమ్ చేర్చుకోవడం వినా ఎన్‌పిఆర్‌లో అదనంగా చేరివచ్చిన అంశాలేవీ బిహార్ స్వీకరించబోవడం లేదంటే ఒకరకంగా దీనినీ వ్యతిరేకించినట్టే. నితీశ్ రాజ్యంలో తీసుకున్న ఈ నిర్ణయాలు కచ్చితంగా ఆశ్చర్యం కలిగించేవే. ఎన్డీయే పాలనలో ఉన్న ఒక రాష్ట్రం ఇలా వ్యవహరించడం ఇదే ప్రథమం. ఎన్ఆర్‌సి, ఎన్‌పిఆర్‌లకు వ్యతిరేకంగా నిర్ణయాలు చేస్తున్న పలు విపక్ష పాలిత రాష్ట్రాలతో ఇప్పుడు బిహార్ చేతులు కలిపినట్టు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో నితీశ్ సారథ్యంలో ఎన్నికలకు పోబోతున్న బిజేపీ ఇంతగా దిగిరావడం అనేకులను ఆశ్చర్యంలో ముంచెత్తింది.

సిఏఏ–ఎన్‌పిఆర్–ఎన్ఆర్‌సిలపై ఆందోళనలన్నీ విపక్షాల అసత్యప్రచారాలు, అనవసరపు భయాలతో జరుగుతున్నవేననీ, వాటిని వ్యతిరేకిస్తున్న వారంతా దేశవ్యతిరేకులని బిజేపి నాయకుల వాదన. రోడ్లమీదకు వచ్చి ధర్నాలు చేస్తున్నవారు, సభలు జరుపుతున్నవారే కాక, అకాలీదళ్ వంటి బిజెపి మిత్రపక్షాలు కూడా ఈ మూడింటి కలయిక వెనుకా కుట్ర ఉన్నదని అంటూనే ఉన్నాయి. ఇప్పుడు ఎన్ఆర్‌సి అసలే వద్దనీ, దానికి పునాదిగా ఉండే ఎన్‌పిఆర్‌లో సైతం తల్లిదండ్రుల పుట్టుపూర్వోత్తరాల వంటి కొత్త అంశాలేమీ లేకుండా పదేళ్ళనాటి విధానానికే కట్టుబడాలని బిహార్ అసెంబ్లీ నిర్ణయించింది. నితీశ్‌కు జూనియర్ భాగస్వామిగా రాష్ట్రంలో అధికారాన్ని పంచుకుంటున్న బీజేపీ సహకారంతోనే ఈ తీర్మానాలు ఏకగ్రీవమైనందున, ఎన్ఆర్‌సి వద్దనీ, పాత ఎన్‌పిఆర్ మాత్రమే కావాలని అది కూడా అంటున్నట్టు అర్థం. ఊహకు కూడా అందని రీతిలో హఠాత్తుగా ఈ తీర్మానాన్ని ముందుకు తెచ్చి రాష్ట్ర బీజేపీ నాయకులను నితీశ్ ఆశ్చర్యంలో ముంచేశారనీ, ఇరుకునపెట్టేశారనీ చాలా కథనాలు వచ్చాయి. అవి నిజమే అనుకున్నా, యాభైనాలుగుమంది బీజేపీ ఎమ్మెల్యేలూ ఇంత అనుకూలంగా వ్యవహరించాల్సిన అవసరమైతే లేదు. మొత్తానికి ఈ ఒక్క ఎత్తుతో నితీశ్ ఎంతో తెలివిగా ఆర్జేడీ, బీజేపీ, ప్రశాంత్‌కిశోర్‌లను పెద్ద దెబ్బకొట్టారు. ఎన్నికల తరువాత సీఎంను మార్చేస్తామని చెబుతున్న సుశీల్ మోడీని తేరుకోలేకుండా చేశారు. బీజేపీతో కలిసివున్నా పెద్దన్నని నేనేనని ప్రజలకు అభయం ఇచ్చారు. ఏమైతేనేమి, అసెంబ్లీ ఎన్నికల ముందు సానుకూల వాతావరణాన్ని సృష్టించుకొనే నితీశ్ ఎత్తుకు బీజేపి అండగా నిలిచింది. తద్వారా, ఈ వివాదాస్పద ప్రక్రియలమీద ప్రజల్లోనూ, పార్టీల్లోనూ ఉన్న భయాలను తానూ పంచుకున్నట్టయింది. అబ్బే, ఏదో ఆత్మరక్షణార్థం రాష్ట్రస్థాయిలో తీసుకున్న నిర్ణయమే అని తీసిపారేసినా, అధిష్ఠానం అభీష్టానికి వ్యతిరేకంగా నిలబడిన మాటా నిజం. బీజేపీ పరస్పర విరుద్ధ అభిప్రాయాలతో, రెండు నాల్కలతో వ్యవహరిస్తున్నదన్న విమర్శకు ఆస్కారం ఇచ్చిన మాటా నిజం. బీజేపీ సభ్యులు పెద్దసంఖ్యలో ఉన్న బిహార్ అసెంబ్లీకి ఎన్ఆర్‌సి, ఎన్‌పిఆర్‌ల మీద అనుమానాలున్నప్పుడు ఈ రెండింటినీ వ్యతిరేకిస్తున్న మిగతా రాష్ట్రాలు, పార్టీలు, ప్రజలను కేంద్ర పెద్దలు ఎలా విమర్శిస్తారన్నది ప్రశ్న.

ఎన్‌పిఆర్ విషయంలో బీజేపీ పెద్దలు ఇప్పటికే వెనకడుగు వేస్తూ, గత ఎన్పీఆర్‌లో లేని తల్లిదండ్రుల పుట్టుపూర్వోత్తరాలు, గత నివాస స్థలం వంటి అంశాలకు మినహాయింపులు ప్రకటిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పుడు బిహార్ బిజేపీ వ్యవహార్శైలిని బట్టి దేశవ్యాప్త ఎన్ఆర్‌సి విషయంలోనూ కేంద్రం పునరాలోచనలో పడిందేమోనన్న భావన అనేకులకు కలుగుతున్నది. ఒక ప్రక్రియ విజయవంతం కావాలంటే సమాజం సమష్టిగా దానిలో పాలుపంచుకోవాలి. ఒక వర్గంలో భయాందోళనలు నెలకొని ఉన్న తరుణంలో అవి బలవంతంగా అమలు చేసినా ప్రయోజనం ఉండదు. ఈ మూడింటి మధ్యా ఏ బంధమూ లేదనీ, ఎవరూ భయపడనక్కరలేదని కేవలం మాట హామీలతో సరిపుచ్చితే చాలని దశకు ఇప్పుడు దేశం చేరుకుంది. బిహార్ బీజేపీ బాటలో కేంద్రం నడవడానికి ఇప్పటికీ సమయం మించిపోలేదు. సవరించిన ఎన్‌పిఆర్ అమలును తక్షణం నిలిపివేసి, ఎన్ఆర్‌సికి ఊతమిస్తున్న 2003 పౌరసత్వ నిబంధనలను తిరగదోడటం, మత పరీక్షకు తావులేనిరీతిలో పౌరసత్వ చట్టాన్ని సవరించడం ఉత్తమం.

## నార్లమాట

### విజ్ఞాన పిపాస

> మానవుడు విశ్వాన్ని జయిస్తున్నా తన్నుతాను జయించుకోలేక పోతున్నాడు. తన్నుతాను సంయమించుకోలేక పోతున్నాడు. ఆ సంయమనాన్ని అతడు నేర్చిన నాడు నేటి వైజ్ఞానిక పురోగతి మానవ కల్యాణదాయకమే కాగలదు.

మానవుడు సాహసి, జిజ్ఞాసువు, నిరంతరాన్వేషి. జంతువులకు శరీరధర్మాలను మించిన జీవితం లేదు. మానవుడు మనోజీవి. అతని ఆలోచనలు బ్రహ్మాండ గోళం వలెనే అనంతమైనవి. ఏదో శక్తి అతడిని జంతు దశ నుంచి ముందుకు నెట్టింది. నిప్పుచేయడం కనిపెట్టాడు. వ్యవసాయం ద్వారా ఆహారోత్పత్తి చేయడం కనుగొన్నాడు. నగరాలను నిర్మించాడు. నాగరకతను కల్పించాడు. తన అనుభూతులను వ్యక్తం చేయడానికి కవిత్వం , సంగీతం, చిత్రలేఖనం వంటి కళలను నేర్చాడు. తన లోనికి, తన వెలుపలకు దృష్టిని సారించాడు.

ఈ చెట్లు, చేమలు, కొండలు, నదులు, సముద్రాలు, గ్రహాలు, తారకలు ఏమిటి? అవి ఎక్కడి నుండి వచ్చాయి? ప్రాణం అంటే ఏమిటి? అది ఎలా ఉద్భవించింది? అలాగ అనంతమైన ప్రశ్నలు తన్నుతాను వేసుకుని సమాధానాల కోసం యుగయుగాలుగా అన్వేషిస్తున్నాడు. అనేక ప్రశ్నలకు సమాధానాలు లభించినట్టే తోస్తున్నది. అయినా, అతనికి తృప్తి లేదు. ఆ సమాధానాల నుంచి కొత్త సందేహాలు పుట్టుకు వస్తున్నాయి. తిరిగి వాటికి సమాధానాలను అన్వేషిస్తున్నాడు. అసలు మూలతత్వాన్ని కనుగొనాలని ఆరాటపడుతున్నాడు. అట్టి ఆరాటం ఫలితమే నేడు శాఖోపశాఖలుగా పెరిగిపోతున్న ఆధునిక విజ్ఞానం. ఈనాడు మానవులు అతి శక్తివంతమైన రాకెట్లు నిర్మించినా, రోదసి నౌకలు నిర్మించినా, చంద్రునిలో దిగడానికి ప్రయత్నాలు చేస్తున్నా, ఇంకా దూరదూరాల్లో ఉన్న గ్రహాలకు రాకెట్లు పంపి పరిశోధనలు సాగిస్తున్నా ఈ అంతులేని విజ్ఞానపిపాసే కారణం. .

నోబెల్ బహుమతి గ్రహీత సర్ సి.వి.రామన్ వంటి శాస్త్రవేత్తలు ఈ కృషిని ఈసడించడం కూడా చూస్తున్నాము. కోట్లకొలది ధనాన్ని, అంతులేని మానవ శ్రమను వెచ్చించి, ఖగోళ పరిశోధన చేయడం శుష్కాడంబరంగా వారు భావిస్తున్నారు. అందుచేతనే శ్రీ రామన్ మొన్నటి అపోలో ప్రయోగాన్ని హర్షించలేదట. కాని, ఎవరెలా భావించినా విజ్ఞానశాస్త్రం పురోగమిస్తున్నది. దానికిక అవరోధాలు లేవు. శ్రీ రామన్ కాంతిని గురించి వినూత్న రహస్యాలను కనిపెట్టడానికి ఏ శక్తి ప్రోత్సహించిందో అదే శక్తి ఇతరులను విశ్వాంతరాళ పరిశోధనలకు ప్రోద్బలిస్తున్నది. ఈ పురోగతికి అవరోధం కలిగితే మానవుని దౌర్బల్యం వల్లనే కలుగుతుంది. మానవుడు విశ్వాన్ని జయిస్తున్నా తన్నుతాను జయించుకోలేక పోతున్నాడు. తన్నుతాను సంయమించుకోలేక పోతున్నాడు. ఆ సంయమనాన్ని అతడు నేర్చిన నాడు నేటి వైజ్ఞానిక పురోగతి మానవ కల్యాణదాయకమే కాగలదు.

*(1969 జూలై 22 ఆంధ్రజ్యోతి సంపాదకీయం 'నిత్యాన్వేషి మానవుడు' నుంచి)*

# కాచుకొని వున్న మత రక్కసి

రాజ్‌దీప్ సర్దేశాయి



దీపశిఖ

మూక స్వామ్యం రాజ్యమేలుతున్న రోజులివి. గుంపులను రెచ్చగొట్టగలిగేవారే రాజకీయాలలో రాణిస్తున్నారు. ఇటువంటి నాయకమ్మన్యులు ఎక్కడ ఏ విషయమై గొంతు చించుకున్నా సామాజిక మాధ్యమాలు ఆ ఘోషను (అదెంత అర్థరహితమైనదైతేనేమి?) క్షణాల్లో సర్వవ్యాపితం చేస్తున్నాయి. ఢిల్లీ రాజకీయవేత్త కపిల్ మిశ్రా ఈ అధునాతన ప్రచార వెసులుబాటును బాగా ఉపయోగించుకున్నారు. నిత్యం వార్తల్లో వుండడమే ఆయనకు కావాల్సింది. అందుకే మూకలను రెచ్చగొట్టే మాటలే ఆయన నోటి నుంచి వెలువడుతుంటాయి. ఈ మహాశయుడు ఒకప్పుడు ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వంలో మంత్రిగా వుండేవారు. ఇప్పుడు కేంద్రంలోని అధికార పక్షం భారతీయ జనతా పార్టీలో వున్నారు.

పౌరసత్వ సవరణ చట్టాన్ని (సిఏఏ) అమలు పరచడంలో తమ పార్టీ ప్రభుత్వ మహాసంకల్పాన్ని నెరవేర్చేందుకు మిశ్రా తన వంతు సహాయమందిస్తున్నాడు. ఎలా? సిఏఏ వ్యతిరేక నిరసనకారులు తమ ఆందోళనను విరమించాలని, లేనిపక్షంలో వారు తీవ్ర పర్యవసానాలను చవి చూడవలసివస్తుందనే బెదిరింపులతో సుమా! ఈ బెదిరింపులే, దేశ రాజధానిలో వివిధ ప్రాంతాలు హింసాగ్నులతో అతలాకుతలమవడానికి దారితీశాయి. బెదిరింపు చేసిన తీరూ అత్యంత దిగ్భ్రాంతికరంగా వున్నది. ఒక సీనియర్ పోలీసు అధికారి సమక్షంలోనే మిశ్రా ఆ అప్రజాస్వామిక వాచాలతను ప్రదర్శించాడు. సిఏఏ వ్యతిరేక ఉద్యమాన్ని అణచి వేసేందుకు రాజకీయ వేత్తలు, పోలీసులు కుమ్మక్కయ్యారనేందుకు ఇంత కంటే మరో నిదర్శనమేమి కావాలి? ఈ వాస్తవం ఈ దేశ హితులను ఇప్పుడు అత్యంత తీవ్రంగా కలవర పరుస్తోంది. నిజానికి మిశ్రా గురించి తెలిసినవారికి, ఆయన ఆ విధంగా వ్యవహరించడం ఆశ్చర్యం కలిగించి వుండదు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలలో ఆయన వ్యహరించిన తీరే ఇందుకొక నిదర్శనం. ఢిల్లీ ఓటర్లు నిర్ద్వంద్వంగా బీజేపీని తిరస్కరించిన ఆ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ఆ ఎన్నికలను 'భారత్, పాకిస్థాన్ మధ్య జరుగుతున్న పోరాటం'గా మిశ్రా అభివర్ణించాడు! ప్రశాంత ప్రజా జీవనంలో సమస్యలు సృష్టించడంలో మిశ్రాకు సరిజోదులు ఉన్నారు. ముంబైలో మజ్లిస్ పార్టీ నేత వారిస్ పఠాన్ ఏమన్నాడో చూడండి: 'మన' 15 కోట్ల మంది, 'వారి' 100 కోట్ల మంది కంటే బలాఢ్యులు. సిఏఏ వ్యతిరేక నిరసన ప్రదర్శనలను పురస్కరించుకుని అతడు ఈ మాట అన్నాడు. ద్వేషం చిమ్మి కలహాలను సృష్టించే ఈ వ్యాఖ్య ఎంత విషపూరితమైనదో మరి చెప్పాలా? మత సామరస్యాన్ని మరింతగా దెబ్బతీసిన మాట ఈయనది. ఇటువంటి వ్యాఖ్యల వల్లే ఢిల్లీలో మతోన్మాద అల్లర్లు చెలరేగి, హింస చోటు చేసుకుంటోంది.

ఒక వాస్తవాన్ని మనం స్పష్టంగా గుర్తించాలి. కాచుకుని వున్న మతరక్కసి విజృంభణే ఢిల్లీ మతతత్త్వ హింసాగ్నులు. నెలల తరబడి విద్వేష ప్రసంగాలు జరిగాయి. లక్షిత సామాజిక వర్గాలలో అవి భయాన్ని, ఆగ్రహాన్ని, అసహ్యాన్ని కలిగించాయి. కలిగించవూ మరి! షహీన్ బాగ్ నిరసనకారులు 'దేశ్ కే గద్దర్' (జాతి వ్యతిరేకులు) అని, వారిని 'కాల్చి వేసినా పాపం లేదని' ఏకంగా బాధ్యతాయుతులైన మంత్రులే అనడం ఎంత గర్హనీయం? భారతీయ ముస్లింలను దుష్ట వ్యక్తులుగా చిత్రించేందుకు పాలక పక్షం నాయకులు అదేపనిగా చేసిన ప్రయత్నాలతోనే దేశ రాజధానిని అల్లకల్లోల పరిచిన మతోన్మాద ఉపద్రవం ప్రారంభమయిందని చెప్పక తప్పదు. అనుకూల మీడియా సహాయసహకారాలతో సాగిన నిరంతర విష ప్రచారం అధిక సంఖ్యాక వర్గం వారి మనస్సుల్లో తీవ్ర భయాందోళనలను పెంపొందించింది. ఫలితంగానే మత పరమైన విభేదాలు తీవ్రమయ్యాయి. ఒక విధంగా విద్వేషాగ్ని రాజుకున్నది. ప్రజ్వరిల్లే స్థాయికి చేరుకున్నది. ఇంతలో పౌరసత్వ సవరణ చట్ట వ్యతిరేకులు, మద్దతుదారుల మధ్య ఘర్షణలు చోటు చేసుకున్నాయి. అంతే! ఆ విద్వేషాగ్నులు పూర్తి స్థాయిలో ప్రజ్వరిల్లాయి.

మరి మత సామరస్యాన్ని, శాంతి భద్రతలను కాపాడవలసిన రాజ్య వ్యవస్థ ఈ విషమ పరిస్థితిని ముందుగా పసిగట్టలేదా? పసిగట్టిన సూచనలేవీ కన్పించక పోవడం ఎంతైనా గాభరా కలిగిస్తోంది. ప్రభుత్వ యంత్రాంగం కోడికునుకులు తీస్తున్నది. అది ఉద్దేశపూర్వకం కావచ్చు, కాక పోవచ్చు. జరిగింది మాత్రం అంతే. అందునా అమెరికా అధ్యక్షుడు అధికారిక పర్యటనకు వస్తున్న తరుణంలో ఈ అల్లర్లు చోటుచేసుకోవడం మరింత గందరగోళపరుస్తోంది. ప్రపంచ అగ్రరాజ్యాధినేత విచ్చేస్తున్న సందర్భంలో రాజధానినగర వీధుల్లో మతోన్మాద అల్లర్లు సంభవించడాన్ని ఏ ప్రభుత్వం కోరుకుంటుంది? హైదరాబాద్ హౌజ్‌లో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ప్రధానమంత్రి నరేంద్రమోదీ 'మత స్వేచ్ఛ'పై చర్చలు జరుపుతున్న సమయంలోనే ఈశాన్య ఢిల్లీ ప్రాంతాలలో మత విద్వేషాగ్నులు భగ్గుమన్నాయి. ఈ హింసాగ్నులను నియంత్రించడంలో ప్రభుత్వ యంత్రాంగం వైఫల్యంపై లోతుగా, సమగ్రంగా దర్యాప్తు జరిపించాల్సిన అవసరం ఎంతైనా వున్నది.



> ఈశాన్య ఢిల్లీ ఘటనల నుంచి కేంద్రంలోని పాలక పక్షం పాఠాలు నేర్చుకున్నదా? మత విభేదాలను అరికట్టేందుకు చిత్తశుద్ధితో ప్రయత్నిస్తున్నదా? అధికారపక్షం అలా వివేకంతో వ్యవహరిస్తున్నట్టయితే కపిల్ మిశ్రా లాంటి వాళ్ళను పార్టీ నుంచి వెలివేసివుండేది. షహీన్ బాగ్ నిరసనకారులతో చర్చలు ప్రారంభించివుండేది. ముస్లిం విద్వేష రాజకీయాలు హిందూ ఓటు బ్యాంకును సంఘటితం చేయవచ్చుగానీ సౌభ్రాతృత్వం మళ్ళీ వర్థిల్లలేని విధంగా సామాజిక సామరస్యాన్ని దెబ్బతీస్తాయన్న సత్యాన్ని గ్రహించివుండేది.

ఇటువంటి ఉపద్రవాన్ని 48 గంటల పాటు ఉపేక్షించడం ఎంత మాత్రం తగదని పాలనా నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. పాలనా వ్యవస్థలో ఏదో ఒక స్థాయిలో అసమర్థత లేదా సదరు దుర్మార్గ కృత్యంలో భాగస్వామ్యమున్నప్పుడు మాత్రమే అటువంటి ఉపేక్ష వహిచడం జరుగుతుందనేది స్పష్టం. ఈ హింసాగ్నులు ప్రజ్వరిల్లిన మొదటిరోజున వాటిని అదుపుచేయడానికి మొహరించిన పోలీసులు తగిన సంఖ్యలో లేరు. అంతేగాక సమస్యను సమర్థంగా ఎదుర్కొనేందుకు వారు సర్వసన్నద్ధమై రంగంలోకి రాలేదు. రెండోరోజున పోలీసులు నిష్పాక్షికంగా వ్యవహరించలేదని, హింసాకాండకు పాల్పడుతున్న వారి పట్ల నిస్సిగ్గుగా పక్షపాతం చూపారని ధ్రువీకరించే వీడియో సాక్ష్యాధారాలు ఉన్నాయి. నిజానికి పోలీసు దళాల 'మతతత్త్వీకరణ' కొత్త పరిణామమేమీ కాదు. మతోన్మాద అల్లర్లు చోటుచేసుకున్న ప్రతి చోటా చట్టాన్ని అమలుపరచడంలో పోలీసుల పాత్ర నిష్పాక్షికంగా లేదనేందుకు సాక్ష్యాధారాలు పుష్కలంగా వున్నాయి. 1984లో ఢిల్లీలో సిక్కుల ఊచకోత నాటి నుంచి తాజా మతోన్మాద ఘటనల దాకా బాధితులను కాపాడడంలో పోలీసులు విఫలమయ్యారు. వారి వైఫల్యంలో ఒక స్పష్టమైన క్రమం వున్నది. ఇటీవలి కాలంలో పోలీసులు పూర్తిగా పాలకవర్గ శ్రేణుల పక్షం వహిస్తున్నారు. బదిలీలు, పదోన్నతుల వ్యవహారాలు పూర్తిగా రాజకీయ వేత్తల ఇష్టాయిష్టాలపై ఆధారపడి వుండడం వల్లే పోలీసులు తమ విధి నిర్వహణలో నిష్పాక్షికంగా వ్యవహరించలేకపోతున్నారని చెప్పక తప్పదు.

ఢిల్లీ పోలీసు ప్రధాన కార్యాలయం, హోం మంత్రిత్వ శాఖలోని పాలనా నాయకత్వం కొన్ని కఠిన ప్రశ్నలకు సమాధానమివ్వవలసిన అవసరమున్నది. ఈశాన్య ఢిల్లీలో హింసాగ్నులు ప్రజ్వరిల్లిన మొదటి రోజున పోలీసులను తగు సంఖ్యలో మోహరించడంలో వైఫల్యానికి బాధ్యులు ఎవరు? అల్లర్ల రెండో రోజున పోలీసులు ఒక పక్షానికి అనుకూలంగా వ్యవహరించేందుకు అనుమతినిచ్చిందెవరు? విధి నిర్వహణలో అసమర్థంగా వ్యవహరించడమూ, నేరస్థులకు సహకరించడమూ ప్రమాదకరమైన ధోరణులు. వీటికి పాల్పడిన వారిని తప్పనిసరిగా శిక్షించితీరాలి. అలా జరగని పక్షంలో అటువంటి అలక్ష్య ధోరణులు మరింతగా పెచ్చరిల్లిపోతాయి. గుర్తించ వలసిన మరో ముఖ్యమైన విషయమేమిటంటే ఈశాన్య ఢిల్లీ ఘటనల్లో 2002 'గుజరాత్ నమూనా' ఛాయలు స్పష్టంగా గోచరించాయి (2002లో గోద్రాలో కరసేవకులు ప్రయాణిస్తున్న రైలు బోగీ దగ్ధమయిన ఘటనలో పలువురు సజీవంగా ఆహుతయ్యారు. ఈ ఘటనకు ప్రతీకారంగా విహెచ్‌పీ, బజరంగ్ దళ్ కార్యకర్తలు 48 గంటల పాటు ఎలాంటి అడ్డూ అదుపూ లేకుండా చెలరేగిపోయి వందలాది అమాయక పౌరులను ఊచకోత కోశాయి). ప్రస్తుత సందర్భంలో ఈశాన్య ఢిల్లీలో కొన్ని ముస్లిం బృందాలు పౌరసత్వ సవరణ చట్ట వ్యతిరేక నిరసన ప్రదర్శనలకు పూనుకున్నాయి. ఆ ప్రదర్శనలపై సాయుధ గుంపులు దాడి చేయడం హింసాగ్నులు ప్రజ్వరిల్లడానికి దారితీసింది. సిఏఏ వ్యతిరేకులపై ప్రతి దాడులు చేసేందుకు స్థానిక హిందూ బృందాలకు అనుమతినిచ్చినట్టు భావించడానికి ఎంతైనా ఆస్కారమున్నది. ఈ హింసాత్మక సంఘటనలలో సామాన్య ముస్లింలు, హిందువులకు ఆస్తినష్టం సంభవించింది. ప్రాణాలు కోల్పోయిన వారిలో ఇరు వర్గాల వారూ వున్నారు. చాంద్‌బాగ్ ప్రాంతంలో ఒక స్థానికుడు నాతో ఇలా అన్నాడు: 'మంటలను రాజకీయవేత్తలు ప్రారంభించారు. సామాన్య పౌరులు దగ్ధమయ్యారు'.

మరి ఈశాన్య ఢిల్లీ ఘటనలు కేవలం అక్కడికే పరిమితమవుతాయా? లేక అవి ఒక ప్రారంభం మాత్రమేనా? ఎందుకంటే అటువంటి హింసాగ్నులు ఇతర ప్రాంతాలకు వ్యాపించడానికి ఎంతో వ్యవధి పట్టదు కదా. ఇదే ఇప్పుడు అనేక మందికి ఆందోళన కలిగిస్తున్నది. అనివార్యంగా కొన్ని ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అవి: ఈశాన్య ఢిల్లీ ఘటనల నుంచి కేంద్రంలోని పాలక పక్షం పాఠాలు నేర్చుకున్నదా? మత విభేదాలను అరికట్టేందుకు చిత్త శుద్ధితో ప్రయత్నిస్తున్నదా? అధికారపక్షం అలా వివేకంతో, నిజాయితీగా వ్యవహరిస్తున్నట్టయితే కపిల్ మిశ్రా లాంటి వాళ్ళను పార్టీ నుంచి వెలివేసి వుండేది. అలా చేసివున్నట్టయితే విషపూరిత రాజకీయ వాచాలతకు పాల్పడుతున్నవారిని అదుపు చేసినట్టయ్యేది. షహీన్ బాగ్ నిరసనకారులతో చర్చలు ప్రారంభించివుండేది. భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేసిన వారిని జాతి వ్యతిరేకులుగా పరిగణించేది కాదు. మరీ ముఖ్యంగా ముస్లిం విద్వేష రాజకీయాలు హిందూ ఓటు బ్యాంకును సంఘటితం చేయవచ్చు గానీ సౌభ్రాతృత్వం మళ్ళీ వర్థిల్లలేని విధంగా సామాజిక సామరస్యాన్ని దెబ్బతీస్తాయన్న సత్యాన్ని గ్రహించివుండేది.

**తాజా కలం:** ఈశాన్య ఢిల్లీలో నా విధి నిర్వహణ సందర్భంగా నేను కమల్ శర్మ(ఈయన రెస్టారెంట్ పూర్తిగా నేల మట్టమయింది) మహమ్మద్ నవాజ్ (ఈయన పండ్ల దుకాణం, గృహం పూర్తిగా దగ్ధమయ్యాయి) ను కలుసుకున్నాను. వీరిరువురూ రోడ్డుకు ఆ వైపూ, ఈ వైపూ నివశిస్తున్నారు. మరి వాటిల్లిన నష్టం నుంచి వారికి ఉపశమనం కలిగించక పోతే జరిగేదేమిటి? దేశ రాజధాని నడిబొడ్డున మరో అనధికారిక 'సరిహద్దు'ను సృష్టించడమే కాదా?

*(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)*

## ఢిల్లీ



ఢిల్లీ నాకు
రెండో హైదరాబాదు.
అక్కడి గల్లీలు
మళ్లీ మళ్లీ తిరిగినవే.
కవిత్వం తన మూలాల్ని
వెతుక్కుంటున్నట్టు
ఇండియా
గుండెలను కలిపేదిక్కడే.
ఏమైందివాళ!
రోడ్లపై డివైడర్లిప్పుడు
మనవత్వాన్ని విడదీస్తున్నాయి.
చరిత్ర రక్తాన్ని పూసుకొని
సంచరిస్తున్న భూతాల మృత్యుహేళ!
ఇవాళ ఢిల్లీ
బుల్లెట్ గాయాలతో
పడివున్న యువజీవన నాగమల్లి.
అందమైన బస్తీల పేర్లు
మృత్యువికార ఘోషలతో
మొరపెట్టుకుంటున్న కల్లోల పాలవెల్లి.
ధైర్యవంతులే చచ్చిపోతారు
పత్రికల్లోని అక్షరశూరులు
సాహస శ్వాసలను పణంగా పెడతారు.
రాజకీయాలకు బుద్ధిలేదు
మొదటిసారి ఢిల్లీ
మనది కాదనిపిస్తుంది.
ఇప్పుడు కవిత్వమూ
దిక్కుతోచని శూన్యంలో
పరుగు పెడుతుంది,
ఇవాళ ఢిల్లీ
కలగాపులగమైన అక్షరాల లొల్లి.
అక్కడి మిత్రులెట్లా వున్నారో!
ఫోన్లో పలికేదాకా నిద్రపట్టదు.

– డా. ఎన్. గోపి

## షఫాలి తెలిపిన సత్యం..



మహిళల క్రికెట్ టీ20 ప్రపంచ కప్ సెమీ ఫైనల్స్ కు చేరుకునే కీలకమైన న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో షఫాలి వర్మ 34 బంతుల్లో 46 పరుగులు చేసి మన టీం గెలుపులో ప్రధాన పాత్ర పోషించి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకుంది. అలాంటివన్నీ సహజంగా జరుగుతూనే ఉంటాయి. కానీ, ఇక్కడ ప్రత్యేకత ఏమిటంటే ఆమెకు ఇంగ్లీష్ రాక పోవడంతో అవార్డు అందుకుంటున్నప్పుడు వారు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పడానికి తన సహచరి సహకారం తీసుకుంది. ఇక్కడ ఒక సందేహం కలుగుతుంది. ఆమెకు ఇంగ్లీషు రాకపోవడం వల్ల ఆమె బ్యాటింగ్ నైపుణ్యం ఏమైనా తగ్గిందా లేక దేశానికేమైనా నష్టం జరిగిందా? అని. ఆమెకు ఇంగ్లీషు బాగా వచ్చి, బ్యాటింగు చేయడం రాకపోతే ఏం జరిగి ఉండేది? ఇక్కడ ఇంగ్లీషా? నైపుణ్యమా? ఏది అత్యంత అవసరం అన్నది తేల్చుకోవలసిన పరిస్థితి ఏర్పడితే, నైపుణ్యమే అని నిస్సందేహంగా చెప్పక తప్పదు. దీనర్థం ఇంగ్లీష్ అవసరంలేదని కాదు. కానీ నైపుణ్యమే ప్రధానమని. నైపుణ్యంతో పాటు ఇంగ్లీషు కూడా వచ్చి ఉంటే ఆమెకు అవార్డు అందుకునే సమయంలో ఎవరి సహకారం అవసరమై ఉండేది కాదు, కానీ గెలుపును మాత్రం ప్రభావితం చేసి ఉండేది కాదు. మన దేశంలో కేవలం 8 శాతం మంది ప్రజలు మాత్రమే అది కూడా సరళమైన ఇంగ్లీషును అర్థం చేసుకోవడం, పొడిపొడిగా మాట్లాడడం చేయగలరు. ప్రపంచంలో అత్యధిక మంది మాట్లాడే భాషగా ఇంగ్లీష్ ఉందన్నది వాస్తవమే అయినా విద్యను, విజ్ఞానాన్ని, నైపుణ్యాన్ని సమకూర్చుకోవడానికి దీని పాత్ర ఏమీ లేదు. ఏ భాషలోనైనా సమాచారం ఇచ్చిపుచ్చుకోవడంలో మంచి ప్రతిభ కనపరిచిన వారే అసలైన విద్యావంతులు. సమాచార మార్పిడి సహజంగా మన చుట్టూ ఉండే సమాజంలోనే జరుగుతుంది. అందువల్లే విద్యను అభ్యసించడానికి మాతృ భాషే మిన్న అని భావించి అన్ని దేశాలు, మన దేశంలో కూడా అన్ని రాష్ట్రాలలోనూ విద్యాబోధన మాతృ భాషలోనే జరుగుతోంది. అయినా మన దేశం వివిధ రంగాలలో అనేక మంది ప్రముఖులను సృష్టిస్తోంది. అదేం విచిత్రమో కానీ ఆంధ్ర రాష్ట్రంలో మాత్రం మాతృ భాషలో బోధనను నిషేధించారు. అదేమంటే, పేదల పిల్లలకు ఇంగ్లీషు అవసరం లేదా అని ఎదురు ప్రశ్నిస్తున్నారు. అవసరంలేదని ఎవరూ అనలేదు. విజ్ఞానంతో పాటే ఇదీ జరగాలనేది విజ్ఞుల ఘోష. బట్లర్ ఇంగ్లీషు వచ్చి విజ్ఞానం రాకపోతే, ఎంత నష్టమో సమాజానికి అంతకంటే నష్టం. ఇప్పటికైనా పాలకులు పునరాలోచించడం అవసరం.

– ఎ. అజ శర్మ
ప్రధాన కార్యదర్శి, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక

# జగన్, మీ విశ్వసనీయత మిథ్య

> *బాధ్యతాయుతమైన పౌరులు క్రియాశీలకంగా వ్యవహరించకపోతే అధములు పాలకులుగా వచ్చి చట్టాలు చేసి ప్రజల జీవితాలను శాసిస్తారు.* – ప్లేటో

నారా లోకేష్



నవ్యాంధ్ర ప్రజలకు ఈ సత్యం పూర్తిగా నప్పుతుంది. జనం అంచనా తప్పి అనర్థానికి దారి తీసింది ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాలన. ఎంతో నమ్మకంతో జగన్ కి అధికారం అప్పగించిన ప్రజలు పశ్చాత్తాపంతో కుమిలిపోతున్నారు. ఆరోగ్యకర రాజకీయాల స్థానంలో విధ్వంస రాజకీయాలు చొరబడి రాష్ట్రాన్ని బలితీసుకొంటున్నాయి. నిలబెట్టిన నవ్యాంధ్రను నిలబెట్టక పోగా పడగొట్టే వ్యూహంతో ముందుకు వెళుతున్నారు పాలకులు. భారీ మెజారిటీతో అధికారంలోకి వచ్చి అంతటా చర్చను రేకెత్తించిన అనతి కాలంలోనే ఆంధ్రప్రదేశ్‌ను తిరోగమనంలోకి నెట్టారు. తొమ్మిది నెలల్లో జగన్ డొల్లతనం ఏమిటో ప్రజలకు తెలిసి పోయింది. ఇప్పుడు జగన్‌ని జనం వద్దనుకున్నా రాష్ట్రానికి ఇంతవరకూ జగన్ చేసిన నష్టాన్ని సరిదిద్దడం అంత సులభంకాదు. రాష్ట్ర ప్రభుత్వ వ్యవహారం శైలితో ప్రజల్లో భయాందోళనలు నెలకొనడమే కాదు రాష్ట్ర భవిష్యత్తు ప్రశ్నార్ధకంగా మారింది. ఒక దశా, దిశా లేకుండా, అరాచకంగా, ఆవేశంగా, కక్ష పూరితంగా వ్యవహరిస్తూ ప్రజల్ని అయోమయానికి, ఆందోళనకు గురిచేస్తున్నారు. చంద్రబాబు ఐదేళ్ల పాలనపై మొత్తంగా సిట్ వేసి ఏదో సాధించాలని జగన్ ప్రభుత్వం నిర్ణయించడం వారి అవివేకానికి, అజ్ఞానానికి నిదర్శనం. ఏదైనా శాఖలో అక్రమాలు జరిగితే విచారణకు ఆదేశించడం సమర్ధనీయం. అలా కాకుండా అయిదేళ్ల పాలనపై ఈ ప్రభుత్వం సిట్ వేయడం అంటే ఎంత పగ, ప్రతీకారంతో రగిలిపోతుందో అర్థమవుతుంది. ఈ నిర్ణయం నవ్యాంధ్ర అభివృద్ధి పై బలమైన ప్రభావం చూపనుంది. ఇలా ఐదేళ్ల పాలన పై సిట్ వేయడం దేశ చరిత్రలో ఇదే మొదటి సారి. ఇప్పటికే మూడు సిట్‌లు, ఆరు కమిటీలు,క్యాబినెట్ సబ్ కమిటీలు,విజిలెన్స్ విచారణలు వేశారు ఎందులో ఏమి తేల్చలేక పోయారు. ప్రజా సమస్యలు పరిష్కరించలేక,ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయలేక,మూడు రాజధానుల రభస సృష్టించి పాలనా వైఫల్యాలు కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారు. రాష్ట్రంలో ఒక్క పోలీసు వ్యవస్థ తప్ప అన్ని వ్యవస్థలు చచ్చుపడి పోయాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఇసుక మాఫియా, గనుల మాఫియా, భూ మాఫియా రాష్ట్రాన్ని కొండ శిలువల్లా చుట్టేశాయి. తొమ్మిది నెలలుగా చంద్రబాబు కట్టిన కట్టడాలు కూల్చడం, ఆయన పథకాలు రద్దు చేయడం, అభివృద్ధిని నిలిపి వేయడం, ఎంక్వయిరీలు వేయడం తప్ప చేసింది శూన్యం.

జగన్మోహన్ రెడ్డి అధికారానికి వచ్చిన తొమ్మిది నెలల్లో ఏ విధంగా మాటలు మార్చారో, ఆయనకు వున్న విశ్వసనీయత ఏపాటిదో ప్రజలు అర్థం చేసుకోవాల్సి ఉంది. రాజధానిని మార్చను, రాజధాని ఇక్కడే ఉంటుందని ఎన్నికల ముందు హామీ ఇచ్చారు. అసెంబ్లీ సాక్షిగా విజయవాడ, గుంటూరు మధ్య కేపిటల్ సిటీని ఏర్పాటు చేయడాన్ని ఆహ్వానిస్తున్నాను అన్నారు. కేపిటల్ సిటీని మీరు ఎక్కడైనా పెట్టండి అలా పెట్టే చోట కనీసం 30వేల ఎకరాలు ఉండాలి అన్నారు. అధికారంలోకి వచ్చాక మాట మార్చి మూడు రాజధానులు అంటూ మూడు ముక్కలు చేయడానికి పూనుకొని 33 వేల ఎకరాలు భూములు ఇచ్చిన 29 వేల మంది రైతులను మోసం చేశారు. ఇదేనా మీ విశ్వసనీయత? నాకు అందరూ సమానమేనని, కులం,మతం చూడనని అధికారంలోకి వచ్చి నేడు ఒక సామాజిక వర్గం పై కక్ష సాధింపులకు, వేధింపులకు దిగి వారి ఆర్థిక మూలాలను దెబ్బతీస్తున్నారు ఇదేనా మీ విశ్వసనీయత? అధికారంలోకి వస్తే నెల రోజుల్లో సిపీఎస్ రద్దు చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక ఆ మాటే ఎత్తకుండా ఉద్యోగులను మోసం చేశారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ సిబ్బందిని పర్మినెంట్ చేస్తానని హామీ ఇచ్చి వారికి ఆశలు కల్పించి అధికారంలోకి వచ్చాక పర్మినెంట్ చేయక పోగా రూ.40 వేలకు పైగా వేతనం తీసుకొంటున్న వారిని నిర్దాక్షిణ్యంగా ఉద్యోగాలనుండి తొలగించారు ఇదేనా మీ విశ్వసనీయత? ఉద్యోగ నియామకాల్లో ఎటువంటి బేధాలు చూపనని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక సొంత పార్టీవారికి, సొంత మీడియాలో పనిచేసిన వారికే ఉద్యోగాలు కల్పించారు. సామాజిక న్యాయం పాటిస్తానని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక ఒకే సామాజిక వర్గానికి పదవులు ఇచ్చి మిగిలిన వర్గాలను మోసం చేయడమే మీ విశ్వసనీయతా? ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన వేదికపైనే విద్యుత్తు చార్జీలు పెంచ బోమని హామీ ఇచ్చిన జగన్ నేడు రూ.1300 కోట్ల విద్యుత్తు చార్జీలు పెంచి వంచనకు పాల్పడ్డారు ఇది కూడా మీ విశ్వసనీయతతో భాగమేనా? వృద్దాప్య పించన్లను రూ.3000 లకు పెంచుతానని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక పెంచకపోగా అనర్హుల పేరుతో తొలగిస్తున్నారు. రాష్ట్రంలో ఆసరాలేని అసంఖ్యాక అభాగ్యులు నెల, నెలా పింఛను మీదనే బతుకులీడుస్తున్నారు. అధికారంలోకి వచ్చాక పింఛన్ల మీదనే కత్తి కట్టి ఏడు లక్షల పింఛన్లు తొలగించి వారిని దిక్కు తోచని స్థితిలోకి నెట్టారు. అంతే కాదు 20 లక్షల తెల్ల రేషన్ కార్డులను తొలగించి పేదల కడుపు కొట్టేందుకు జగన్ ప్రభుత్వం సిద్ధపడింది. అధికారంలోకి రావడం కొరకు విశ్వసనీయత అన్న పదాన్ని వాడుకొని అధికారంలోకి వచ్చాక ఆ పదాన్ని కూడా మోసం చేశారు జగన్మోహన్ రెడ్డి.



> జగన్మోహన్ రెడ్డి అధికారానికి వచ్చిన తొమ్మిది నెలల్లో ఏ విధంగా మాటలు మార్చారో, ఆయనకు వున్న విశ్వసనీయత ఏపాటిదో ప్రజలు అర్థం చేసుకోవాల్సి ఉంది. రాజధానిని మార్చను, రాజధాని ఇక్కడే ఉంటుందని ఎన్నికల ముందు హామీ ఇచ్చారు. అసెంబ్లీ సాక్షిగా విజయవాడ, గుంటూరు మధ్య కేపిటల్ సిటీని ఏర్పాటు చేయడాన్ని ఆహ్వానిస్తున్నాను అన్నారు. కేపిటల్ సిటీని మీరు ఎక్కడైనా పెట్టండి అలా పెట్టే చోట కనీసం 30వేల ఎకరాలు ఉండాలి అన్నారు. అధికారంలోకి వచ్చాక మాట మార్చి మూడు రాజధానులు అంటూ మూడు ముక్కలు చేయడానికి పూనుకొని 33 వేల ఎకరాలు భూములు ఇచ్చిన 29 వేల మంది రైతులను మోసం చేశారు. ఇదేనా మీ విశ్వసనీయత?

రైతులకు ఇచ్చిన ఏ ఒక్క హామీ సక్రమంగా అమలుచేయలేదు. రైతు భరోసా పథకానికి ప్రభుత్వం విధించిన నిబంధనలు రైతులకు గుదిబండలుగా మారాయి. మొదట కోటి మంది రైతులున్నారని చెప్పారు. బడ్జెట్ ప్రసంగంలో 64 లక్షలు మంది వున్నారని చెప్పారు. కౌలు రైతులు 15 లక్షల మంది రైతులున్నారని చెప్పారు. కానీ 13 జిల్లాల్లో మొత్తం 79,50,844 మంది రైతు ఖాతాలుండగా 49,15,661 మందిని అర్హులుగా ఆమోదించారు. ప్రతి రైతుకి రాష్ట్ర ప్రభుత్వం రూ.13,500లు, కేంద్రం ప్రకటించిన పిఎం కిసాన్ యోజన పథకం కింద రూ.6,000 లు కలిపి మొత్తం రూ.19,500 ఇవ్వాల్సి ఉండగా కేంద్రం ప్రకటించిన రూ.6,000 లకు రాష్ట్రం రూ.7,500 కలిపి రూ.13,500 ఇస్తున్నారు. కేంద్రం ఇచ్చే రూ.6,000 లకు రాష్ట్రం ఇచ్చే రూ.13,500 అదనం అనుకొన్నారు రైతులు. కానీ రాష్ట్రం ప్రభత్వం భరోసా కింద ఇచ్చేది రూ.7,500 మాత్రమే అది కూడా మూడు సార్లు చెల్లిస్తామంటున్నారు. 15 లక్షల మంది కౌలు రైతులు వున్నారని చెప్పిన ప్రభుత్వం 3 లక్షలకు కుదించింది. కౌలు రైతు లందరికి భరోసా అన్న ప్రభుత్వం మాట మార్చి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకే అని ఇతర పేద కౌలు రైతులను మోసం చేశారు. నవరత్నాల్లో రైతు భరోసా పథకాన్ని బోగస్ పథకంగా మార్చారు. పగటిపూట తొమ్మిది గంటలు కరంటు ఇస్తామన్నారు కానీ అప్రకటిత కోతలతో ఇబ్బందుల పాలు చేస్తున్నారు. వాణిజ్య పంటలకు గిట్టుబాటు ధరలు లేవు. ధాన్యం కొన్న నలభై ఎనిమిది గంటల్లో డబ్బు చెల్లిస్తామన్నారు కానీ నలభై ఎనిమిది రోజులు అయినా చెల్లించే పరిస్థితి లేదు. అమరావతి పై పగపట్టి భస్మాసుర హస్తం పెట్టారు. ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధికి ఆయువుపట్టుకాగల జీవనాడి అయిన పోలవరాన్ని రివర్స్ టెండర్స్ పేరుతో 70 శాతం పూర్తి అయ్యాక మింగేసారు. తొమ్మిది నెలలుగా పోలవరంలో చేసింది 35 వేల క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ మాత్రమే, అది ఎప్పటికి పూర్తి అవుతుందో చెప్పలేని పరిస్థితి. సాగునీటి రంగం తొమ్మిది నెలలుగా కుదేలు అయింది. గత ప్రభుత్వం 65 లక్షల ఎకరాలకు సాగునీరందించే లక్ష్యంతో చేపట్టిన 62 ప్రాజెక్టుల భవితవ్యం ప్రశ్నార్థకం చేశారు. ప్రాజెక్టు లన్నీ పడకేసి సాగునీటి రంగం కుప్పకూలింది. ప్రభుత్వ నిరంకుశ విధానాలు రైతుల పాలిట శాపంగామారాయి. 3లక్షల మందికి పైగా అభాగ్యుల ఆకలితీరుస్తున్న అన్న క్యాంటీన్లు రద్దుచేసి వారి పొట్ట గొట్టారు.6 లక్షల మంది యువతకు నెలకు రూ. 2000 చొప్పున నిరుద్యోగభృతి గతప్రభుత్వం చెల్లించగా ఈ ప్రభుత్వం రద్దుచేసి వారి పొట్ట కొట్టింది. ఈ కక్ష పూరిత పాలన చూసి రాష్ట్రానికి వచ్చిన అనేక పరిశ్రమలు వెనక్కి వెళ్లిపోతున్నాయి. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని పెట్టుబడులు ఆకర్షించడంలో దేశంలో మొదటి స్థానంలోనిలిపితే వైకాపా ప్రభుత్వం అధికారంలోకి అన్ని వ్యవస్థలను పతనం చేసినట్లే పారిశ్రామిక రంగాన్ని పతనం చేశారు. షరతులు లేకుండా ప్రతి అమ్మకి తన బిడ్డని బడికి పంపితే చాలు రూ.15వేలు ఇస్తాను అన్నవారు నేడు నిబంధనలు బయటికి తీశారు. పిల్లలకు 75 శాతం హాజరు తప్పని సరి చేశారు. రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలు జగన్ రాక్షస పాలనకు అద్దం పడుతున్నాయి.ప్రతిపక్ష నాయకుడు ప్రజలవద్దకు వెళ్ళే స్వేచ్ఛ లేక పోతే మనం ప్రజాస్వామ్యంలో వున్నామా? లేక రాక్షస స్వామ్యంలో వున్నామా? రాక్షసులు కూడా రాక్షసత్వం జగన్ వద్దే నేర్చుకొని వుంటారేమో అనిపిస్తుంది. ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు కాన్వాయి పై చెప్పులు, కోడి గుడ్లు,టమాటాలు వేయడం వారి రాక్షస మనసత్వానికి అద్దం పడుతుంది. ఇంత క్రూరత్వ ప్రభుత్వాన్ని దేశ చరిత్రలో తొలిసారి చూస్తున్నారు ప్రజలు,చంద్రబాబు విశాఖ,విజయనగరాలలో పర్యటిస్తే మీ భూ బాగోతాలు బయట పడతాయని అడ్డుకుంటారా? అధికారం శాశ్వతం కాదు. అస్తమించక తప్పదు. అప్పుడు మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. మంత్రులు చంద్రబాబును అడ్డుకోమని పిలుపు ఇవ్వడం దారుణం. మంత్రులు ముఖ్యమంత్రి వద్ద కట్టు బానిసల్లా బతుకుతున్నారు. ఫ్యాక్షన్ చరిత్ర వున్నవాళ్లు అధికారంలోకి వస్తే ఏం జరగాలో నేడు ఆదే జరుగుతుంది. గత ప్రభుత్వం ఈ విధంగా వ్యవహరించివుంటే జగన్ కాలు బయట పెట్టగలిగేవారా?

ప్రజలు ఇచ్చిన అధికారాన్ని ప్రజాభ్యుదయానికి ఉపయోగించకుండా రాజకీయ ప్రయోజనాలకు, వేధింపులకు, సాధింపులకు ఉపయోగించడం మంచిది కాదు. కక్ష సాధించడం కోసం రాష్ట్ర ప్రయోజనాలు దెబ్బతీస్తే చరిత్ర క్షమించదు. రాష్ట్రప్రభుత్వం అమరావతిపై విజ్ఞతతో వ్యవహరించి ఉంటే అయిదు కోట్ల ప్రజల మహోజ్వల భవితకు బలమైన పునాది పడి ఉండేది. ఎవరేమన్నా, ఎవరేమనుకున్నా జగన్ పాలన రాష్ట్ర ప్రగతికి గుది బండగా మారింది.

*(ఎమ్మెల్సీ, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి)*



స్ఫూర్తి

వయసు నలభై దాటగానే 'ఉద్యోగం విసుగేసేస్తోంది!' అనే వాళ్ళు...
యాభై రాగానే ఆఫీసులో వీలైనంత పని తగ్గించుకుంటే బాగుంటుందనుకొనే వాళ్ళు...
వాలంటరీ రిటైర్‌మెంట్‌కు సిద్ధమైపోయే వాళ్ళు ఎందరో...
వయసైపోయిందని పక్కన పెట్టేసే యజమానులూ ఎందరో...
అలాంటి ఆలోచనలు ఉన్నవాళ్ళు సుసాన్ ఫిన్లే గురించి తెలుసుకోవాలి...
ఆమె ఎనభై రెండేళ్ళ వయసులోనూ ఉత్సాహంగా పని చేస్తున్న హ్యూమన్ కంప్యూటర్...
అది కూడా అరవయ్యేళ్ళుగా అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ 'నాసా'లో కొలువు!
శాస్త్ర, సాంకేతిక రంగాల్లో మహిళల సంఖ్య మరీ తక్కువగా కనిపిస్తున్న వేళ...
ఆమె సుదీర్ఘ విజయగాథ స్ఫూర్తిదాయకం!

# ఆమె పయనం... ఆకాశమంత!

"నాసాలో ఉద్యోగం మాట దేవుడెరుగు, అసలు లెక్కలతో సంబంధం ఉన్న పని చెయ్యాలని నేను ఎప్పుడూ అనుకోలేదు" అంటారు సుసాన్ ఫిన్లే. అలాంటి ఆమె గత ఏడాదికి నాసా ఉద్యోగిగా అరవై సంవత్సరాలు పూర్తి చేసుకున్నారు. ఆ సంస్థలో సుదీర్ఘకాలం పని చేసిన తొలి మహిళగా చరిత్రకెక్కారు. మరి ఆమె ఏం కావాలనుకున్నారు?

**టైపిస్ట్ ఉద్యోగానికి వెళ్ళి...**

ఆర్కిటెక్ట్ కావాలన్నది సుసాన్ కోరిక. చిన్న వయసులో కాలిఫోర్నియాలోని స్క్రిప్స్ కాలేజీలో ఆర్ట్ అండ్ ఆర్కిటెక్చర్ కోర్సులో చేరారు కూడా! అయితే త్వరలోనే ఆర్ట్స్ విభాగంలో రాణించే సామర్థ్యం తనకు లేదనిపించింది. నిజానికి గణితంలో ఆమె చిన్నప్పట్నుంచీ మేధావి. హైస్కూల్లో చదువుతున్నప్పుడు, మిగిలిన వాళ్ళ కన్నా వేగంగా రసాయన శాస్త్ర సమీకరణాలు పూర్తిచేసి, బహుమతులు కూడా గెలుచుకున్నారు. కాబట్టి 'ఇంజనీరింగ్ వైపు మళ్ళితే బాగుంటుందేమో!' అని ఆమెకు అనిపించింది. ఆ నిర్ణయమే ఆమె జీవితాన్ని మలుపు తిప్పింది. ఒక ఇంజనీరింగ్ కంపెనీలో టైపిస్ట్ ఉద్యోగానికి ఆమె దరఖాస్తు చేశారు. ఆ ఉద్యోగం ఆమెకు రాలేదు. అప్పట్లో క్లిష్టమైన లెక్కలను అలవోకగా చేసే వారిని 'కంప్యూటర్లు' అని పిలిచేవారు. వారిని ఉద్యోగాల్లోకి తీసుకొనేవారు. ఇలాంటి 'కంప్యూటర్లు' సాధారణంగా మహిళలే అయి ఉండేవారు. సుసాన్ దరఖాస్తు చేసిన కంపెనీ అటువంటి కంప్యూటర్లను నియమించుకొనేది. ఇంటర్వ్యూకు ఆమె వెళ్ళినప్పుడు, 'లెక్కలు నీకు బాగా ఇష్టమా?' అని అడిగారు. 'అక్షరాల కన్నా అంకెలే ఎంతో ఇష్టం' అని ఆమె బదులిచ్చారు. దీంతో ఆమెకు 'కంప్యూటర్'గా ఉద్యోగం దొరికింది. "అన్ని లెక్కలనూ ఆలోచించి చేసేదాన్ని కాదు. ఒక పెద్ద ఫ్రిడెన్ కాలిక్యులేటింగ్ మెషిన్ మీద నేనూ, మరొక మహిళ పని చేసేవాళ్ళం. నలభై మంది ఇంజనీర్లకు వాళ్ళు అడిగిన గణాంకాలను అందజేసేవాళ్ళం" అని సుసాన్ ఆనాటి సంగతులు చెప్పారు.

**అప్పటికి 'నాసా' లేదు!**

అయితే ఆ ఉద్యోగంలో ఆమె ఎక్కువ కాలం చేయలేదు. వివాహం కావడంతో వేరే చోటుకు వెళ్ళాల్సి వచ్చింది. సుసాన్ భర్త పీటర్ ఫినాలే కాలిఫోర్నియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (కాల్టెక్)లో చదివారు. ఆ సంస్థే నాసా తరపున 'జెట్ ప్రొపల్షన్ లేబరేటరీ' (జేపీఎల్)ని ప్రస్తుతం నిర్వహిస్తోంది. "మేము నివసిస్తున్న ప్రాంతానికి దగ్గర్లో ఒక ప్రయోగశాలను కొండల మధ్య కాల్టెక్ విద్యార్థులు, రాకెట్ సైన్స్ రంగానికి చెందిన ఔత్సాహికులు ఏర్పాటు చేశారు. నా భర్త సూచన మేరకు నేను ఉద్యోగం కోసం అప్లై చేశాను. నాకు ఉద్యోగం వచ్చింది. నేను చేరే సమయానికి అమెరికా సైన్యం దానికి నిధులు సమకూర్చేది. అప్పటికి 'నాసా' ఇంకా ఏర్పాటు కాలేదు" అన్నారు సుసాన్. అమెరికా తన మొదటి శాటిలైట్ ఎక్స్‌ప్లోరర్-1ను 1958లో ప్రయోగించింది. ఆ ప్రయోగానికి రెండు రోజుల ముందే జెట్ ప్రొపల్షన్ లేబరేటరీలో సుసాన్ ఉద్యోగిగా చేరారు. అరవై ఒక్క సంవత్సరాలుగా అక్కడే పని చేస్తున్నారు. ఇప్పటికీ, ఎనభై రెండేళ్ళ వయసులో కూడా అక్కడే విసుగూ, విరామం లేకుండా ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

## సంగీతం అంటే ఇష్టం!

సుసాన్ రచయిత్రి కూడా! 'నాసా' చేపట్టిన వివిధ మిషన్ల గురించీ, అంతరిక్ష రంగంలో మార్పులు, అభివృద్ధి గురించి దాదాపు ఎనిమిది పుస్తకాలు రాశారు. "సంగీతం అంటే నాకెంతో ఇష్టం. సింఫనీలనూ, బ్యాలేలనూ థియేటర్లలో చూడడాన్ని బాగా ఆస్వాదిస్తాను. అలాగే ప్రయాణాలంటే సరదా. సెయింట్ లూయిస్, అండోవోర్‌లలో ఉంటున్న నా మనుమల్ని చూడడానికి తరచూ వెళ్తూ ఉంటాను" అని ఆమె చెప్పారు.

**గృహిణిగా ఉండిపోవాలనుకోలేదు!**

మూడేళ్ళు జేపీఎల్‌లో ఉద్యోగం చేసిన తరువాత, ఆమె భర్త మాస్టర్ డిగ్రీ కోసం సహకరించడానికి కొన్నాళ్ళు ఉద్యోగానికి సుసాన్ విరామం ఇచ్చారు. ఖాళీ సమయాల్లో ప్రోగ్రామింగ్ నేర్చుకున్నారు. తిరిగి జేపీఎల్‌లో చేరినప్పుడు 'కంప్యూటర్'గా కాకుండా ప్రోగ్రామర్‌గా బాధ్యతలు తీసుకున్నారు. మరో ఏడాదిన్నర గడిచింది. సుసాన్‌కు ఇద్దరు అబ్బాయిలు పుట్టడంతో వారిని పెంచడానికి మూడేళ్ళపాటు ఇంట్లోనే ఉండిపోయారు. అయితే గృహిణిగా ఉండిపోవడం తనకు సాధ్యం కాదని ఆమెకు అర్థమైపోయింది. "ఎంతో నిస్పృహగా ఉండేది. గృహిణిగా నేను పూర్తిగా విఫలమయ్యాను. నా మానసిక పరిస్థితిని భరించలేక సైకియాట్రిస్ట్‌ను కలిశాను. తిరిగి ఉద్యోగంలో చేరితే మంచిదని ఆయన సలహా ఇచ్చారు. 'జేపీఎల్'లో మళ్ళీ ప్రవేశించాను" అని ఆమె చెప్పారు. ఆ తరువాత ఆమె వెనుతిరిగి చూడలేదు. "1970ల్లో విడాకులు తీసుకున్నాను తరువాత పూర్తిగా ఉద్యోగానికే అంకితం అయ్యాను. మా ఇద్దరు పిల్లలూ కంప్యూటర్ సంబంధిత రంగాల్లో ఇప్పుడు పని చేస్తున్నారు" అంటారు సుసాన్.



ఉద్యోగంలో చేరిన మొదట్లో...

**సంకోచం వద్దు!**

ఈ సుదీర్ఘ కాలంలో ఆమె ఎన్నో ప్రతిష్ఠాత్మకమైన ప్రాజెక్టుల్లో పని చేశారు. కుజుడిపైకి ప్రయోగించిన మెరైనర్ శాటిలైట్లు మొదలుకొని, గురుగ్రహం చుట్టూ పరిభ్రమించే జునో వరకూ వీటిలో ఉన్నాయి. "ఉద్యోగినిగా నేను ఇక్కడ ప్రతిరోజూ ఎంతో సంతోషంగా గడుపుతున్నా. ఈ వాతావరణం, ఇక్కడ మనుషులు అంటే నాకు ఎంతో ఇష్టం. నేను చాలా అదృష్టవంతురాలిని. మహిళలకైనా, పురుషులకైనా నేను ఇచ్చే సలహా ఒక్కటే. మీకు సందేహాలుంటే తీర్చుకోవడానికి సంకోచించకండి.

నాకు వచ్చిన సంశయాలను వెంటనే తీర్చుకోవడం ద్వారానే ఇన్నాళ్ళు పని చెయ్యగలిగాను. చాలామంది నన్ను అడుగుతూ ఉంటారు... ఎప్పుడు రిటైర్ అవుతారని. కానీ నాకు అలాంటి ఆలోచనలేవీ లేవు. నేను చేస్తున్న పనిని ఆస్వాదిస్తున్నాను. ఎప్పటికప్పుడు ఏదో ఒక ప్రాజెక్ట్ నన్ను ఆకర్షిస్తూనే ఉంది. భవిష్యత్తులో కూడా ఏదో ఒకటి నాకు అప్పగిస్తూనే ఉంటారు. నేను చేస్తూనే ఉంటాను. అయినా ఇంట్లో కూర్చుంటే చెయ్యడానికి నాకు పనేం ఉంటుంది?" అంటారు సుసాన్.

---

నగ ధగ

# పెళ్లీడు నగలు!



సంప్రదాయ కట్టుబొట్టు, అలంకరణలో ఉండే అందమే వేరు. మరీ ముఖ్యంగా పెళ్లీడు అమ్మాయిలు పట్టు పరికిణీలు ధరించినప్పుడు జతగా బంగారు నగలూ ధరించక తప్పదు. అలాంటప్పుడు ఎలాంటి నగలు ఎంచుకోవాలో తెలుసుకుని అలంకరించుకుంటే మరింత ఆకర్షణీయంగా కనిపించవచ్చు!

బంగారు నగల్లో మరింత ప్రత్యేకంగా కనిపిచాలనుకుంటే లాంగ్ హారాలు ఎంచుకోవాలి. పూర్తిగా బంగారం, వజ్రాలు, పోల్కి, అన్‌కట్స్‌తో కూడిన నగలు ఈ ఈడు ఆడపిల్లలకు చక్కగా నప్పుతాయి. ఈ హారంతో పాటు జుంకాలు. గాజులు తప్పనిసరి.



**లాంగ్‌హారం:** ఎక్కువ బంగారంతో పొదిగిన అన్‌కట్ రకం హారాలు ప్రస్తుత ట్రెండ్. ముత్యాలు, అన్‌కట్స్ రకం హారాలైతే పరికిణీలు ధరించే అమ్మాయిలకు చక్కగా నప్పుతాయి. అలాగే వజ్రాల హారాలు కూడా బాగుంటాయి. బీడ్స్‌లో చోకర్లు వేసుకోవచ్చు. ఈ హారాలు 150 గ్రాముల్లో, జుంకాలు 30 నుంచి 40 గ్రాముల్లో ఉండేలా ఎంచుకుంటే పండగ శోభను ప్రతిబింబించేలా చేయవచ్చు.

**ఇతర నగలు:** నగలు కొనే సమయంలో మున్ముందు పెళ్లికీ ఉపయోగపడేలా వ్యూహాత్మకంగా వ్యవహరించాలి. ఇందుకోసం కొనే ప్రతిసారీ అంతకుముందు కొన్న నగలకు జోడీగా నగలను ఎంచుకోవాలి. ముందు హారాలు కొని ఉంటే, చంపస్వరాలు ఎంచుకోవాలి. మరోసారి పాపటిబిళ్ల, గాజులు, ముక్కెర... ఇలా నగలన్నీ ఒక్కొక్కటిగా కొని పెట్టుకుంటూ పోవాలి. ముక్కు పుడక స్క్రూ రకం ఎంచుకోవాలి. ఇదైతే గుచ్చుకోకుండా ఉంటుంది.



● **మంజులా రావు**
మంజుల జ్యువెల్స్, హైదరాబాద్

---

బ్యూటీ



బ్రష్‌ను బాటిల్‌లో ముంచి గోరు మీద రుద్దుకున్నంత మాత్రాన నెయిల్ పాలిష్ వేసుకున్న ఫలితం దక్కదు. గోరు మీద రంగు సమంగా పరుచుకుని, మెరుపులీనాలంటే కొన్ని చిట్కాలు పాటించాలి. అవేమిటంటే....

# నెయిల్ పాలిష్ ఇలా...

- బాటిల్‌ను అదే పనిగా కుదిపితే, నీటి బుడగలు ఏర్పడి గోరు మీద పరుచుకుంటాయి. కాబట్టి బాటిల్‌ను కదిలించాలి కానీ, విదిలించకూడదు.
- బ్రష్‌ను బాటిల్‌లో ముంచి నేరుగా గోరు మీద అప్లై చేయకూడదు. ముంచిన బ్రష్‌ను బాటిల్ అంచులకు అద్ది, అదనపు రంగును ఒంపేయాలి.
- మొదట గోరుకు రెండు చివర్ల వైపు నిలువుగా రంగును అద్దిన తర్వాత, మధ్యలో ఉన్న ఖాళీ ప్రదేశాన్ని నింపాలి.
- మొదట వేసిన కోటింగ్ పూర్తిగా ఆరిన తర్వాతే రెండో కోట్ వేయాలి.
- రంగు వేసిన గోళ్లను సహజసిద్ధంగా ఆరనివ్వాలి.
- నెయిల్ పాలిష్ గట్టిపడిపోకుండా ఉండడం కోసం ఫ్రిజ్ డోర్‌లో ఉంచాలి.
- గట్టి పడుతోందని అనిపిస్తే, కొన్ని చుక్కల అసిటోన్ కలపాలి.

---

ధరించే దుస్తుల ద్వారా ఒక దేశం పట్ల తమ అభిప్రాయాలు, అభిమానాన్ని చాటడం సెలబ్రిటీల నైజం. అమెరికా ప్రథమ మహిళ మెలానియా ట్రంప్... తొలి భారతదేశ పర్యటనకు ఓ స్టయిల్ స్టేట్‌మెంట్‌తో విచ్చేశారు. ఇవాంకా ట్రంప్ కూడా అంతే! హృద్యమైన ఫ్లవర్ ట్రెండ్‌ను ఫాలో అవుతున్న ఇవాంకా భారతీయ డిజైనర్ల దుస్తులను ఎంచుకుని మన దేశంపట్ల అభిమానాన్ని ప్రదర్శించారు. వీరిద్దరి దుస్తులు చెప్పకనే చెబుతున్న ఫ్యాషన్ స్టేట్‌మెంట్స్ ఇవే!

# ఇద్దరూ ఇద్దరే!

అమెరికా ఫస్ట్ లేడీ మెలానియా ట్రంప్ తెల్లని జంప్‌సూట్‌తో భారత్‌లోకి అడుగు పెట్టారు. ఆమె ధరించిన దుస్తులకు ప్రత్యేకత ఉంది. ఫ్రెంచ్ అమెరికన్ డిజైనర్ 'హార్వే పెర్రె' డిజైన్ చేసిన జంప్‌సూట్ అది. అయితే ఆ జంప్‌సూట్‌కు ఇండియన్ టచ్ ఇవ్వడం మర్చిపోలేదామె. నిలువెత్తు జంప్‌సూట్ ధరించినా, నడుము దగ్గర ఆకుపచ్చని శాష్ కట్టుకున్నారు. ఆ శాష్ వెనక ఓ కథ ఉంది. పురాతన భారతీయ టెక్స్‌టైల్ డాక్యుమెంట్లలో దాగిన ఓ దుస్తుల స్టయిల్ ఇది. ఆ స్టయిల్‌ను అనుకరించానని డిజైనర్ హార్వే తన ఇన్‌స్టాగ్రామ్‌లో స్వయంగా వివరించారు. ఆకుపచ్చని పట్టు, బంగారు రంగు మెటాలిక్ దారాలతో, సంప్రదాయ డిజైన్‌లో ఆ శాష్ తయారైంది.

## 'శ్వేత'వర్ణ శోభితం!

మెలానియా ట్రంప్ దుస్తుల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తారు. ఆమె దుస్తుల పట్ల ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఫ్యాషన్ డిజైనర్లు, ప్రజల నిశితమైన పరిశీలనల గురించి ఆమెకు తెలుసు. అయినా ఆమె స్టయిలిస్ట్‌లు, షాపర్ల అభిప్రాయం, సలహాలతో పని లేకుండా తన దుస్తులను స్వయంగా ఎంచుకుంటూ ఉంటారు. మెలానియా విదేశీ పర్యటనల్లో ఎక్కువగా తెలుపునే ఇష్టంగా ధరిస్తూ ఉంటారు. కొద్ది రోజుల క్రితం ఫ్లోరిడాలో ఓ అవార్డు వేడుకకు హాజరయినప్పుడు కూడా తెల్లని మిడీ ధరించారు.

## పువ్వుల్లో హాయ్... హాయ్!

ఇవాంకా ట్రంప్ భారత పర్యటనలో పువ్వుల డిజైన్లతో కూడిన దుస్తులకే ప్రాధాన్యం ఇచ్చారు. బేబీ బ్లూ, మిడి రెడ్ ఫ్లోరల్ ప్రింట్‌తో కూడిన ఈ డ్రెస్ ప్రొయెంజా స్కోలర్ బ్రాండ్‌కు చెందినది. ఇవాంకా ఈ డ్రెస్‌ను ధరించడం ఇది మొదటిసారి కాదు. ఇవే దుస్తులను ఆమె గత ఏడాది అర్జెంటీనా పర్యటనకూ ధరించారు. ఈ దుస్తుల ఖరీదు అక్షరాలా ఒక లక్షా డెబ్బై వేల రూపాయలు. ఇలా ధరించిన దుస్తులనే రెండోసారి ధరించడం ద్వారా ఇవాంకా, పర్యావరణ సమతౌల్య విలువను తెలియచెప్పే పవర్‌ఫుల్ ఫ్యాషన్ స్టేట్‌మెంట్‌ను అందించారు. రాష్ట్రపతి విందుకు విచ్చేసినప్పుడు కూడా ఆమె పువ్వులతో కూడిన అనార్కలి సూట్‌ను ధరించారు. ప్రఖ్యాత భారతీయ ఫ్యాషన్ డిజైనర్ రోహిత్ బాల్ డిజైన్ చేసిన ఈ దుస్తులు 'గుల్‌దస్తా' కలెక్షన్‌కు చెందినవి. బంద్‌గలా స్టయిల్ కాలర్, చేతులపై గోల్డ్ వైర్ ఎంబ్రాయిడరీ, ఫ్రంట్ స్లిట్‌తో కూడిన ఈ అనార్కలి దుస్తుల్లో ఇవాంకా తెల్ల గులాబీలా మెరిసిపోయారు. అలాగే రాష్ట్రపతి భవన్‌కు విచ్చేసిన సందర్భంలో కూడా ఇవాంకా భారతీయ ఫ్యాషన్ డిజైనర్ అనితా డోంగ్రే డిజైన్ చేసిన తెల్లని షేర్వాణీ ధరించారు. ముషీరాబాద్‌కు చెందిన హ్యాండ్‌వూవెన్ సిల్క్‌తో తయారైన షేర్వాణీ ఇది.

సొగసు





## తెలివైన ప్రదర్శన!

ఫస్ట్ లేడీ మెలానియా ట్రంప్, ఇవాంకా ట్రంప్ మనదేశ పర్యటనలో ధరించబోయే దుస్తుల గురించి ఒక ఫ్యాషన్ డిజైనర్‌గా ఎంతో ఉత్సుకతతో ఎదురుచూశాను. మెలానియా ధరించిన అటెలియర్ క్రైటో జంప్‌సూట్, నడుముకు ఆకుపచ్చని పట్టు శాష్ అత్యద్భుతం. భారత సంస్కృతిలో ఆకర్షణీయమైన రంగులకు ప్రాధాన్యం ఉంది. కాబట్టే ఆమె నడుముకు ఆకుపచ్చని సిల్క్ శాష్ ధరించారు. ఇక ఇవాంకా ధరించిన అనార్కలి సూట్ గురించి చెప్పాలంటే...సూక్ష్మమైన తెలుపు రంగును ఎంచుకోవడం, ఎరుపు, బంగారు వర్ణాలను రంగరించడంలో డిజైనర్ రోహిత్ బాల్ తెలివైన పనితనం ప్రదర్శించారు. హై నెక్, నడుము దిగువ నుంచి లేయర్‌లా విస్తరించిన సూట్ డిజైన్ ఇవాంకా డ్రెస్‌కు రాయల్ లుక్ తెచ్చిపెట్టింది. మొత్తంగా వాళ్లిద్దరూ భారతీయుల మనసులు గెలుచుకున్నారు.



● **దివ్య కారంచేడు**
ఫ్యాషన్ డిజైనర్, హైదరాబాద్

నవ్య
ఆంధ్రజ్యోతి
నివేదన
6
శుక్రవారం • 28 ఫిబ్రవరి 2020

సద్గురువాణి

లోకమంతా నాదమయం. ఆది నాదం 'ఓం'కారం. అదే సృష్టికి మూలం అని శాస్త్రాలు చెబుతున్నాయి. అనంతమైన శబ్ద సముదాయంలో అపారశక్తి కలిగినవి బీజాక్షరాలు. ఆ బీజాక్షరాలతో నిండినవే మంత్రాలు. అందుకే మంత్రాలకు ఉన్న మహత్తు ఊహకు అందనిదన్నది ఋషి వాక్యం.

# మంత్రం... మహిమాన్వితం



ఈ సృష్టి అంతా శక్తి ప్రకంపనలేనని ఆధునిక విజ్ఞానశాస్త్రం చెబుతోంది. ఈ సృష్టి సమస్తం సంక్లిష్టమైన శబ్దాల అమరికలే! ఆ అమరికల్లో, కొన్ని శబ్దాలను మూల శబ్దాలుగా ఋషులు గుర్తించారు. వీటినే మనం 'మంత్రాలు' అంటాం దివ్యత్వాన్ని తెలుసుకుని అనుభూతి చెందాలంటే, మనలోని ఆ శక్తి అణువణువునా చేరాలి. మరింత సూక్ష్మంగా ఎదగాలి.

"ఒక మంత్రంతో ఇదంతా జరుగుతుందా?' అని తార్కికులు ఆశ్చర్యపోతారు. దీనికి సంబంధించిన ఒక అద్భుతమైన కథ మన సంస్కృతిలో ఉంది.

**మానవ దేహంలో సహజ సిద్ధమైన శక్తి ఉంది. ఆధ్యాత్మికమైన ప్రేరణతో ఆ శక్తి ఉప్పొంగుతుంది. దాన్ని ఉపయోగించుకొని, సరైన మంత్రాలతో, ధ్యానాలతో, పవిత్రమైన వాతావరణంతో మనం దివ్యత్వానికి మరో అడుగు చేరువ అవుతాం.**

ఒక రోజు, శివుడి దగ్గరకు గొప్ప సిద్ధులు కలిగిన ఒక యోగి వచ్చాడు. "ఎందుకు నీ భక్తులు ఎప్పుడూ ఈ మంత్రాలు అరుస్తూ ఉంటారు? వీళ్ళందరూ ఏం చేస్తున్నారు? నువ్వు వారికి ఇలాంటి చెత్తంతా ఆపమని ఎందుకు చెప్పడం లేదు?" అని అడిగాడు.

శివుడు అతణ్ణి చూసి, "నువ్వు ఒక పని చెయ్యి" అని అక్కడ ఉన్న ఒక పురుగును చూపించాడు. అది భూమి మీద పాకుతోంది. "దాని దగ్గరికి వెళ్లి నువ్వు 'శివ శంభో' అని ఉచ్చరించు, ఏం జరుగుతుందో చూద్దాం" అన్నాడు.

ఆ యోగి భుజాలు ఎగరేసి, అయిష్టంగానే సరేనన్నాడు. అతను ఆ పురుగు దగ్గరకు వెళ్లి 'శివ శంభో' అనగానే, ఆ పురుగు చచ్చి పడిపోయింది.

ఆ యోగి నివ్వెరపోయి, ఏమిటిది? ఈ మంత్రం ఉచ్చరిస్తేనే ఆ పురుగు చచ్చి పోయింది" అన్నాడు.

శివుడు నవ్వి, అక్కడ ఎగురుతున్న ఆ సీతకోకచిలుకని చూపించాడు. దాన్ని చూసి 'శివ శంభో' అనమన్నాడు. అప్పుడు జ్ఞాన యోగి "లేదు, నాకు ఆ సీతకోకచిలుకను చంపడం ఇష్టం లేదు" అన్నాడు. శివుడు ప్రయత్నించమన్నాడు.

జ్ఞాన యోగి సీతాకోకచిలుకను చూసి 'శివ శంభో' అన్నాడు. సీతాకోకచిలుక చనిపోయింది. "ఈ మంత్రం యొక్క ఫలితం ఇదైతే, ఎవరైనా దాన్న ఎందుకు ఉచ్చరించాలనుకుంటారు?" అని జ్ఞానయోగి అడిగాడు.

శివుడు ఇంకా చిరునవ్వుతోనే, అడవిలో చెంగున తిరిగే ఒక అందమైన జింకను చూపించాడు. దానిపై దృష్టి పెట్టి, 'శివ శంభో' అనమన్నాడు.

"లేదు, నాకు చంపడం ఇష్టంలేదు" అన్నాడు జ్ఞాన యోగి. అందుకు శివుడు, "ఫరవాలేదు, అను" అన్నాడు. జ్ఞాన యోగి 'శివ శంభో' అన్నాడు. జింక చనిపోయింది. అతడు పూర్తిగా కలవరపడ్డాడు. "ఈ మంత్రం ఉద్దేశ్యం ఏమిటి? ఇది అన్నిటినీ చంపుతోంది" అని ప్రశ్నించాడు.

శివుని ఆశీర్వాదం కోసం అప్పుడే పుట్టిన శిశువుతో ఒక తల్లి వచ్చింది. శివుడు జ్ఞాన యోగిని చూస్తూ, "ఈ బిడ్డ కోసం ఆ మంత్రం చెప్పరాదూ?" అని అడిగాడు.

"లేదు, నేను అలాంటి పనులు చేయాలనుకోవడం లేదు. శిశువును చంపడం నాకు ఇష్టం లేదు" అన్నాడు.

శివుడు "ప్రయత్నించు" అని అతణ్ణి ముందుకు తోశాడు.

జ్ఞాన యోగి ఆ పిల్లవాని దగ్గరకు చాలా ఆందోళనతో వెళ్లి 'శివ శంభో' అన్నాడు. ఆ శిశువు లేచి కూర్చొని "నేను ఒక పురుగుగా ఉన్నాను, ఒక మంత్రం నన్ను సీతాకోకచిలుక రూపంలోకి మార్చింది. మరొక మంత్రంతో- నీవు నన్ను జింకగా చేశావు. ఇంకొక మంత్రంతో- నన్ను మానవునిగా చేశావు. మరొకసారి ఉచ్చరించు, నాకు దివ్యత్వాన్ని పొందాలని ఉంది" అని అన్నాడు.

**అదీ ఒక మంత్రానికి ఉన్న శక్తి!**



• సద్గురు జగ్గీవాసుదేవ్

నవజీవన వేదం



## నిజమైన స్నేహం!

స్నేహితులు పాలు, నీళ్లలా ఉండాలి. పాలలో, నీళ్లు కలిసిపోతే పాలేవో, నీళ్లేవో తెలియదు. స్నేహం కూడా అంతలా కలిసిపోయాలి. ఇదే విషయాన్ని భర్తృహరి సుభాషితాలను తెలుగులో అందించిన ఏనుగు లక్ష్మణకవి పద్యం ద్వారా తెలుసుకుందాం.

**క్షీరము మున్ను నీటి కొసగెన్ స్వగుణంబులు తన్ను చేరుటన్**
**క్షీరము తప్తమౌట గని చిచ్చురికెన్ వెతచే జలంబు దు**
**ర్వార సుహృద్విపత్తిగని వహ్ని జొరంజనె దుగ్ధ మంతలో**
**నీరము గూడి శాంతమగు నిల్చు మహాత్ముల మైత్రి యీగతిన్**

పాలలో నీళ్లు పోయండి. ఆ తరువాత ఏం చేసినా సరే పాలు, నీళ్లు వేరు చేయలేరు. 'క్షీరము మున్ను నీటి కొసగెన్ స్వగుణంబులు తన్ను చేరుటన్' అంటే.. పాలు, నీళ్లను పిలిచి మనం ఇద్దరం ఒకటే అని కలిపేసుకుని నీళ్లను కూడా పాలలా మార్చేసింది. ఎన్ని నీళ్లు కలిసినా అవి పాలే అవుతాయి కానీ నీళ్లు కావు కదా! పాలు తన గుణాలన్నీ ఇచ్చేసి, నీళ్లను కూడా పాలగా మార్చేసింది. అప్పుడు నీరు ఏం చేసింది? 'క్షీరము తప్తమౌట గని చిచ్చురికెన్ వెతచే జలంబు' అంటే.. పాలు వేడి చేస్తాం కదా! వేడి చేసినప్పుడు పాలు వేడెక్కిపోతూ ఉంటే నీళ్లకు బాధ కలిగిందట. ఆ బాధతో నీరు ఆవిరిరూపంలో బయటకు పోవడం మొదలుపెట్టిందట! అందుకే పాలు ఎక్కువ సేపు వేడి చేస్తే నీళ్లన్నీ పోయి చిక్కటి పాలే మిగులుతాయి. 'దుర్వార సుహృత్విపత్తిగని వహ్ని జొరంజనె దుగ్ధ'.... నీళ్లు ఆవిరి రూపంలో బయటకు వెళ్లిపోవడం చూసి పాలు తట్టుకోలేక పొంగి పొయ్యి మీద పడిపోతున్నాయట! 'నీరము గూడి శాంతమగు'... పొంగిపోతున్న పాలను ఆపడానికి బయట నుంచి మళ్లీ నీళ్లు చల్లుతారు. అప్పుడు పాలు, "హమ్మయ్యా! నా నీళ్లు నా దగ్గరకు వచ్చేశాయి" అనుకుని పొంగడం ఆగిందట! నిజంగా మహాత్ములు ఇలాగే ఉంటారు. "నిల్చు మహాత్ముల మైత్రి యీగతిన్"... వాళ్ల స్నేహం అలాగే ఉంటుంది. 20 ఏళ్ల వయసులో చేసిన స్నేహం, 70 ఏళ్ల వయసులోనూ కొనసాగాలి. అదీ నిజమైన స్నేహం.



• డా. గరికిపాటి నరసింహారావు

దైవమార్గం



## ప్రయత్నిస్తేనే...

అప్రయత్నంగా ఏదీ సిద్ధించదు. ఆధ్యాత్మికమైన ఉన్నతి కూడా అంతే! దైవం గురించి తెలుసుకోవాలనే కోరిక, సత్యం కోసం వెతకాలనే ఆకాంక్ష, దాన్ని చేరుకోవాలనే తపన విశ్వాసికి ఉండాలి. అలాంటి విశ్వాసే దైవానికి చేరువ అవుతాడు. "నేను మీకు చెప్పేదేమిటంటే... అడగండి- అది మీకు లభిస్తుంది. వెతకండి- అది మీకు దొరుకుతుంది. తలుపు తట్టండి- మీకోసం అది తెరుచుకుంటుంది" అని ఏసు ప్రభువు చెప్పిన మాట వెనుక అంతరార్థం అదే!

వ్యాసపీఠం



## విశ్వపరిణామంలో 'నేను'

తాత్త్వికమైన ప్రయాణంలో మనిషి 'నేను'ను, అంటే తన 'ఆత్మత్వా'న్ని తెలుసుకోవడం మొదటి అంచెగా పెద్దలు చెబుతారు. ఆత్మవిచారం, స్వీయ అవగాహన ఆధ్యాత్మిక మార్గంలో పురోగమనానికి మార్గదర్శకాలు అవుతాయి. అలాంటి పురోగతి సాధించినవారు మార్గదర్శకులు అవుతారు. యోగం, ధ్యానాలను సాధన చేసి, వాటి రహస్యాలను ఆసక్తి కలిగిన వారికి అందించడానికి అనేక రచనలు చేసిన అనుభవం విశ్వర్షి వాసిలి వసంతకుమార్‌కు ఉంది. 'మాస్టర్ యోగ'కు బహుళ ప్రాచుర్యం కల్పించిన సాహితీవేత్త శార్వరి (వాసిలి రామకృష్ణశర్మ) కుమారుడైన వసంతకుమార్ తాజాగా రాసిన పుస్తకం 'నేను'. దీన్ని 'యౌగిక కావ్యం'గా ఆయన పేర్కొన్నారు. నిజానికి ఇది ఒక దీర్ఘ కవిత. నేను గురించిన ఈ 'విశ్వావలోకనం'లో 'పరిణామ పథం', 'ప్రమోద పథం', 'ప్రమాణ పథం', 'ప్రస్థాన పథం' అనే నాలుగు విభాగాలు ఉన్నాయి. 'నేను'లోని అసంఖ్యాకమైన భావకోణాలను వాసిలి ఈ కావ్యంలో లోతుగా, అత్యంత కవితాత్మకంగా ఆవిష్కరించారు. అణు రూపం మొదలుకొని విశ్వ పరిణామానికీ, మానవ పరిణామానికీ భారతీయ తాత్త్విక చింతనా దృక్పథంతో ఆయన చేసిన విశ్లేషణ ఇందులో చూడవచ్చు.

**నేను** (యౌగిక కావ్యం)
రచన: **విశ్వర్షి వాసిలి వసంతకుమార్**
**ప్రచురణ:** యోగాలయ, తిరుమలగిరి, సికింద్రాబాద్-500015
**పేజీలు:** 152, **వెల:** రూ.150,
**ప్రతులకు:** 9393933946

ధర్మపథం



## దేన్ని నమ్మాలి?

శ్రమణ సంప్రదాయానికి పుట్టినిల్లు భారత దేశం. అహింస, పరిత్యాగం, జన్మరాహిత్యం - ఈ మూడు ధార్మిక పునాదులపై ఏర్పడిన సంప్రదాయం ఇది. బౌద్ధం, జైనం, ఉపనిషత్తులు, చార్వాక దర్శనాలు... ఇవన్నీ ఈ కోవకు చెందినవే! బుద్ధుని కాలానికి 62 శ్రమణ సాంప్రదాయాలు ఉన్నట్టు బౌద్ధ సాహిత్యం ద్వారా తెలుస్తోంది. బౌద్ధాన్ని '63వ శ్రమణ సంప్రదాయం' అంటారు. ఈ కోవలో బౌద్ధం ఆఖరుది.

ఆ రోజుల్లో గంగాతీరంలో కేశముక్తం అనే పెద్ద వ్యాపార కూడలి ఉండేది. అది ఆధ్యాత్మికతకు కూడా నిలయం. దాదాపు అన్ని శ్రమణ సంప్రదాయాలకూ అది కేంద్రం. ప్రతి రోజూ ఏదో ఒక చోట ధార్మిక ప్రసంగాలు జరుగుతూ ఉండేవి. ఎవరి వాదాల్ని వారు బలంగా వినిపిస్తూ ఉండేవారు. ప్రతి వారూ తమ సంప్రదాయమే ముక్తికి ఏకైక మార్గం అని నొక్కి చెబుతూ ఉండేవారు. దేన్ని నమ్మాలో తెలియక ప్రజలు గందరగోళ పడేవారు. ఏ ఒక్కరిని అడిగినా సరైన సమాధానం దొరికేది కాదు.

ఒకసారి బుద్ధుడు తన బౌద్ధ సంఘంతో కలిసి కేశముక్తం వచ్చాడు. ధమ్మ ప్రసంగం చేశాడు. అనంతరం కాలాములు అనే పెద్దలు లేచి "భగవాన్ మీరు చెప్పింది బాగానే ఉంది. మీలాగే ఎందరో శ్రమణులు ఇక్కడ ఉన్నారు. ఎవరి విధానం వారు చెబుతున్నారు. దీనిలో ఏది సరైనదో, మేము దేన్ని ఆచరించాలో మాకేమీ పాలుపోవడం లేదు. ఈ సమస్యను ఎలా పరిష్కరించుకోవాలి?" అని అడిగారు.

"కాలాములారా! కలవరపడకండి. మీ సమస్యకు పరిష్కారం మీ చేతుల్లోనే ఉంటుంది" అన్నాడు బుద్ధుడు.

"అయితే, భగవాన్! మేము దేన్ని నమ్మాలో, దేన్ని విడవాలో సెలవియ్యండి" అని కోరారు.

"కాలాములారా! ఏ విషయాన్నయినా సరే... 'ఇది తరతరాలుగా వస్తోంది కాబట్టి నమ్మాలి' అని నమ్మకండి. 'ఎన్నెన్నో గురు పరంపరలుగా దీని బోధన జరుగుతోంది కాబట్టి నమ్మాలి' అని నమ్మకండి. 'ఈ సిద్ధాంతం చెప్పేవాడు చాలా గౌరవనీయుడు, గొప్పవాడు. కాబట్టి దీన్ని నమ్మి తీరాలి' అని నమ్మకండి 'ఈ విషయం ఒక గొప్ప గ్రంథంలో ఉంది. ఆ గ్రంథం చాలా పవిత్రమైనదిగా పరిగణన పొందుతోంది. కాబట్టి నమ్మాల్సిందే!' అని నమ్మకండి. 'ఈ విషయం చెప్పినవాడు చాలా అనర్గళంగా చెప్పాడు. అతని కంఠం గంభీరంగా ఉంది. మధురంగా ఉంది. అతను చాలా అందగాడు. స్ఫురద్రూపి. అలాంటి వాడు చెప్పాడు కాబట్టి నమ్మాలి' అని నమ్మకండి. కాలాములారా! జ్ఞానం మాత్రమే నిజమైనది. దాన్ని మీకు మీరుగా సాధించుకోవాల్సిందే! నిజాన్ని ఎప్పుడూ సందేశాల ద్వారానో, ప్రవచనాల ద్వారానో నిగ్గు తేల్చుకోలేం. జీవితానుభవం ద్వారానే అది సాధ్యం. కాబట్టి, ఎవరు ఏమి చెప్పినా మీరు మీ జీవితాచరణ ద్వారా ఏది నిజమైనదో, ఏది నమ్మదగినదో నిర్ణయించుకోండి' అని చెప్పాడు బుద్ధుడు.

బుద్ధుడు చెప్పిన సమాధానం విని అందరి మనసులూ కుదుటపడ్డాయి. కానీ ఒక యువకుడు లేచి "భగవాన్! మరి మీరు చెప్పే సందేశాల్ని?" అని అడిగాడు.

"నేను చెప్పినదైనా సరే! మీ అనుభవానికి అందితేనే స్వీకరించండి" అన్నాడు బుద్ధుడు.

బుద్ధునికి ఆ యువకుడు ప్రణమిల్లాడు.

బహుశా వేల సంవత్సరాల తాత్త్విక చరిత్రలో ఇలా చెప్పిన మరొక జ్ఞాన సింధువును ఈ నింగీ నేలా, నీరూ నిప్పూ, గాలీ చూడనే లేదు!

• బొర్రా గోవర్ధన్

సమాచారం

## 4న యాదాద్రీశుని కల్యాణం



సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం యాదాద్రి (యాదగిరి గుట్ట) శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి తిరు కల్యాణ మహోత్సవం మార్చి 4వ తేదీన జరగనుంది. స్వస్తి వచనంతో ఫిబ్రవరి 26న మొదలైన స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు మార్చి 7 వరకూ కొనసాగుతాయి. ఈ వేడుకలలో భాగంగా వివిధ వాహన సేవలను నిర్వహిస్తున్నారు. మార్చి 5న రథోత్సవం ఉత్సవ ప్రధాన ఘట్టాల్లో ఒకటి. మార్చి 7 రాత్రి శృంగార డోలోత్సవంతో ఈ పదకొండు రోజుల బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.




## డీటాక్స్ యోగలో శిక్షణ

యోగ సంబంధమైన మెలకువలు, శక్తిమంతమై ఆసనాలు, సాత్వికమైన ఆహారం... వీటి సమ్మేళనంతో శరీరాన్నీ, ఆలోచనలనూ 'సిద్ధ సమాధి యోగ' ద్వారా శుద్ధి చెయ్యవచ్చన్నది యోగ నిపుణుల మాట. ఈ డీటాక్స్ యోగాను అనుసరించిన వారి శరీరం, మనసు తేలికగా, ప్రకాశవంతంగా, సంతోషంగా మారతాయని నిరూపితమయిందని వారు చెబుతున్నారు. గురూజీ ఋషి ప్రభాకర్ పర్యవేక్షణలో 'డీటాక్స్ యోగ' కార్యక్రమాన్ని హైదరాబాద్‌లోని అవధాన సరస్వతి పీఠంలో మార్చి 1 నుంచి 15 వరకూ నిర్వహిస్తున్నారు. మొదటి రోజున ఉచిత పరిచయ తరగతి ఉంటుంది. మరిన్ని వివరాల కోసం 89789 93995, 83747 33500 నెంబర్లలో సంప్రతించవచ్చు.

జ్ఞానారవిందం

## అదొక్కటి తెలిస్తే చాలు!



'అయమాత్మా బ్రహ్మ' అంటుంది మండూక్యోపనిషత్తు. అంటే 'ఆత్మయే పరబ్రహ్మ!' ఆ ఆత్మకు విస్తృత రూపమే ప్రపంచం. విడివిడిగా కనిపించేదంతా, జగత్తు యావత్తూ, ఈ జగత్తులోని మనమందరం తత్త్వపరంగా ఒకటే. కానీ మానసిక స్థాయిలో ఈ ఒకే ఉనికి అనేకంగా, వేరువేరుగా కనబడుతుంది. అదే ఆత్మ స్థాయి నుంచీ చూసినప్పుడు అంతా ఒకటిగానే కనిపిస్తుంది. తత్త్వ చింతన అంతరంగంలో మొదలవుతుంది. అన్ని దుఃఖాల నుంచీ, సమస్యల నుంచీ ఎలా బయటపడాలో, ప్రశాంతంగా, నిండుగా ఎలా జీవించాలో మార్గం చూపిస్తుంది. అసలు నిజం ఏమిటో తెలియజేస్తుంది. అలా బయటపడిన ఆ సత్యమే 'అయమాత్మా బ్రహ్మ!' "నీవు ఆత్మ స్వరూపానివి. కనిపించేదంతా, గతం, ప్రస్తుతం, భవిష్యత్తూ... ఇవన్నీ ఆత్మ స్వరూపం ప్రకటనా రీతులే తప్ప, నీ ఆనందం కోసం నువ్వు సృష్టించుకున్నవే తప్ప 'నీది' అనేది అన్యంగా ఏదీ లేదు" అని అది చెబుతుంది. "ప్రతి చిన్న విషయానికీ ప్రాధాన్యం ఇచ్చి, దాని గురించి చింతిస్తూ, చూపును వేరే వైపు మరల్చడం వల్ల అగాధం లాంటి హృదయంలో ఉన్నది ఏమిటో మానవుడు ఊహించలేకపోతున్నాడు. అందుకే ఆ అతీత స్థితి అంటే బ్రహ్మ స్వరూపం అతనికి తెలియకుండా రహస్యంగా ఉండిపోయింది" అంటారు సావిత్రి మహా కావ్యంలో శ్రీ అరవిందులు.

**మానసిక స్థాయిలోనే మనం బిగిసిపోయి ఉన్నంత వరకూ 'నీది-నాది' అనే భేద భావం తప్పదు. అది ఉంటే, సమస్యలు తప్పవు. సమస్యలు ఉన్న చోట సంఘర్షణా తప్పదు.**

మనం అనవసరమైన విషయాలతో. వృథా ప్రసంగాలతో కాలక్షేపం చేస్తాం. ఏది తెలుసుకుంటే తెలుసుకోవలసింది ఇక ఏదీ మిగలదో దాని గురిం చి పట్టించుకోం. అందుకే జీవితం సంకుల సమరంగా, విషవలయంగా, అగమ్యంగా, సమస్యల నిలయంగా, విషాద భరితంగా మారింది. వీటి నుం చి బయటపడడానికి 'అయమాత్మా బ్రహ్మ' అనే సత్యం వైపు దృష్టి కేంద్రీకరించి, జీవితాలను ఆనందమయం చేసుకోమని ఉపనిషత్తులు చెబుతున్నాయి.

• కె. సంపూర్ణ

## డైలీ సుడోకు - 293

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | | 4 | | | 1 | | 8 | 2 |
| | | 2 | 5 | | 6 | 4 | 3 | |
| | | | | 2 | | | | |
| 3 | | | | | | 8 | 9 | |
| | | | 9 | | 2 | | | |
| | 9 | 7 | | | | | | 1 |
| | | | | 7 | | | | |
| | 8 | 5 | 2 | | 9 | 6 | | |
| 4 | 3 | | 6 | | | 2 | | |

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.

సుడోకు- 292 సమాధానం

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 5 | 9 | 8 | 2 | 1 | 6 | 3 | 4 | 7 |
| 7 | 6 | 1 | 5 | 3 | 4 | 9 | 8 | 2 |
| 2 | 3 | 4 | 9 | 8 | 7 | 6 | 5 | 1 |
| 6 | 2 | 5 | 8 | 4 | 1 | 7 | 9 | 3 |
| 4 | 7 | 9 | 3 | 6 | 2 | 5 | 1 | 8 |
| 8 | 1 | 3 | 7 | 5 | 9 | 2 | 6 | 4 |
| 3 | 4 | 6 | 1 | 2 | 5 | 8 | 7 | 9 |
| 1 | 8 | 7 | 6 | 9 | 3 | 4 | 2 | 5 |
| 9 | 5 | 2 | 4 | 7 | 8 | 1 | 3 | 6 |

సందేశం

## అదే దైవ కృప



సత్యాన్ని విశ్వసించేవారు ప్రాపంచిక బంధాలు తెరుచుకొని, పరలోకం వైపు దృష్టి సారిస్తారు. అలాంటి వారికే స్వర్గంలో ప్రవేశం ఉంటుంది. అలాంటి అర్హత కలిగిన వారు మరణించిన తరువాత జరిగేదేమిటో పెద్దలు వివరించారు. సత్కర్మలు ఆచరించిన వ్యక్తులు చివరి ఘడియల్లో ఉన్నప్పుడు దేవదూతలు వస్తారు. స్వర్గం నుంచి వస్త్రాలు, సువాసన ద్రవ్యాలు తీసుకువస్తారు. ఆ తరువాత ప్రధాన మరణ దూత (హజ్రత్ ఇజ్రాయీల్) అలైహిస్సలాం వచ్చి, అతని తల దగ్గర కూర్చుంటారు. "పవిత్రమైన ఓ ఆత్మా! నీ ప్రభువు చూపే ప్రసన్నతా భాగ్యాల వైపు బయలుదేరు" అంటారు. విశ్వాసి శరీరం నుంచి పరమ సంతోషంగా, ఎంతో సులభంగా ఆత్మ వెలువడుతుంది. దైవదూతలు దాన్ని కస్తూరితో నిండిన వస్త్రంలో చుట్టి తీసుకువెళ్తారు. అంచెలంచెలుగా ఉన్న ఆకాశాలను దాటుకుంటూ ఏడో ఆకాశంలోకి చేరుకుంటారు. అక్కడ ఆ ఆత్మను సృష్టికర్త సన్నిధిలో ప్రవేశపెడతారు.

"ఈ దాసుడి పేరును ఇల్లీన్ (సత్కర్మల చిట్టా)లో రాయండి. ఇతణ్ణి తిరిగి భూలోకానికి తీసుకువెళ్ళండి. భూలోకపు మట్టితో ఇతణ్ణి నేను సృష్టించాను. తిరిగి అక్కడికే పంపుతాను. అందులోనుంచే తిరిగి బతికించి లేపుతాను" అని సృష్టికర్త ఆజ్ఞాపిస్తాడు. అప్పుడు ఆ ఆత్మను సమాధిలోని సృష్టికర్త దేహంలోకి దేవదూతలు తిరిగి ప్రవేశపెడతారు. ఇద్దరు (మున్కిర్, నకీర్ అనే) దేవదూతలు వచ్చి, సమాధిలోంచీ అతణ్ణి లేపుతారు. అనేక ప్రశ్నలు అడిగి, సమాధానాలతో సంతృప్తి చెందుతారు. అప్పుడు, "నా దాసుడు నిజం చెప్పాడు. అతణ్ణి స్వర్గానికి తీసుకురండి" అని అశరీరవాణి వినిపిస్తుంది. అప్పుడు దైవ సమాధిలో స్వర్గం వైపు ఉన్న కిటికీ తెరుస్తారు. అది సుగంధాలు వెదజల్లుతూ ఉంటుంది. "ఇదే నీ శాశ్వత నివాసం. నీ విశ్వాసానికి ఫలితం. దేవుడి చిత్తం ఉంటే ఆ విశ్వాస స్థితిలోనే ప్రళయ దినాన మళ్ళీ లేస్తావు. స్వర్గంలో నీ స్థానం సుస్థిరం చేసుకుంటావు. అపార సుఖాలు పొందుతావు" అని ప్రకటిస్తారు. ఇదంతా అచంచలమైన విశ్వాసం కలిగి, సత్కర్మలు చేసిన వారి మీద దైవం చూపించే కృప.

• మహమ్మద్ వహీదుద్దీన్

epaper.andhrajyothy.com


LACHHURAM PRODUCTIONS
SARASWATI DEVELOPERS
PRESENTS
మంగ్లీ
నటించిన తొలి చిత్రం
నేడే
విడుదల
SAVE THE GIRLS
&
SAVE THE TREES
MANGLI
IN & AS
స్వేచ్ఛ
Producer : Amgoth Raju Nayak Director : K.P.N. Chowhan
Music : Bhole DOP: Vijay Tagoor


SRI SHAKTY SWAROOP MOVIE CREATIONS
నేడే
విడుదల
BEST THILLER
IN THE TOWN
SUBBU VEDULA
రాహు
RAAHU
A.V.R SWAMY M.SC (AG) RAJA DEVARAKONDA SRI SHAKTHI BABJI SUBBU VEDULA
SRINIVASARAO BETHAPUDI SURESH RAGUTU ESHWAR YELLUMAHANTHI LAKKARAJU
NABA & ROBIN SUBBU GSK MEDIA AMAR REDDY
WRONG TIME. WRONG PLACE. WRONG GIRL.


WALL POSTER CINEMA
NANI PRESENTS
నేడే
విడుదల
VISHWAK SEN IN
HIT
THE FIRST CASE
PRODUCED BY PRASHANTI TIPIRNENI
WRITTEN & DIRECTED BY Dr SAILESH KOLANU
DOP S MANIKANDAN MUSIC DIRECTOR VIVEK SAGAR
ART DIRECTOR AVINASH KOLLA EDITOR GARRY BH
EXECUTIVE PRODUCER S VENKATARATHNAM (VENKAT)
SOUND DESIGN SYNC CINEMA STUNTS NABA
PUBLICITY DESIGNERS ANIL & BHANU PRO VAMSI KAKA
#HITMOVIE SONY MUSIC U/A


THANKS MEET TOMORROW
AT GURAJADA KALAKSHETRAM,
VUDA COMPLEX, SIRIPURAM, VIZAG
CHIEF GUEST
'MEGA PRINCE' VARUN TEJ GARU
HAAWSOME BLOCKBUSTER
50 CRORES GROSS
WORLDWIDE
2ND WEEK
PDV PRASAD PRESENTS
SITHARA ENTERTAINMENTS
భీష్మ
SINGLE FOREVER
SURYADEVARA NAGA VAMSI VENKY KUDUMULA
SAI SRIRAM MAHATI SWARA SAGAR NAVIN NOOLI
SAHI SURESH VENKAT S.VENKATARATHNAM (VENKAT)
U
ADITYA MUSIC













## ప్రభాస్‌తో వైజయంతీ భారీ చిత్రం

ప్రభాస్ తన అభిమానులకు సర్‌ప్రైజ్ ఇచ్చారు. 'మహానటి' ఫేం నాగ్ అశ్విన్ దర్శకత్వంలో ఆయన ఓ సినిమా చేయబోతున్నారు. వైజయంతీ మూవీస్ పతాకంపై సి.అశ్వినీదత్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. వైజయంతీ సంస్థ ట్విట్టర్ వేదికగా ఈ విషయాన్ని ప్రకటించి, ఓ వీడియో విడుదల చేసింది. త్వరలో వైజయంతీ సంస్థ 50వ వసంతంలోకి అడుగుపెడుతున్న నేపథ్యంలో ప్రభాస్‌తో సినిమా చేయడం గర్వంగా ఉందని ఆ వీడియో ద్వారా తెలిపారు. "కథ నచ్చి ప్రభాస్ ఈ చిత్రం అంగీకరించారని, కొత్త జానర్ లైన్‌తో ప్రభాస్‌ను నాగ్ అశ్విన్ సరికొత్తగా చూపించబోతున్నారనీ చిత్రవర్గాలు చెబుతున్నాయి. ఈ సినిమా షూటింగ్‌కు సంబంధించి దర్శకుడు నాగ్ అశ్విన్ సోషల్ మీడియాలో ఓ పోస్ట్ పెట్టారు. ఈ ఏడాది డిసెంబర్‌లో షూటింగ్ ప్రారంభమవుతుందని అందులో తెలిపారు. 2021 చివర్లో సినిమా విడుదలయ్యే అవకాశాలున్నాయని ఆయన పేర్కొన్నారు. రాధాకృష్ణ దర్శకత్వంలో ప్రభాస్ ఓ చిత్రంలో నటిస్తున్న సంగతి తెలిసిందే.


ప్రభాస్, అశ్వినీదత్, నాగ్ అశ్విన్

## మాకు ఆ ఒత్తిడి లేదు!

- నాని


విష్వక్ సేన్, రుహానీ శర్మ, నాని

"సినిమా విడుదల దగ్గర పడినప్పుడు 'ప్రేక్షకులకు నచ్చుతుందా? నచ్చదా?' అని కొన్నిసార్లు ఒక ఒత్తిడి ఉంటుంది. మాకు ఆ ఒత్తిడి లేదు. ఈ 'హిట్' ప్రేక్షకులకు నచ్చుతుందని కాన్ఫిడెంట్‌గా ఉన్నాం. ఏ స్థాయిలో నచ్చుతుందనేది శుక్రవారం చూడాలి" అన్నారు నాని. ఆయన సమర్పణలో ప్రశాంతి నిర్మించిన సినిమా 'హిట్'. విష్వక్ సేన్, రుహానీ శర్మ జంటగా నటించారు. శైలేష్ కొలను దర్శకత్వం వహించారు. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతున్న సందర్భంగా గురువారం చిత్రబృందం మీడియాతో ముచ్చటించింది. "మా టీమ్‌కి 'హిట్' నచ్చింది. అయితే, ప్రేక్షకులకు నచ్చడం ముఖ్యం. వాళ్లు 'హిట్'ను హిట్ చేయడం ముఖ్యం" అని ప్రశాంతి అన్నారు. "నిజాయతీగా ఒక థ్రిల్లర్ సినిమా చేశాం. ప్రేక్షకులకు తప్పకుండా నచ్చుతుందని భరోసా ఇవ్వగలను" అని శైలేష్ కొలను అన్నారు. "నేను చాలా హ్యాపీగా, ఎగ్జైటెడ్‌గా ప్రేక్షకుల స్పందన కోసం ఎదురు చూస్తున్నా" అని రుహానీ శర్మ అన్నారు. విష్వక్ సేన్ "మంచి సినిమా. మరో నిర్మాత అయితే ఇలా తీయలేరేమో" అన్నారు. ఈ సమావేశంలో దిల్‌రాజు "నీలాంటి హీరోలు సంవత్సరానికి మూడు సినిమాలు చేస్తూ కూడా, సినిమాలు నిర్మిస్తే మాలాంటి నిర్మాతల పరిస్థితి ఏమిటి?" అని నానిని ప్రశ్నించారు. "మళ్లీ ఆ సినిమాలను కూడా తెచ్చి మీ చేతుల్లోనే పెడుతున్నాం కదా సర్" అని చమత్కరించారు నాని. "నిర్మాతగా ప్రేక్షకులకు, విమర్శకులకు ఒక విజ్ఞప్తి చేస్తున్నా... సినిమాలో ట్విస్టులను రివీల్ చేయవద్దు. ఇది థ్రిల్లర్ జానర్ కదా!" అని కోరారు.

## ప్రతి మహిళా చూడాల్సిన సినిమా

- మంగ్లీ



"గతంలో సినిమా బాగుంటే వంద రోజులు ఆడేది. ఇప్పుడు వారంరోజులు ఆడితే పెద్ద విజయంగా లెక్కేస్తున్నారు. మంచి కథలకు ఎప్పుడూ ప్రేక్షకాదరణ ఉంటుంది. 'స్వేచ్ఛ' అలాంటి సినిమా అవుతుందని నమ్ముతున్నా" అని టీఆర్ఎస్ నేత తీగల కృష్ణారెడ్డి అన్నారు. మంగ్లీ కథానాయికగా నటించిన 'స్వేచ్ఛ' చిత్రం ట్రైలర్‌ను బుధవారం ఆయన ప్రసాద్ ప్రివ్యూ థియేటర్‌లో విడుదల చేశారు. కె.పి.ఎన్.చౌహాన్ నటించి, స్వీయ దర్శకత్వంలో రూపొందించిన చిత్రమిది. చమ్మక్ చంద్ర కీలక పాత్రధారి. బంజారా భాషలో విడుదలై విజయవంతమైన 'గోర్ జీవన్'కు అనువాదమిది. ఆంగోత్ రాజునాయక్ ఈ నెల 28న తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. దర్శకుడు మాట్లాడుతూ "విశ్వాన్ని కాపాడుకోవడానికి చెట్లు పెంచడం ఎంత ముఖ్యమో.. సృష్టిని రక్షించుకోవడానికి ఆడవాళ్లు అంతే ముఖ్యమని చెప్పే చిత్రమిది" అని అన్నారు. "నేటి సమాజానికి ఉపయోగపడే కథాంశంతో రూపొందిన సినిమా ఇది. ఇందులో చక్కని పాత్ర పోషించా. ఆడవాళ్లందరూ తప్పక చూడాలి" అని మంగ్లీ అన్నారు.



## నేను చేయబోయేది ప్రభాస్ సినిమా కాదు!

- దుల్కర్ సల్మాన్

**"తెలుగు, తమిళం, మలయాళం, హిందీ... నేను ఎక్కడికి వెళ్లినా 'సినిమా, సినిమాకూ మధ్య ఎక్కువ విరామం తీసుకుంటున్నారెందుకు?' అని ప్రశ్నిస్తారు. వివిధ భాషల్లో చిత్రాలు చేస్తుండడం వల్ల సినిమాల మధ్య ఎక్కువ విరామం తీసుకుంటున్నట్టు కనిపిస్తుందంతే! అయితే, మా నాన్న (మమ్ముట్టి) సహా చాలామంది మలయాళ హీరోలు ఏడాదికి నాలుగైదు చిత్రాలు చేస్తున్నారు. వాళ్లతో పోలిస్తే... నా చిత్రాల సంఖ్య తక్కువే" అని దుల్కర్ సల్మాన్ అన్నారు. ఆయన హీరోగా నటించిన తమిళ అనువాద చిత్రం 'కనులు కనులను దోచాయంటే'. రీతూ వర్మ హీరోయిన్. శుక్రవారం సినిమా విడుదలవుతోంది. దుల్కర్ సల్మాన్ చెప్పిన ముచ్చట్లు...**

- 'కనులు కనులను దోచాయంటే' రొమాంటిక్ ఎంటర్‌టైనర్. కథనం వేగంగా సాగుతూ... సన్నివేశాలు ఉత్కంఠకు గురి చేస్తాయి. నటుడిగా నన్ను కొత్తగా ఆవిష్కరించే చిత్రమిది. తమిళంలో సినిమా తీశాం. తెలుగు ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్టు కథ, కథనం ఉండడంతో అనువదించి విడుదల చేస్తున్నాం. తెలుగులో నా పాత్రకు నేనే స్వయంగా డబ్బింగ్ చెప్పా. హైదరాబాదీ అమ్మాయి రీతూ వర్మ మంచి పాత్ర చేసింది. తమిళ డైలాగులు చెప్పడంలో తనకు నేను సహాయం చేశా. సినిమాలో తను రాయల్ ఎన్‌ఫీల్డ్ రైడ్ చేసే సన్నివేశం ఉంటుంది. సెట్‌లో తనకు నేనే డ్రైవింగ్ నేర్పా. మాతో పాటు ప్రధాన పాత్రలు పోషించిన రక్షక్, నిరంజనీ చుట్టూ కథ తిరుగుతుంది. కథలో చాలా మలుపులు ఉంటాయి. అవన్నీ ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి.
- ఇందులో గౌతమ్ మీనన్ విలన్‌గా నటించారు. చాలా స్టయిలిష్‌గా, ఎనర్జీతో చేశారు. ఆయనకు కథ చెప్పడానికి దర్శకుడు ఏడాదిన్నర వెంట పడ్డాడు. సినిమా విడుదల తర్వాత గౌతమ్ మీనన్‌కి నటుడిగా మంచి పేరొస్తుంది. సెట్‌లో ఆయన ఉంటే స్టార్ ఉన్నట్టు ఉండేది.
- ప్రేక్షకుల్లో చాలామంది నన్ను 'ఓకే బంగారం' తరహా రొమాంటిక్ ఎంటర్‌టైనర్స్‌లో చూడడానికి ఇష్టపడుతున్నారు. అయితే... ఒక్క జానర్‌కు పరిమితం కావడం నాకిష్టం లేదు. ఇతర భాషల్లో నేను నటించిన సినిమాలు చూస్తే... ఒక సినిమాతో మరో సినిమాకు పోలిక ఉండదు. వైవిధ్య, వినూత్న కథలతో కూడిన చిత్రాలు చేయాలని ప్రయత్నిస్తా. అందుకని, కథల ఎంపికలో ఆచితూచి వ్యవహరిస్తా. కంటెంట్, క్వాలిటీ సినిమాలు చేయాలి.
- వ్యక్తిగతంగా నేను రీమేకులకు దూరం. చారిత్రక చిత్రాలు నా బాడీ లాంగ్వేజ్‌కి సరిపడవని అనుకుంటున్నా. అందుకని, చేయడం లేదు.
- ఈ ఏడాది ద్వితీయార్థంలో నేనో తెలుగు సినిమా చేయబోతున్నా. అయితే... అది 'మహానటి' ఫేమ్ నాగఅశ్విన్ దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా నటించబోయే సినిమా కాదు. అందులో నాకు క్యారెక్టర్ ఏమీ లేదు. అవకాశం వస్తే... మల్టీస్టారర్స్ చేయడానికి నేను సిద్ధమే.

# అమ్మకానికి 1200 ఎకరాలు

- విశాఖలో భారీ..ఒంగోలులో స్వల్పం
- తయారైన సర్కారీ భూముల జాబితా
- 'బిల్డ్ ఏపీ'కి జిల్లా కలెక్టర్ల నివేదికలు
- ఎన్‌బీసీసీ ఓకే అంటేనే ముందుకు

అమరావతి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూముల అమ్మకాల జాబితా భారీగానే ఉంది. తొలి దశలోనే రాష్ట్రవ్యాప్తంగా 1200 ఎకరాలు అమ్మకానికి వీలైనవంటూ అధికారయంత్రాంగం గుర్తించినట్లు తెలిసింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్ల నుంచి 'బిల్డ్ ఏపీ మిషన్'కు నివేదికలు చేరాయి. నగరాలు, మున్సిపాలిటీలు, పట్టణ ప్రాంతాల్లోని భూములనే ప్రధానంగా ఎంపిక చేసినట్లు తెలిసింది. ఆ భూముల జాబితాను నేషనల్ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ కార్పొరేషన్(ఎన్‌బీసీసీ)కి పంపించనున్నట్లు సమాచారం. జాబితాలోని ప్రతి భూమినీ ఎన్‌బీసీసీ ప్రతినిధులు సందర్శించి, దాన్ని అమ్మాలా? వద్దా? మార్కెట్ పరిస్థితులు ఎలా ఉన్నాయన్నది అంచనా వేయనున్నారు. ఇందుకోసం ఇటీవలే ప్రభుత్వం రాష్ట్ర, జిల్లాస్థాయిల్లో పర్యవేక్షణ, ప్రణాళిక, అమలు కమిటీలను కూడా ఏర్పాటుచేసింది. రాష్ట్రంలో అత్యంత విలువైన ప్రభుత్వ భూములను బహిరంగ వేలంలో అమ్మాలని సర్కారు నిర్ణయించిన సంగతి తెలిసిందే. సర్కారీ భూములను తెగనమ్మే కార్యక్రమానికి 'బిల్డ్ ఏపీ మిషన్' అనే పేరుపెట్టింది. ఇదే విషయమై గత ఏడాదిలో కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ ఎన్‌బీసీసీతో ఒప్పందం కూడా కుదుర్చుకుంది. జిల్లాల వారీగా ప్రభుత్వశాఖల వద్ద ఉన్న ఖాళీ భూములు, అందులో అమ్మకానికి పనికొచ్చే భూముల వివరాలు సమర్పించాలని రెవెన్యూశాఖ నుంచి గత ఏడాది కలెక్టర్లకు ఆదేశాలు వెళ్లాయి. రెండు ప్రొఫార్మాల్లో నివేదికలు పంపించాలంటూ ఆదేశించారు. దీని ఆధారంగా రెవెన్యూ యంత్రాంగం భూములను గుర్తించింది. 32 ప్రభుత్వ శాఖల పరిధిలో భారీగా ఖాళీ భూములు ఉన్నాయని గుర్తించారు. పట్టణాలు, నగరాలు, మున్సిపల్ కేంద్రాల్లో 28 శాఖలకు విలువైన భూములు ఉన్నట్లు తేల్చారు.

### ఎక్కడెక్కడ.. ఎంతెంత..

| ప్రాంతం | సేకరణ |
|---|---|
| విశాఖ | 260 |
| గుంటూరు | 170 |
| రాజమండ్రి | 165 |
| కాకినాడ | 120 |
| అనంతపురం | 120 |
| నెల్లూరు | 110 |
| చిత్తూరు | 80 |
| కర్నూలు | 72 |
| తిరుపతి | 45 |
| విజయవాడ | 35 |
| ఒంగోలు | 23 |
| **మొత్తం** | **1200** |

(ఎకరాల్లో)

విశాఖ, విజయవాడ, శ్రీకాకుళం, విజయనగరం, తిరుపతి, అనంతపురం, కడప, కర్నూలు, చిత్తూరు, రాజమండ్రి, కాకినాడ, ఏలూరు, కడప, జగ్గయ్యపేట, నందిగామ, అనకాపల్లి తదితర ప్రధాన పట్టణాల్లో ఇప్పటిదాకా 1200 ఎకరాల భూమిని గుర్తించినట్లు తెలిసింది. వీటిని ఎన్‌బీసీసీ అధికారుల బృందం పరిశీలించాల్సి ఉంది. అయితే, సర్కారీ భూముల అమ్మకంపై ముందున్నంత జోరు ఇప్పుడు లేదని అధికారవర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం తీవ్ర ఆర్థిక మాంద్యం నడుస్తోందని, రియల్ ఎస్టేట్ రంగం కూడా ఆశించిన స్థాయిలో పురోగతి చూపించడం లేదని ఈ వర్గాలు పేర్కొంటున్నాయి. భారీగా సొమ్ము వస్తుందన్న ఆశతోనే అమ్మకానికి రంగం సిద్ధం చేస్తున్నారు. తీరా టెండర్లు పిలిచిన తర్వాత ఆశించిన స్థాయిలో పోటీ రాకుంటే దాని ప్రభావం తీవ్రంగా ఉంటుందని అధికారవర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆచితూచి స్పందించాలని భావిస్తున్నారు. ఉగాది తర్వాతే దీనిపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని అధికారవర్గాలు చెబుతున్నాయి.

# పేదరోగుల పొట్టగొట్టి...

- డైట్ తినేస్తున్న ప్రభుత్వాస్పత్రి సిబ్బంది
- మందుల స్టాక్ రిజిస్టర్లలో అవకతవకలు
- ఆగిన అంబులెన్స్‌ల నిర్వహణకు లక్షల్లో డ్రా
- రికార్డులకే పరిమితమైన ఆరోగ్య శ్రీ రోగులు
- సమయపాలన పాటించని వైద్యులు, సిబ్బంది
- ప్రభుత్వాస్పత్రుల్లో ఏసీబీ బృందాల తనిఖీలు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వాస్పత్రుల్లో అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) సోదాలు నిర్వహించింది. 13జిల్లాల్లో ఏకకాలంలో 100మందితో గురువారం ఆకస్మిక తనిఖీలు చేపట్టింది. శుక్రవారం కూడా సోదాలు కొనసాగుతాయని ఏసీబీ డీజీ పీఎస్ఆర్ ఆంజనేయులు వెల్లడించారు. గురువారం తనిఖీల్లో తమ అధికారులు గుర్తించిన లోపాలను వివరించారు. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సొంత జిల్లాలోని జంగారెడ్డిగూడెం ఏరియా ఆస్పత్రిలో రోగుల నిధులు పక్కదారి పడుతున్నాయి. రోగులకు మధ్యాహ్నం 12- 1గంట మధ్యలో పెట్టాల్సిన భోజనం 1.30కు అందిస్తున్నారు. భోజనం కాంట్రాక్టర్‌కు లైసెన్స్ లేదని గుర్తించారు. తూర్పుగోదావరి జిల్లా తుని ప్రభుత్వాస్పత్రి ఫార్మసీ విభాగం రిజిస్టర్‌లో స్టాక్ నిల్ అని చూపించినా, నిండుగా ఉంది. విశాఖ జిల్లా అనకాపల్లి ప్రభుత్వాస్పత్రి రికార్డుల్లో 81మంది రోగులు ఉండగా లెక్కిస్తే 72మంది మాత్రమే ఉన్నారు. వారికోసం వండిన ఆహారం సరిపోయేది 27మందికే అని తేలింది. శ్రీకాకుళం జిల్లా పాతపట్నం ప్రభుత్వాస్పత్రి సిబ్బంది రక్తపరీక్షలకు పేదరోగులను ప్రైవేటు ల్యాబ్‌కు పంపుతున్నారని గుర్తించారు. విజయనగరం జిల్లా భోగాపురం పీహెచ్‌సీలో మందుల బిల్లులన్నీ చేతిరాతతోనే ఉన్నాయి. గుడివాడ ఏరియా ఆస్పత్రిలో 13మంది రోగులకు భోజనం పెట్టినట్లు రికార్డుల్లో ఉంది. తమకు ఆహారం ఇవ్వలేదని రోగులు అధికారులకు చెప్పారు. గతేడాది జూలై నుంచి ఇక్కడ అంబులెన్స్ పనిచేయకపోయినా నిర్వహణకు రూ.4.14లక్షలు డ్రా చేశారు. తెనాలి వైద్యవిధాన పరిషత్ జిల్లా వైద్యశాల నుంచి బయటకు కూడా రాలేని అంబులెన్స్‌ను అడ్డుపెట్టుకుని రూ.లక్షల నిధులు డ్రాచేసేశారు. ప్రకాశం జిల్లా కందుకూరులో రిజిస్టర్ ప్రకారం ఇక్కడ ఆరోగ్యశ్రీ రోగులు ఐదుగురున్నారు. కానీ ఆస్పత్రిలో మాత్రం వారి జాడలేదు. నెల్లూరు జిల్లా గూడూరు ఆస్పత్రిలో వైద్యులు డ్రెస్ కోడ్ పాటించడం లేదు. పారిశుధ్యం అధ్వానంగా ఉంది. కడప జిల్లా రాజంపేట ఆస్పత్రిలో అంబులెన్స్ మూడేళ్లుగా పనిచేయడం లేదు. శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రిలో డాక్టర్ లేరు, మందుల నిర్వహణ రిజిస్టర్ లేదు. కొనుగోలు బిల్లులూ లేవు. కర్నూలు జిల్లా నంద్యాల ఆస్పత్రిలో మందుల స్టాకులో తేడా, శానిటేషన్ నిర్వహణ అధ్వానంగా ఉంది. అనంతపురం జిల్లా గుత్తి ప్రభుత్వాస్పత్రిలో వైద్యులు, స్టాఫ్ నర్సులు సివిల్ డ్రెస్సుల్లో విధులకు హాజరయ్యారని, ఐడీ కార్డులు ధరించలేదని గుర్తించారు. మందుల స్టాక్ రిజిస్టర్‌లో అవతకవకలు, ఏడుగురు వైద్యుల్లో ఇద్దరే గుత్తిలో ఉంటున్నారని ఏసీబీ తనిఖీల్లో వెల్లడైంది.


గుడివాడ ఆస్పత్రిలో ఏసీబీ అధికారుల తనిఖీలు

| సెన్సెక్స్ | నిఫ్టీ | బంగారం | వెండి (కిలో) | రూపాయి (ఒక డాలర్‌కు) | ముడి చమురు |
|---|---|---|---|---|---|
| 39,745.66 | 11,633.30 | 42,613 | 47,030 | 71.61 | 51.38 |
| 143.30 | 45.20 | ముంబై 10 గ్రాములు (99.9 శాతం స్వచ్ఛత) 42 | 585 | (4 పైసలు) | |

# 15 వేల మంది జువెలర్లకు ఐటీ నోటీసులు

ముంబై : ప్రధాని నరేంద్ర మోదీ 2016 నవంబరు 8న డీమానిటైజేషన్ ప్రకటించిన వెనువెంటనే కస్టమర్లకు భారీ స్థాయిలో బంగారు ఆభరణాలు విక్రయించిన 12 మందికి పైగా ఆభరణాల వర్తకులకు ఐటీ శాఖ నోటీసులు జారీ చేసింది. ఆ రోజున నెక్లెస్‌లు, ఉంగరాలు వంటి ఆభరణాలతో పాటుగా బంగారం కూడా భారీ పరిమాణంలో విక్రయించినట్టు జైన్ అనే వ్యాపారి ఒకరు చెప్పారు. వాస్తవ ధర కన్నా చాలా ప్రీమియం ధరకు తాను ఒక్క రోజులోనే మొత్తం బంగారం అమ్మేశానని, రెండు నెలల పాటు కష్టపడితే తప్ప రాని ఆదాయం అందుకున్నానని తెలిపారు. మూడు నెలల క్రితం తనకు ఐటీ నోటీసు అందిందని ఆయన చెప్పారు. నల్లధనంతోనే ప్రజలు బంగారం కొన్నారని, అందుకే ఆ రాత్రి తాను ఆర్జించిన ఆదాయం మొత్తం తిరిగి చెల్లించాలని ఆ నోటీసులో ఆదేశించారని జైన్ తెలిపారు. ఆ ఉత్తర్వులపై తాను అప్పీలుకు వెళ్లగా అప్పీలు చేయాలంటే భారతీయ చట్టాల ప్రకారం వివాదంలో చిక్కుకున్న సొమ్ము మొత్తంలో 20 శాతం డిపాజిట్ చేయాల్సి ఉంటుందన్నారు. కాగా, జైన్‌కు అందినట్టుగానే 15 వేల మంది వర్తకులకు కూడా నోటీసులు అందాయని భారతీయ బులియన్, ఆభరణాల వ్యాపారుల సంఘం కార్యదర్శి సురేంద్ర మెహతా చెప్పారు. ఆ రకంగా వ్యాపారులందరి నుంచి ఐటీ అధికారులు కోరుతున్న సొమ్ము సుమారు రూ.50 వేల కోట్లని ఆయన అన్నారు.

## ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



| | | | |
|---|---|---|---|
| 27వ తేదీకి.. | | విజయవాడ | 338 |
| హైదరాబాద్ | 316 | విశాఖపట్నం | 375 |
| 28వ తేదీకి.. | | వరంగల్ | 319 |
| చిత్తూరు | 383 | డజను గుడ్లు రూ. 60 | |
| గోదావరి | 338 | | |

## ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 52 | విజయవాడ | 55 |
| వరంగల్ | 52 | గుంటూరు | 55 |
| మహబూబ్‌నగర్ | 52 | ఒంగోలు | 55 |
| కరీంనగర్ | 52 | చిత్తూరు | 55 |
| కర్నూలు | 52 | నెల్లూరు | 55 |
| విశాఖపట్నం | 50 | అనంతపురం | 56 |
| గోదావరి | 44 | | |

## బులియన్



| బంగారం (10 గ్రాములు) | హైదరాబాద్ | విజయవాడ | విశాఖపట్నం | ప్రొద్దుటూరు | చెన్నై |
|---|---|---|---|---|---|
| 24 క్యారెట్లు | 42,890 | 43,250 | 44,040 | 43,100 | 42,670 |
| క్రితం ముగింపు | 43,050 | 43,100 | 43,890 | 43,100 | 42,840 |
| 22 క్యారెట్లు | 40,850 | 40,000 | 40,510 | 39,910 | 40,640 |
| క్రితం ముగింపు | 41,030 | 39,900 | 40,370 | 39,960 | 40,800 |
| వెండి (కిలో) | 46,900 | 48,700 | 48,400 | 48,300 | 50,900 |
| క్రితం ముగింపు | 47,000 | 49,000 | 48,500 | 48,500 | 51,400 |

## హైదరాబాద్‌లో ప్రావిడెన్స్‌ఇన్నోవేషన్ కేంద్రం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అమెరికా హెల్త్‌కేర్ సిస్టమ్స్, సర్వీసెస్ కంపెనీ ప్రొవిడెన్స్ హైదరాబాద్‌లో గ్లోబల్ ఇన్నోవేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. బిగ్ డేటా, కృత్రిమ మేధ (ఏఐ), మెషిన్‌లెర్నింగ్, ఒరకిల్ క్లౌడ్, మైక్రోసాఫ్ట్ అజూరే వంటి డిజిటల్ టెక్నాలజీలను వినియోగించి హైదరాబాద్ ఇన్నోవేషన్ కేంద్రంలో కొత్త ఉత్పత్తులు, సొల్యూషన్లను అభివృద్ధి చేయనున్నట్లు ప్రొవిడెన్స్ కంట్రీ మేనేజర్ మురళీ కృష్ణ తెలిపారు. ఏడాదిలో 350 మంది సాఫ్ట్‌వేర్ నిపుణులు ఈ కేంద్రంలో పనిచేయగలరని, వచ్చే రెండు, మూడేళ్లలో నిపుణుల సంఖ్యను 2,000 మందికి పెంచుకోవాలని తెలిపారు.

'కరోనా'తో

# ముడి సరుకులకు కొరతే!

### కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్



గువాహటి: చైనాపై కరోనా ప్రభావం దీర్ఘ కాలంపాటు కొనసాగితే దేశీయ పరిశ్రమలకు ముడి సరుకుల కొరత ఏర్పడవచ్చని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. గురువారం గువాహటిలో 'బడ్జెట్ 2020-21'పై ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారత పరిశ్రమలు, ఆర్థిక వ్యవస్థపై కరోనా ప్రభావంపై మంత్రి స్పందిస్తూ.."వచ్చే రెండు నెలల్లో పరిస్థితులు మెరుగుపడకపోతే, ముడి సరుకులకు కొరత ఏర్పడవచ్చు. ఈ సమస్యను పరిష్కరించడంతో పాటు పరిశ్రమలకు అవసరమైన సాయం చేసేందుకు కసరత్తు జరుగుతోంది" అని అన్నారు. దేశంలోని కీలక రంగాలకు అవసరమైన ముడి సరుకులను చైనా నుంచి విమానాల ద్వారా తెప్పించడంతో పాటు అవసరమైతే ఇతర దేశాల నుంచీ సేకరించే ఆలోచనలో ఉన్నామని బుధవారం ఓ కార్యక్రమంలో నిర్మలా సీతారామన్ తెలిపారు. ఆయా డిపార్ట్‌మెంట్ల స్థాయిలో వీటిపై కసరత్తు జరుగుతోందని, ఏ రంగానికి ఎలాంటి సాయం అవసరం అన్న విషయంపై అన్ని డిపార్ట్‌మెంట్లతో సమీక్ష జరుపుతామని మంత్రి అన్నారు.

**ఇన్వెస్టర్లపై ప్రభావం లేదు..**

సీఏఏను వ్యతిరేకిస్తూ ఆయా నగరాల్లో జరుగుతున్న ర్యాలీలు, ఢిల్లీ జరుగుతున్న హింసాకాండతో ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌పై ఎలాంటి ప్రభావం ఉండదని ఆర్థిక మంత్రి అన్నారు. ఈ మధ్య సౌదీ అరేబియాలో పర్యటించిన సందర్భంగా తాను పలువురు ఇన్వెస్టర్లతో భేటీ కావడం జరిగిందని, భారత్‌లో పెట్టుబడులు పెట్టేందుకు వారు ఆసక్తి కనబర్చారని అన్నారు.

### 'తయారీ'కి తంటాలే..

చైనాతోపాటు ప్రపంచ దేశాలను గడగడలాడిస్తున్న కోవిడ్-19 వైరస్ భారత ఆర్థిక పునరుద్ధరణకు అడ్డంకిగా మారవచ్చని డన్ అండ్ బ్రాడ్‌స్ట్రీట్ హెచ్చరించింది. చైనా దిగుమతులపై ఆధారపడి ఉన్న కంపెనీలకు సరఫరా అవాంతరాలు ఎదుర్కోవాల్సి రావచ్చని, ఈ పరిణామంతో వస్తు ధరలు ఎగబాకవచ్చని అంటోంది. వైరస్‌ను అదుపులోకి తేవడం జాప్యమై, చైనా నుంచి సరఫరా మళ్లీ సాధారణ స్థితికి చేరుకోని పక్షంలో భారత తయారీ రంగానికి చెందిన చాలా కంపెనీల్లో ఉత్పత్తి నిలిచిపోవచ్చని తాజా నివేదికలో పేర్కొంది.

### మైక్రోసాఫ్ట్ రాబడికీ గండి

కరోనా వైరస్ తమ ఆదాయంపైనా ప్రభావం చూపుతోందని ప్రపంచ టెక్నాలజీ దిగ్గజం మైక్రోసాఫ్ట్ అంటోంది. కరోనా దెబ్బకు విండోస్ సాఫ్ట్‌వేర్, సర్ఫేస్ డివైజ్‌ల విక్రయాలు తగ్గేట్టున్నాయన్న మైక్రోసాఫ్ట్.. ప్రస్తుత త్రైమాసిక ఆదాయ అంచనాల్లో కోత పెట్టింది.

### ప్రపంచ జీడీపీ 0.3% డౌన్

చైనాలో కరోనా వైరస్ విజృంభణతో ప్రపంచ జీడీపీ వృద్ధికి 0.3 శాతం లేదా 25,000 కోట్ల డాలర్ల మేర గండి పడవచ్చని దేశీయ పారిశ్రామిక మండలి 'పీహెచ్‌డీసీసీఐ' అంటోంది. కరోనా ప్రభావంతో కేవలం చైనా ఎగుమతులే కాకుండా ఇతర దేశాల ఎగుమతులూ క్షీణించే ప్రమాదం ఉందని పీహెచ్‌డీసీసీఐ ప్రెసిడెంట్ డీకే అగర్వాల్ అన్నారు. వస్తు ఎగుమతుల కోసం అవసరమైన ముడి సరుకులు, ఇతర ఉత్పత్తుల కోసం ప్రపంచంలోని పలు కంపెనీలు ప్రధానంగా చైనాపైనే ఆధారపడుతుండటం ఇందుకు కారణమన్నారు.

## హీరో బీఎస్-6 సూపర్ స్ప్లెండర్

న్యూఢిల్లీ: టూవీలర్ల మార్కెట్ దిగ్గజం హీరో మోటోకార్ప్ గురువారంనాడు సూపర్ స్ప్లెండర్ బీఎస్-6 వెర్షన్‌ను విడుదల చేసింది. దీని ప్రారంభ ధర రూ.67,300 (ఢిల్లీ ఎక్స్‌షోరూమ్). 125 సీసీ ఇంజన్ కలిగిన ఈ బైక్ రెండు వేరియంట్ల (సెల్ఫ్ స్టార్ట్, డ్రమ్ బ్రేక్ విత్ అలాయ్ వీల్స్)లో లభిస్తుంది. కాగా, అన్ని బీఎస్-4 వాహనాల ఉత్పత్తిని నిలిపివేసినట్లు కంపెనీ తెలిపింది. ఇప్పటికే బీఎస్-6 ఎక్స్‌ట్రీమ్ 160ఆర్, ప్యాషన్ ప్రో, గ్లామర్ మోడళ్లను మార్కెట్లోకి తెచ్చింది.



## యునికార్న్‌లో బీఎస్-6 వెర్షన్

**ప్రారంభ ధర రూ.93,593**

న్యూఢిల్లీ: హోండా మోటార్‌సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా (హెచ్ఎంఎస్ఐ) బీఎస్-6 ప్రమాణాలతో కూడిన యునికార్న్ బైక్‌ను మార్కెట్లోకి తీసుకువచ్చింది. దీని ప్రారంభ ధర రూ.93,593గా ఉంది. 160సీసీ ఇంజన్ కలిగిన ఈ బైక్ మంచి పనితీరును కలిగి ఉండటమే కాకుండా ఎక్కువ ఇంధన సామర్థ్యం కలిగి ఉన్నట్టు కంపెనీ తెలిపింది.



## స్కోడా ఆక్టావియా లిమిటెడ్ ఎడిషన్

**ధర రూ.35.99 లక్షలు**

న్యూఢిల్లీ: స్కోడా ఆటో ఇండియా తన ఆక్టావియా మోడల్‌లో లిమిటెడ్ ఎడిషన్ 'ఆక్టావియా ఆర్ఎస్ 245'ను గురువారంనాడు విడుదల చేసింది. దీని ధర రూ.35.99 లక్షలు (ఎక్స్‌షోరూమ్). మార్చి 1వ తేదీ నుంచి దీనికి ఆన్‌లైన్ బుకింగ్స్‌ను కంపెనీ ప్రారంభించనుంది. రూ.లక్ష చెల్లించి బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. కేవలం 200 కార్లను మాత్రమే విక్రయించనున్నట్టు కంపెనీ తెలిపింది.



# కాల్స్, డేటాకు కనీస చార్జీ!

- ఒక జీబీ డేటాకు రూ.35.. నెలకు కనీస కనెక్షన్‌కు రూ.50 ఉండాలి
- ప్రభుత్వానికి వొడాఫోన్ ఐడియా లేఖ



న్యూఢిల్లీ : తమ ఆర్థిక కష్టాలను వినియోగదారులపైకి నెట్టేందుకు టెలికాం కంపెనీలు ప్రయత్నిస్తున్నాయి. ఈ సంవత్సరం ఏప్రిల్ 1 నుంచి డేటా, ఔట్ గోయింగ్ కాల్స్‌కు కనీస చార్జీలు నిర్ణయిస్తే తప్ప.. మనుగడ కష్టమని వొడాఫోన్ ఐడియా స్పష్టం చేసింది. ఇందుకోసం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతూ టెలికాం శాఖకు ఒక లేఖ రాసింది. ప్రభుత్వం ఈ విజ్ఞప్తికి అంగీకరిస్తే మొబైల్ టెలికాం సేవల వినియోగదారుల జేబులకు భారీగా చిల్లుపడనుంది. టెలికాం కంపెనీలకు ప్రాతినిధ్యం వహించే సెల్యులార్ ఆపరేటర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (సీఓఏఐ) కూడా ఇదే డిమాండ్లతో డాట్‌కు లేఖ రాసింది. దీంతో పరిశ్రమను ఆదుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించేందుకు డిజిటల్ కమ్యూనికేషన్ (డీసీసీ) శుక్రవారం సమావేశం కానుందని సమాచారం.

**ఇలా పెంచాలి:** ఏ సేవల చార్జీలను ఎంత మేర పెంచాలో కూడా వొడాఫోన్ ఐడియా తన లేఖలో ప్రభుత్వానికి తెలియజేసింది. ప్రస్తుతం టెలికాం కంపెనీలు ఒక జీబీ డేటాకు సగటున నాలుగైదు రూపాయల చొప్పున వసూలు చేస్తున్నాయి. దీన్ని కనీసం 7 నుంచి 8 రెట్లు పెంచి రూ.35గా నిర్ణయించాలని వొడాఫోన్ ఐడియా కోరింది. ప్రస్తుతం ఉచితంగా ఉన్న ఔట్ గోయింగ్ కాల్స్‌పైనా నిమిషానికి కనీస చార్జీని ఆరు పైసలుగా నిర్ణయించాలని విజ్ఞప్తి చేసింది. నెలవారీ కనీస కనెక్షన్ చార్జీని ఏప్రిల్ 1 నుంచి రూ.50గా నిర్ణయించాలని కోరింది. ఇలా డేటా, కాల్ చార్జీలు పెంచితే తప్ప, ఏజీఆర్ బకాయిలు చెల్లించడం సాధ్యం కాదని వొడాఫోన్ ఐడియా స్పష్టం చేసింది.

## 11660 పైన రికవరీ

**టెక్ వ్యూ**

నిఫ్టీ డౌన్‌ట్రెండ్‌ను కొనసాగిస్తూ ఇంట్రాడేలో 130 పాయింట్ల నష్టంతో కీలక స్థాయి 11600 కన్నా దిగజారింది. రెండో సెషన్‌లో ఆ స్థాయి కన్నా పైన రికవరీ సాధించి చివరికి 45 పాయింట్ల నష్టంతో క్లోజయింది. టెక్నికల్‌గా ఇది మైనర్ రికవరీ మాత్రమే. గత ఐదు రోజుల బలమైన డౌన్‌ట్రెండ్ అనంతరం ఏర్పడిన రికవరీగా దీన్ని భావించాలి. ఈ స్థాయిలో మైనర్ బాటమ్ మద్దతును పొందింది. స్వల్పకాలిక అప్‌ట్రెండ్‌లో ప్రవేశించాలంటే రానున్న కొద్ది రోజుల్లో కన్సాలిడేట్ కావాలి.

**శుక్రవారం స్థాయిలివే...**

**నిరోధం : 11660 మద్దతు : 11580**

◆ రికవరీ బాట పడితే పాజిటివ్ ధోరణిని కొనసాగించడానికి ఇంట్రాడే నిరోధం 11660 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన నిరోధం 11720. ట్రెండ్‌లో సానుకూలత కోసం మద్దతు స్థాయి 11600 కన్నా పైన మరొక రోజు బలంగా క్లోజ్ కావాలి.

◆ మైనర్ మద్దతు స్థాయి 11580 కన్నా దిగజారితే మరింత బలహీనపడుతుంది. ప్రధాన మద్దతు స్థాయి 11500. సాధారణ స్థితిలో తక్షణ డౌన్‌ట్రెండ్‌కు ఆస్కారం లేదు.

■ వి.సుందర్ రాజా

## సాధారణ నిస్తేజం

**ఆస్ట్రో వ్యూ**

**తిథి :** ఫాల్గుణ శుక్ల పంచమి

**నక్షత్రం :** రేవతి

**అప్రమత్తం:** పునర్వసు, విశాఖ, పూర్వాభాద్ర నక్షత్ర జాతకులు, వృషభ, కన్యా రాశుల వారు అప్రమత్తంగా ఉండాలి.

**ట్రెండ్ మార్పు వేళలు : 2.35**

**ధోరణి :** నిఫ్టీ ఫ్యూచర్స్ 3.05 వరకు నిస్తేజంగా ట్రేడ్ కావచ్చు. ఆ తర్వాత చివరి వరకు మెరుగ్గా ట్రేడయ్యే ఆస్కారం ఉంది.

**ట్రేడింగ్ వ్యూహం :** నిఫ్టీ ఫ్యూచర్స్ 10 గంటల సమయానికి ప్రారంభ స్థాయి/సగటు (ఎటిపి) కన్నా దిగువన ట్రేడవుతుంటే తగు స్టాప్‌లాస్‌తో షార్ట్ పొజిషన్లు తీసుకుని 3 గంటల సమయానికి క్లోజ్ చేసుకోవాలి. 3.05 తర్వాత ఎటిపి కన్నా పైకి వస్తే లాంగ్ పొజిషన్లు తీసుకుని ముగింపు సమయానికి క్లోజ్ చేసుకోవచ్చు.

**నిరోధం: 11675, 11710 మద్దతు స్థాయిలు: 11600, 11560**

ఇంట్రాడే ట్రేడింగ్‌కు ప్రారంభ స్థాయి కీలకం. అంతకన్నా దిగువన మాత్రమే షార్ట్ పొజిషన్లు శ్రేయస్కరం.

**గమనిక :** ఇది పూర్తిగా ఆస్ట్రోటెక్నికల్ అంశాల ఆధారంగా ఇచ్చిన సూచన. మార్కెట్ వాస్తవిక కదలికల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి.

■ డా.భువనగిరి అమరనాథశాస్త్రి
www.thefinancialastrologer.blogspot.in



జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు రాములుకు ఫిర్యాదు అందజేస్తున్న అమరావతి దళిత జేఏసీ సభ్యులు

## జగన్ మెప్పు కోసమే అట్రాసిటీ కేసులు

- జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు అమరావతి దళిత జేఏసీ ఫిర్యాదు
- న్యాయం చేస్తామని కమిషన్ సభ్యుడు రాములు హామీ

తుళ్లూరు, హైదరాబాద్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): అమరావతినే రాజధానిగా కొనసాగించాలని తాము చేస్తున్న ఆందోళనకు మద్దతు ఇస్తున్న వారిపై బాపట్ల ఎంపీ నందిగం సురేశ్ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయిస్తున్నారని రాజధాని దళిత జేఏసీ నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా చేయడం వల్ల ఉద్యమాన్ని నీరుగార్చవచ్చని ఆయనతోపాటు వైసీపీ ఎమ్మెల్యే శ్రీదేవి కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. సీఎం జగన్ మెప్పు కోసమే ఇలా కేసులు పెట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం హైదరాబాద్‌లోని దిల్‌కుషా ప్రభుత్వ అతిథిగృహంలో జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు రాములును అమరావతి దళిత జేఏసీ నేతలు కలిసి ఫిర్యాదు చేశారు. అమరావతిలో ఆందోళన సందర్భంగా సురేశ్, శ్రీదేవి తదితర వైసీపీ నేతలు ప్రవర్తించిన తీరుకు సంబంధించిన వీడియోలను రాములుకు చూపించారు. అమరావతి గ్రామాల్లో పర్యటించి దళితులతో మాట్లాడాలని, కేసులపై దృష్టి సారించాలని కోరారు. కాగా, వచ్చే నెలలో తాను విజయవాడకు వస్తానని వారికి రాములు హామీ ఇచ్చారు. కమిషన్ నేతృత్వంలోని బృందం వచ్చేనెలలో అమరావతి ప్రాంత దళితులతో సమావేశమై అక్కడి పరిస్థితులను స్వయంగా తెలుసుకుంటుందన్నారు. రాములను కలిసిన వారిలో ప్రొఫెసర్ కె.శ్రీనివాస్, గడ్డం మార్టిన్ లూథర్, బసవయ్య, బాబు తదితరులున్నారు. అనంతరం దళిత జేఏసీ నాయకులు విలేకరులతో మాట్లాడుతూ అమరావతిని తరలిస్తే ఎక్కువగా నష్టపోయేది దళితులేనని, ఇప్పటికైనా పద్ధతి మార్చుకోవాలని సురేశ్, శ్రీదేవిలకు హితవు పలికారు.

## కర్నూలు 'హైకోర్టు' ఎంతవరకు వచ్చింది?

- సీఎం జగన్‌ను అడిగిన టీజీ వెంకటేశ్

కర్నూలు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): సీఎం వైఎస్ జగన్‌కు ఓర్వకల్లు విమానాశ్రయంలో బీజేపీ ఎంపీ టీజీ వెంకటేశ్ పుష్పగుచ్ఛం తో స్వాగతం పలికారు. కర్నూలు జిల్లా పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి కుమారుడి వివాహానికి హాజరయ్యేందుకు ముఖ్యమంత్రి గురువారం కర్నూలు వచ్చారు. ఈ క్రమంలో సీఎంను కలిసిన టీజీ హైకోర్టు అంశంపై చర్చించారు. కర్నూలుకు హైకోర్టు ప్రతిపాదన ఎన్నాళ్లుగానో చూస్తున్న అంశమని, త్వరితగతిన పూర్తయితే రాయలసీమ అభివృద్ధికి దోహదపడుతుందని జగన్‌తో అన్నారు. ప్రస్తుతం ఈ అంశం ఏ దశలో ఉందని అడగ్గా.. కేంద్రం అనుమతి కోరామని, నివేదికను కూడా పంపామని జగన్ తెలిపారు. రాయలసీమ డిక్లరేషన్, బీజేపీ ఎన్నికల మేనిఫెస్టోలో కూడా హైకోర్టు అంశముందని టీజీ గుర్తుచేశారు. వైసీపీ, బీజేపీ మధ్య రాజకీయ మైత్రి ఏర్పడనుందన్న వార్తల నేపథ్యంలో వీరి భేటీకి ప్రాధాన్యం ఏర్పడింది. అయితే తాను హైకోర్టు అంశంపైనే కలిశానని, ఇందులో ఎలాంటి రాజకీయ ప్రాముఖ్యత లేదని టీజీ చెప్పారు. ఎన్నికల సమయంలో కలవడం, విడిపోవడం జరుగుతాయని, ప్రస్తుతం ఎన్నికలేవీ లేనందున దీనిపై మాట్లాడదలచుకోలేదని తెలిపారు.

# అరెస్టులతో ఆపలేరు

- ముఖానికి నల్ల కవర్లతో మహిళల నిరసన
- 72వ రోజు కొనసాగిన రైతుల ఆందోళనలు

గుంటూరు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): 'పోలీసు వ్యానుల్లో ఎటుపోతున్నామో తెలియకుండా బిక్కుబిక్కుమంటూ గడిపాం. లాఠీ దెబ్బలు తిన్నాం. ఒక్కొక్కరిపై రెండు, మూడేసి కేసులున్నాయి. భూములు ఇచ్చి న్యాయమడగటమే మేం చేస్తున్న నేరం. అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు. అమరావతి ఏకైక రాజధానిగా ప్రభుత్వ నుంచి స్పష్టమైన ప్రకటన వచ్చేవరకు ఉద్యమం ఆగదు' అని అమరావతి గ్రామాల రైతులు ముక్తకంఠంతో చెబుతున్నారు. మూడు రాజధానుల నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ రైతులు చేపట్టిన ఆందోళనలు గురువారం 72వ రోజుకు చేరాయి. తుళ్లూరు, మందడంలో మహాధర్నాలు కొనసాగించారు. వెలగపూడి, రాయపూడి, కృష్ణాయపాలెం, యర్రబాలెం, గుంటూరు కలెక్టరేట్ ఎదుట, తాడికొండ అడ్డరోడ్డు, పెదపరిమి తదితర ప్రాంతాల్లో రిలే నిరాహార దీక్షలు, నిరసన ప్రదర్శనలు కొనసాగించారు. 'మా ముఖాలు చూడటం ఇష్టం లేదన్నట్లుగా ఎమ్మెల్యేలు, మంత్రులు వ్యవహరిస్తున్నారు. చేతులు జోడించి అడుగుతున్నాం. మా మొర ఆలకించండి' అంటూ రాయపూడికి చెందిన రైతులు, మహిళలు ముఖానికి నల్ల క్యారీబ్యాగ్‌లు తొడుక్కొని నిరసన తెలిపారు. ఎంపీ నందిగం సురేశ్ ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని దుర్వినియోగం చేస్తున్నారని మందడం శిబిరంలో దళిత మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ఒకటో తరగతి చదువుతున్న పఠాన్ నఫీస్ తుళ్లూరు ధర్నా శిబిరంలో 12గంటల నిరాహార దీక్ష చేశాడు. రాజధాని కోసం ధర్నాలు, దీక్షలు చేస్తున్న రైతులు, మహిళలకు మద్దతుగా రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ నేతృత్వంలో మార్చి 1న మందడంలో సంఘీభావ సభ నిర్వహించనున్నట్లు ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. కాగా, అమరావతికి మద్దతుగా మంగళగిరిలో ఈనెల 28, 29 తేదీల్లో 24గంటల నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు సీపీఎం నేతలు పేర్కొన్నారు. సీఎం జగన్‌కు అమరావతి మహిళల బాధ వినిపించడం లేదా అని టీడీపీ నేత వంగవీటి రాధాకృష్ణ ప్రశ్నించారు. రైతులు చేస్తున్న ఆందోళనకు మద్దతు పలికిన ఆయన పెదపరిమి దీక్షాశిబిరంలో రైతులను ఉద్దేశించి ప్రసంగించారు. కాగా, తుళ్లూరు దీక్షాస్థలిలో విజయవాడకు చెందిన యలమంచిలి చిరంజీవి, రమాదేవి దంపతులు జేఏసీ నేతలకు రూ.లక్ష విరాళం అందించారు. రాయపూడి దీక్షాస్థలికి యర్రనేని గోవింద్, రామకృష్ణ 100 ఫైబర్ కుర్చీలు అందజేశారు. యూఎస్ఏలో ఉంటున్న ఎన్నారై కార్తీక్ రూ.50,000, నారాకోడూరు గ్రామస్థులు కూరగాయలను విరాళంగా ఇచ్చారు. ఇదిలాఉండగా, హైకోర్టు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నా రాజధాని రైతులపై అక్రమ కేసులు, వ్యక్తుల నిర్బంధాలు కొనసాగుతూనే ఉన్నాయి. అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో మందడం, తుళ్లూరులో రైతుల ఇళ్ల మీదకొచ్చిన పోలీసులు తమవారి వివరాలు తీసుకున్నట్లు గ్రామస్థులు తెలిపారు.





వెలగపూడి దీక్షా శిబిరంలో సాయిబాబాకి పూజలు చేస్తున్న మహిళలు, ముఖాలకు కవర్లు కప్పుకొని తుళ్లూరులో నిరసన

# 'వన్ సైడ్ గేమ్' కుదరదు!

- రాజధాని కోసం రైతులిచ్చిన భూముల్ని.. ఇళ్ల స్థలాలకు ఎలా ఇస్తారు?
- రాజధానిలో అభివృద్ధే చేపట్టలేదు..
- 5% భూముల్ని ఎలా వినియోగిస్తారు?
- సీఆర్‌డీఏ చట్ట నిబంధనలకు విరుద్ధం
- హైకోర్టు త్రిసభ్య ధర్మాసనం తీవ్ర వ్యాఖ్యలు

అమరావతి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): రాజధాని భూములను ఇళ్ల స్థలాలకివ్వాలన్న ప్రభుత్వ నిర్ణయంపై హైకోర్టు తీవ్రంగా స్పందించింది. రైతులు రాజధాని కోసం ఇచ్చిన భూముల్ని ఇళ్ల స్థలాలకు ఎలా ఇస్తారని నిలదీసింది. ఆ అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఎక్కడిదని ప్రశ్నించింది. 'ఎవరి స్థలమైనా తీసుకుని ఎవరో ఒకరికి ఇచ్చే అధికారం మీకుందా? ప్రభుత్వ భూమినో, సేకరించిన భూమినో ఇళ్ల స్థలాలకిస్తామంటే మాకేమీ అభ్యంతరం లేదు. కానీ సీఆర్‌డీఏ ల్యాండ్ పూలింగ్ స్కీం కింద తీసుకున్న భూముల్ని ఇళ్ల స్థలాలకు ఎలా కేటాయించాలనుకుంటున్నారు? ఇది సీఆర్‌డీఏ చట్ట నిబంధనలకు విరుద్ధమైన నిర్ణయమే కదా? ప్రభుత్వం బాధ్యతల నుంచి దూరంగా తొలగి, వన్‌సైడ్ గేమ్ ఆడతానంటే కుదరదు' అని తేల్చిచెప్పింది. భూ సమీకరణ స్కీం కింద తీసుకున్న భూమిలో అభివృద్ధి పనులు చేపట్టాక 5 శాతం స్థలాన్ని పేద ప్రజల గృహ నిర్మాణ పథకానికి కేటాయించాలని సీఆర్‌డీఏ నిబంధనలు చెబుతున్నాయని గుర్తుచేసింది. అసలక్కడ అభివృద్ధి పనులే చేపట్టకుండా ఆ పేరుతో భూమిని ఇళ్ల స్థలాలకు ఎలా వినియోగిస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. రాజధాని భూములను ఇళ్ల స్థలాలకు కేటాయించడంపై ఎలా సమర్థించుకుంటారో పూర్తి వివరాలతో సోమవారం (2వ తేదీన) కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశించింది. అదేవిధంగా ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం వివరాలను తమ ముందుంచాలని కేంద్రం తరపు సహాయ సొలిసిటర్ జనరల్ (ఏఎస్‌జీ) కృష్ణమోహన్‌ను నిర్దేశించింది. తదుపరి విచారణను వచ్చే నెల 4వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జేకే మహేశ్వరి, న్యాయమూర్తులు జస్టిస్ ఏవీ శేషసాయి, జస్టిస్ ఎం.సత్యనారాయణమూర్తిలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. రాజధాని నిర్మాణం కోసం రైతుల నుంచి సమీకరించిన భూమిలో 'నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు' పథకం కింద గుంటూరు జిల్లా తాడేపల్లి, మంగళగిరి, పెదకాని, దుగ్గిరాల మండలాలు, కృష్ణాజిల్లా విజయవాడ కార్పొరేషన్ పరిధిలోని 1251 ఎకరాల్లో మొత్తం 54,307 మందికి ఇళ్లస్థలాలు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గత 25వ తేదీన జారీ చేసిన జీవో 107ను సవాల్ చేస్తూ ఎ.నందకిశోర్, కె.సాంబశివరావు అనే వ్యక్తులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్లపై గురువారం త్రిసభ్య ధర్మాసనం ముందు విచారణ జరిగింది.

### ఆ అధికారం ప్రభుత్వానికి ఉంది: ఏజీ

రాష్ట్రప్రభుత్వం తరపున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎస్.శ్రీరాం వాదనలు వినిపించారు. 'రాష్ట్రవ్యాప్తంగా 25 లక్షల మంది పేదలకు ఇళ్ల స్థలాలివ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగానే ఇటీవల పిటిషనర్లు చెబుతున్న ప్రాంతంలో ఇళ్ల స్థలాలు కేటాయించింది. సీఆర్‌డీఏ చట్టంలోని సెక్షన్ 53 (1)(డీ) ప్రకారం 5 శాతం భూమిని పేదల ఇళ్లస్థలాలకు ఇవ్వొచ్చు' అని తెలిపారు. ధర్మాసనం జోక్యం చేసుకుంటూ.. ప్రభుత్వ భూములను గుర్తించి ఇళ్ల స్థలాలు ఇస్తే తమకేమీ అభ్యంతరం లేదని పేర్కొంది. రాజధానిలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నప్పుడు 5 శాతం భూమిని ఇళ్ల స్థలాలకు ఇవ్వొచ్చని.. కానీ అసలు అభివృద్ధి పనులే చేపట్టకుండా, ఆ భూమిని ఎలా వినియోగిస్తారని ప్రశ్నించింది. సీఆర్‌డీఏ చట్టంలోని సెక్షన్ 57(2) ప్రకారం భూకేటాయింపు అధికారం ప్రభుత్వానికి ఉందని ఏజీ అన్నారు. 2017లో కూడా పీఎం ఆవాస్ యోజన కింద సీఆర్‌డీఏ పరిధిలోని 10 ప్రాంతాల్లో 5,300 మంది కోసం గృహాలను నిర్మించారని.. అవి లబ్ధిదారులకు అప్పగించేందుకు సిద్ధమయ్యాయని తెలిపారు. ల్యాండ్ పూలింగ్ స్కీం మేరకు అభివృద్ధి పనులు చేపట్టనందున.. ఇళ్ల స్థలాలు కేటాయించరాదని పిటిషనర్లు పేర్కొనడం సరికాదని చెప్పారు. ఈ విషయంలో పిటిషనర్ల వాదనలను తాము అంగీకరించబోమని ధర్మాసనం కూడా తెలిపింది. దీనిపై ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వరాదని, పూర్తి వివరాలతో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేసేందుకు గడువు కావాలని ఏజీ అభ్యర్థించారు. పిటిషనర్ల తరపున న్యాయవాదులు అశోక్‌భాన్, ఇంద్రనీల్ బాబు వాదనలు వినిపించారు. రాజధానిలో ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేపట్టిందని, దీనిని అడ్డుకునేలా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని అభ్యర్థించారు. దీనిపై ధర్మాసనం వివరణ కోరగా.. మార్చి 25కి ముందు పట్టాలు ఇవ్వడం లేదని ఏజీ బదులిచ్చారు. దీంతో ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు అవసరం లేదని ధర్మాసనం అభిప్రాయపడింది.

# అనుమతి ఉన్నా.. సాధారణ ములాఖత్

- గుంటూరు జైలు వద్ద మాజీ మంత్రులకు అవమానం

గుంటూరు, ఫిబ్రవరి 27: మాజీ మంత్రులు దేవినేని ఉమామహేశ్వరరావు, ప్రత్తిపాటి పుల్లారావు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీఎస్ ఆంజనేయులుకు గుంటూరు జిల్లా జైలు వద్ద అవమానం జరిగింది. జేఏసీ నేత, రాజధాని రైతు ఆలూరి వెంకటేశ్వరరావు ప్రస్తుతం జిల్లా జైలులో రిమాండ్‌లో ఉన్నారు. అయితే ఆయనను పరామర్శించేందుకు టీడీపీ నేతలు గురువారం మధ్యాహ్నం జైలు సూపరింటెండెంట్ నుంచి అనుమతి తీసుకున్నారు. తీరా జైలు వద్దకురాగా.. లోపలకు అనుమతి లేదని వారిని సాధారణ ములాఖత్‌కు తీసుకెళ్లారు. సాధారణ ప్రజల మాదిరిగా దూరం నుంచి మాట్లాడుకోవాలని సూచించారు. అయితే గ్రిల్ లోపల ఉన్న వ్యక్తి సరిగా కనిపించే పరిస్థితి లేకపోవడంతో అనుమతించి అవమానిస్తారా అని టీడీపీ నేతలు అధికారులను నిలదీశారు.

### అసెంబ్లీ రద్దుచేసే దమ్ముందా: తులసిరెడ్డి

అమరావతి, విజయవాడ ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): "మొనగాడివైతే మూడు రాజధానులపై తాజాగా ఎన్నికలకు వెళ్లు. శాసనసభను రద్దు చేసే దమ్ముందా! రైతులు రాజధానికి ఇచ్చిన భూములను పేదల ఇళ్ల స్థలాలకు ఇస్తామంటారా?" అని ఏపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తులసిరెడ్డి సీఎం జగన్మోహన్‌రెడ్డిని ప్రశ్నించారు. గురువారం ఆయన విజయవాడ ఆంధ్రరత్న భవన్‌లో మీడియాతో మాట్లాడారు. రాజధాని అంశంలో గత టీడీపీ సర్కారు, ప్రస్తుత జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రజలను తీవ్రంగా వంచించాయన్నారు. ప్రజలను కన్నతండ్రిలా కాపాడాల్సిన సీఎం జగన్.. కసాయిలా మారారని ఆరోపించారు. రాజధాని మార్పు ప్రజల అభిమతం కాదని, అయినా అమరావతిని మార్చాలని జగన్ నిర్ణయం తీసుకున్నారన్నారు. ఢిల్లీ హింసాత్మక ఘటనకు కేంద్ర వైఫల్యమే కారణమని తులసిరెడ్డి మండిపడ్డారు.


నాయుడి మెడను తాడుతో నొక్కుతున్న పోలీసులు

'ఏబీఎన్ ఆంధ్రజ్యోతి'

## కెమెరామన్‌పై దౌర్జన్యం

▸▸ మెడపై తాడేసి నొక్కిన పోలీసులు

విశాఖపట్నం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబు పర్యటనను కవర్ చేసేందుకు విమానాశ్రయానికి వెళ్లిన 'ఏబీఎన్ ఆంధ్రజ్యోతి' కెమెరామన్ లక్ష్మనాయుడుపై పోలీసులు దాడి చేశారు. విమానాశ్రయం ఆవరణలో మాజీ సీఎం చంద్రబాబు బైఠాయించిన దృశ్యాలను తన కెమెరాలో చిత్రీకరించేందుకు నాయుడు యత్నించారు. ఆ సమయంలో ఆయన 'ఏబీఎన్' కెమెరామన్ అని ఎవరో కేక వేయడంతో అక్కడున్న ఈస్ట్ ఏసీపీ కులశేఖర్, భీమిలి సీఐ శ్రీనివాస్, టూటౌన్ ఎస్ఐ నర్సింగరాజు, రామదాసు ఒక్కసారిగా తమ చేతిలో ఉన్న రోప్‌తో నాయుడు మెడను నొక్కేశారు. దీంతో ఆయన కిందపడిపోయారు.

పోలీస్ వాహనంపై

## జేటీ హల్‌చల్


పోలీస్ వాహనంపై ఎక్కిన జేటీ రామారావు

విశాఖపట్నం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): జేటీ రామారావు అనే వ్యక్తి ఉత్తరాంధ్ర పొలిటికల్ జేఏసీ అధ్యక్షుడినని చెప్పుకొంటారు. ఆయన గతంలో శ్రీకాకుళం జిల్లాలో బుగ్గకారులో తిరుగుతూ, విజిలెన్స్ అధికారులమని చెప్పి పాఠశాలల యాజమాన్యాలను బెదిరించి డబ్బులు గుంజడానికి యత్నించి అరెస్టయ్యాడు. గురువారం విశాఖపట్నం విమానాశ్రయంలో పెట్రోల్ సీసా పట్టుకుని, పోలీసు వాహనంపైకి ఎక్కాడు. చంద్రబాబును నగరంలోకి అనుమతిస్తే పెట్రోలు పోసుకుని ఆత్మహత్య చేసుకుంటానంటూ బెదిరింపులకు దిగాడు. అతడి తీరును పోలీసులంతా చూస్తుండిపోయారు తప్ప ఏమీ పట్టించుకోలేదు. ఇప్పుడు సోషల్ మీడియాలో ఇది వైరల్‌గా మారింది. గతంలో అరెస్టయిన ఫొటో, ఇప్పుడు పోలీసు వాహనంపై ఉన్న ఫొటోలను పోస్టుల్లో పెట్టి పోలీసుల తీరుపై ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు.


విమానాశ్రయం ప్రాంగణంలో వైసీపీ శ్రేణుల నిరసనలు


విమానాశ్రయం బయట రోడ్డుపై కూర్చున్న చంద్రబాబు


విమానాశ్రయంలో పోలీసులతో గొడవపడుతున్న దృశ్యం

**వారంతా బయటివాళ్లే..**

విశాఖపట్నం ప్రజలు చాలా మంచివారు.. శాంతస్వభావులు. విమానాశ్రయం వద్ద ఆందోళన చేయడానికి వచ్చినవారు బయటివాళ్లే. ఇక్కడ భూ కబ్జాలు జరిగాయి. వాటి సంగతి విశాఖ ప్రజలే తేలుస్తారు. ఇలాంటి ప్రభుత్వంపై ప్రజలే తిరుగుబాటు చేయాలి

\- చంద్రబాబు

**ప్రభుత్వ, పోలీసుల వైఫల్యం**

'విశాఖ, విజయనగరంలో ప్రజాచైతన్య యాత్రకు అనుమతి అడిగితే మాకు సవాలక్ష ఆంక్షలు పెట్టిన పోలీసులు.. నన్ను అరెస్టు చేసి, ఆందోళన ముసుగులో వచ్చిన వైసీపీ కార్యకర్తలను నియంత్రించలేకపోవడం సిగ్గుచేటు. హుద్‌హుద్ బీభత్సంలో చెల్లాచెదురైన విశాఖ ఎయిర్‌పోర్టును మేమే దగ్గరుండి పునర్నిర్మించాం. ఇప్పుడదే ఎయిర్‌పోర్టు వద్ద నన్ను అడ్డుకోవడం విశాఖ వాసులెవరూ చేయరు. ఇది కచ్చితంగా వైసీపీ అరాచక శక్తుల పనే.. "

\- ట్విట్టర్‌లో చంద్రబాబు ఆగ్రహం

# ఏం చేస్తారయ్యా.. చంపేస్తారా?

▸▸ ఉన్మాది సీఎం కావడం వల్లే ఈ దుర్గతి

▸▸ చంద్రబాబు ఆగ్రహం


చంద్రబాబుకు రక్షణగా బుల్లెట్ ప్రూఫ్ జాకెట్‌ను ఉంచిన భద్రతా సిబ్బంది

విశాఖపట్నం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): 'ఏం చేస్తారయ్యా మీరు? చంపేస్తారా? అయితే షూట్ చేయండి...ఎన్‌కౌంటర్ చేయండి'... అంటూ పోలీసుల తీరుపై టీడీపీ అధినేత చంద్రబాబు తీవ్ర ఆక్రోశం వ్యక్తం చేశారు. గురువారం విశాఖ విమానాశ్రయం వద్ద వైసీపీ శ్రేణుల అడ్డగింతతో సుమారు నాలుగు గంటలపాటు వాహనంలో కూర్చున్న ఆయన.. మధ్యాహ్నం మూడు గంటలకు కిందికి దిగి పార్టీ నేతలతో కలిసి రోడ్డుపై బైఠాయించారు. ఆయన్ను లేపి వెనక్కి పంపే ఉద్దేశంతో పోలీసులు చుట్టుముట్టారు. వారి తీరుపై చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ సమయంలో సహనం నశించిన ఆయన 'చంపేస్తారా... షూట్ చేయండి' అంటూ పోలీసులపై ధ్వజమెత్తారు. గురువారం ఆయన విశాఖ విమానాశ్రయం వెలుపల, ప్రాంగణంలో వివిధ సందర్భాల్లో విలేకరులతో మాట్లాడారు. ముందస్తు అనుమతి తీసుకుని విశాఖపట్నం పర్యటనకు వస్తే.. వైసీపీ శ్రేణులు అడ్డుకోవడంపై మండిపడ్డారు. పోలీసులు తనకు సరైన రక్షణ కల్పించలేకపోయారన్నారు. అరగంట ఆగితే కాన్వాయ్ వెళ్లడానికి క్లియర్ చేస్తామని చెప్పి.. మూడు గంటలు దాటినా తనను పర్యటనకు పంపలేకపోయారని ఆక్షేపించారు. పైగా వెనక్కి వెళ్లిపొమ్మన్నారని.. అరెస్టు చేస్తామన్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఒక ఉన్మాది ముఖ్యమంత్రి అయితే రాష్ట్రం పరిస్థితి ఎలా ఉంటుందో ఆంధ్రప్రదేశ్‌ను చూస్తే అర్థమవుతుందన్నారు. 'రాష్ట్రానికి 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా, 11 ఏళ్లు ప్రతిపక్ష నేతగా, 25 ఏళ్లు పార్టీ అధ్యక్షుడిగా పనిచేసిన నన్నే ఇన్ని ఇబ్బందులు పెడితే ఇక సామాన్యుల పరిస్థితి ఏమిటి? జడ్ ప్లస్ కేటగిరీ భద్రత ఉన్న నాపైనే వైసీపీ కార్యకర్తలు కోడిగుడ్లు, టమాటాలతో దాడి చేస్తుంటే పోలీసులు నిలువరించలేకపోయారు. ఇక సామాన్యులకు ఎటువంటి రక్షణ కల్పిస్తారు? నన్ను అక్రమంగా అరెస్టు చేస్తున్నారు. పోలీసుల తీరును ఖండిస్తున్నా. నా రాజకీయం జీవితంలో ఎన్నడూ ఇలాంటి పరిస్థితి చూడలేదు. దీనిపై న్యాయపరంగా ముందుకు వెళ్తాం' అని స్పష్టం చేశారు. నేను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, జగన్ స్వేచ్ఛగా పాదయాత్రలు చేసుకున్నారు. ఆ విషయం మరచిపోకూడదు' అని అన్నారు.

### నా హయాంలో ఇలాగే ఉండేవారా?

ఎయిర్‌పోర్టు నుంచి బయటకు వస్తున్న తనను వైసీపీ వాళ్లు అడ్డుకుంటే పోలీసులు ఏం చేస్తున్నారని చంద్రబాబు నిలదీశారు. వారి తీరు సరిగా లేదని నగర డీసీపీ-2 ఉదయభాస్కర్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. దాదాపు నాలుగు గంటల వరకూ ఎయిర్‌పోర్టు ఆవరణలోనే ఉండిపోయిన చంద్రబాబును అరెస్టు చేస్తున్నట్లు చెప్పి పోలీసులు వీఐపీ లాంజ్‌లోకి తీసుకువెళ్లారు. దీంతో ఆగ్రహించిన చంద్రబాబు.. డీసీపీ-2తో మాట్లాడారు. 'విశాఖ రావడానికి అన్ని అనుమతులు తీసుకున్నాం.. చివరకు నాకు స్వాగతం పలికేందుకు పరిమితంగా టీడీపీ శ్రేణులను అనుమతిస్తామని చెప్పినా గౌరవించాం. అటువంటిది ఎయిర్‌పోర్టు ఆవరణలోకి వైసీపీ కేడర్‌ను ఎలా అనుమతించారు? నేను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పోలీసులు ఇలాగే పనిచేశారా? జగన్ పాదయాత్రలో శాంతిభద్రతలు చూడాలని ఆదేశాలు వెళ్లాయి తప్ప ఎప్పుడైనా అడ్డుకోవాలని చెప్పామా? విపక్ష నేతగా రాష్ట్రంలో ఏ ప్రాంతానికైనా వెళ్లే అర్హత నాకు లేదా..? ఇలాగైతే ప్రజలకు బాసటగా ఉండేదెవరు' అని ఆగ్రహం వ్యక్తంచేశారు.

## విశాఖలో నాడు-నేడు

▸▸ జగన్‌ను అడ్డుకున్నందుకే ప్రతీకారమా?

▸▸ నాడు పెట్టుబడిదారుల సదస్సు వేళ వైసీపీ 'హోదా' ఆందోళన

▸▸ అనుమతి తీసుకోని స్థానిక నేతలు

▸▸ జగన్‌ను ఎయిర్‌పోర్టు నుంచే పంపించిన పోలీసులు

విశాఖపట్నం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): విశాఖ విమానాశ్రయం నుంచి బయటికి రాకుండా చంద్రబాబును అడ్డుకుని బదులు తీర్చుకున్నారా? నాడు వైఎస్ జగన్‌ను విశాఖ ఎయిర్‌పోర్ట్ నుంచి తిప్పి పంపినందుకు ఇది ప్రతీకారమా? గురువారం విశాఖలో చోటు చేసుకున్న పరిణామాల తర్వాత తలెత్తిన ప్రశ్నలివి. దీంతో... అప్పుడేం జరిగిందనే చర్చ మొదలైంది.

2017 జనవరి 26న ప్రతిపక్ష నాయకుడి హోదాలో జగన్ విశాఖపట్నం వచ్చారు. అప్పుడు విశాఖలో అంతర్జాతీయ పెట్టుబడిదారుల సదస్సు జరుగుతోంది. అదే రోజు వైసీపీ నాయకులు బీచ్ రోడ్డులో 'ప్రత్యేక హోదా' కోరుతూ సాయంత్రం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహణకు పిలుపునిచ్చారు. దానికి ఆ పార్టీ అధినేత జగన్ కూడా వస్తారని ప్రచారం చేశారు. ఇదే క్రమంలో 'జల్లికట్టు తరహా ఉద్యమం' ప్రస్తావన కూడా వచ్చింది. అయితే... వైసీపీ తన నిరసనలకు పోలీసుల అనుమతి తీసుకోలేదు. అసలే గణతంత్ర దినం! పైగా, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా పెట్టుబడిదారుల సదస్సు జరుగుతున్న వేళ! ఈ వేదికకు సమీపంలోనే నిరసన ర్యాలీలు నిర్వహిస్తే ఇబ్బందులు వస్తాయని పోలీసులు అందుకు అనుమతించలేదు. ఆ రోజు విశాఖపట్నం వచ్చిన జగన్‌ను విమానాశ్రయంలోనే అడ్డుకున్నారు. దీంతో, జగన్ వారిపై విరుచుకుపడ్డారు. 'కాబోయే ముఖ్యమంత్రిని అడ్డుకుంటారా? టచ్ చేస్తున్నారు. మీ అంతు చూస్తా!' అని హెచ్చరించారు. అనంతరం రన్‌వేపైనే బైఠాయించారు. ఈ విషయం తెలిసి పోలీస్ అధికారులు స్వయంగా విమానాశ్రయానికి వచ్చి జగన్‌కు నచ్చజెప్పడానికి యత్నించారు. వారిపై కూడా జగన్ కన్నెర్ర చేశారు. మొత్తానికి పోలీసులు జగన్‌ను నగరంలోకి అనుమతించకుండా మరో విమానంలో హైదరాబాద్‌కు పంపించేశారు.

**ఇప్పుడిలా...**

ప్రజా చైతన్య యాత్రకు పోలీసుల అనుమతి తీసుకుని మరీ చంద్రబాబు గురువారం విశాఖ వచ్చారు. కానీ... వైసీపీ నేతలే నిరసనల పేరిట ఆయనను అడ్డుకున్నారు. ఇందుకు పోలీసులు పరోక్షంగా సహకరించారు. చంద్రబాబుకు స్వాగతం పలకడానికి 30 మందికి మించి ఉండకూడదని ఆంక్షలు పెట్టారు. నిరసనకారులను మాత్రం యథేచ్ఛగా అనుమతించారు. ఆందోళనకారులను పక్కకు తప్పించలేక... 'మీ భద్రత దృష్ట్యా మిమ్మల్ని అరెస్టు చేస్తున్నాం' అంటూ చంద్రబాబును ఎయిర్‌పోర్ట్ లాంజ్‌కు తరలించారు.

## బాబు అరెస్టుపై తమ్ముళ్ల నిరసనలు

▸▸ రాష్ట్ర వ్యాప్తంగా రాస్తారోకోలు, అర్ధనగ్న ప్రదర్శనలు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): మాజీ సీఎం చంద్రబాబు విశాఖ పర్యటనను అడ్డుకోవడంపై టీడీపీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశాయి. రాష్ట్రవ్యాప్తంగా నిరసన ప్రదర్శనలకు దిగాయి. అధికారాన్ని, పోలీసులను అడ్డపెట్టుకొని వైసీపీ దాడులకు దిగేందుకు తెగబడిందని టీడీపీ నేతలు ధ్వజమెత్తారు. కర్నూలు జిల్లా కర్నూలు, ఎమ్మిగనూరు, ఆళ్లగడ్డ, డోన్, నంద్యాల తదితర ప్రాంతాల్లో నిరసనలు చోటు చేసుకొన్నాయి. ఆయా ప్రాంతాల్లో సోమిశెట్టి వెంకటేశ్వర్లు, గౌరు చరిత, జయనాగేశ్వరరెడ్డి, అఖిలప్రియ తదతరులు పాల్గొన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో ఎమ్మెల్యే రామానాయుడు రోడ్డుపై పడుకొని నిరసన వ్యక్తం చేశారు. ఏలూరులో మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, దేవరపల్లిలో ముప్పిడి వెంకటేశ్వరరావు రాస్తారోకో చేసి నిరసన తెలిపారు. అనంతపురంలో చంద్రదండు వ్యవస్థాపకుడు ప్రకాశ్ నాయుడు ఆధ్వర్యంలో నల్ల జెండాలతో నిరసన తెలిపారు. గుంటూరు జిల్లా సత్తెనపల్లిలో రాస్తారోకోలో దేవినేని ఉమా, జీవీ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు. కడపలో జరిగిన రాస్తారోకోలో గోవర్ధన్‌రెడ్డి, హరిప్రసాద్ పాల్గొన్నారు. తూర్పుగోదావరి జిల్లా కాకినాడ, ప్రత్తిపాడు, పిఠాపురం, జగ్గంపేట, రాజోలు, కొత్తపేట నియోజకవర్గాలలో ఆందోళనలు జరిగాయి. రాజమహేంద్రవరంలో ధర్నా నిర్వహించి, అర్ధనగ్న ప్రదర్శన చేశారు. విజయవాడ తూర్పు నియోజకవర్గంలో గద్దె రామ్మోహన్‌తోపాటు పలువురు నాయకులను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. జిల్లా కేంద్రం మచిలీపట్నంలో కొల్లు రవీంద్ర నిరసన, జగ్గయ్యపేట మండలం అన్నవరంలో శ్రీరాం రాజగోపాల్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు.

### చంద్రబాబుకు సిగ్గుందా?: తమ్మినేని

▸▸ బాబు అండ్ కో జైలుకెళ్తారు : రోజా

అమదాలవలస రూరల్, శ్రీశైలం, రేగిడి, ఫిబ్రవరి 27: "విశాఖలో పరిపాలన రాజధాని ఏర్పాటును అడ్డుకుంటున్న మాజీ సీఎం చంద్రబాబు ఏ ముఖం పెట్టుకుని ఉత్తరాంధ్రలో పర్యటిస్తారు? అసలు ఆయనకు సిగ్గు ఉందా?" అని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారామ్ ప్రశ్నించారు. గురువారం శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస మండలంలోని ఆయన మాట్లాడారు. చంద్రబాబు తీరును గ్రహించిన ప్రజలు ఆయన విశాఖ పర్యటనను అడ్డుకుంటున్నారని తెలిపారు. అమరావతి రాజధాని కావాలనుకున్న చంద్రబాబు.. అక్కడే ఓట్లు అడుక్కోవాలని సూచించారు. శ్రీశైలంలో ఏపీఐఐసీ చైర్‌పర్సన్ ఆర్కే రోజా మీడియాతో మాట్లాడారు. "ఈ రాష్ట్రాన్ని ఎంత దోచుకున్నారో ఐటీ దాడుల్లో తేలుతుంది. చంద్రబాబు, లోకేశ్, వారి కేబినెట్ మొత్తం జైలుకెళ్లే రోజులు దగ్గరపడ్డాయి" అని అన్నారు. చంద్రబాబు ప్రజాచైతన్య బస్సుయాత్ర ఒట్టి బూటకమని ఉప ముఖ్యమంత్రి పుష్పశ్రీవాణి అన్నారు.

### టీడీపీ నుంచి చంద్రబాబును తరిమికొట్టండి: కొడాలి

గుడివాడ, ఫిబ్రవరి 27: "విశాఖ ప్రజలు చంద్రబాబును తిప్పికొట్టినట్టుగానే టీడీపీ శ్రేణులు పార్టీ నుంచి కూడా ఆయనను తరిమికొట్టాలి. సీఎం జగన్‌ను సమర్థిస్తే టీడీపీకి వచ్చే ఎన్నికలలో కనీసం ప్రతిపక్ష స్థానమైనా మిగులుతుంది. చంద్రబాబు తన వైఖరి మార్చుకోకపోతే కుప్పంలోనూ ఓటమి తప్పదు" అని మంత్రి కొడాలి నాని హెచ్చరించారు. ఉత్తరాంధ్రను తానే అభివృద్ధి చేశానని చెప్పుకునే చంద్రబాబు విశాఖకు రాజధానిగా చేస్తామంటే ఎందుకు అడ్డ పడుతున్నారని ప్రశ్నించారు. రాజధాని వికేంద్రీకరణ బిల్లును సెలక్ట్ కమిటీకి పంపేలా తమ పార్టీ ఎమ్మెల్సీలను పురికొల్పి రాయలసీమ, ఉత్తరాంధ్రలకు అన్యాయం తలపెట్టారని దుయ్యబట్టారు. వయోవృద్ధుడైన చంద్రబాబుకు అల్జీమర్స్ వ్యాధి ముదిరిపోయిందన్నారు.

### ఉత్తరాంధ్రవాసులను రెచ్చగొడుతున్నారు: బొత్స

అమరావతి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): 'చంద్రబాబు తన స్వార్థ రాజకీయాల కోసం ఎంతో ప్రశాంతంగా ఉండే ఉత్తరాంధ్రవాసులను రెచ్చగొడుతున్నారు" అని మంత్రి బొత్స సత్యనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. విశాఖ, విజయనగరం జిల్లాల్లో చంద్రబాబు రెండు శుభకార్యాలయాలకు హాజరుకావాల్సి ఉందన్నారు. వాటికోసం వస్తూ ఉత్తరాంధ్ర పర్యటన అంటూ పార్టీ నేతలతో హంగామా సృష్టించే ప్రయత్నం చేశాడన్నారు. ఉత్తరాంధ్ర ప్రజలపట్ల చులకన భావంతో రెండు రోజులుగా మాట్లాడుతున్న చంద్రబాబు.. హేళనతో కూడిన భాషను వాడారని మండిపడ్డారు. ఈ ప్రాంత ప్రజలను ఉన్మాదులు, పెయిడ్ ఆర్టిస్టులంటూ చంద్రబాబు కించపరిచాడని బొత్స ఆరోపించారు.

# అనుమతి ఇచ్చి.. అడ్డుకున్నారు!

▸▸ చంద్రబాబును ఎయిర్‌పోర్టు నుంచి బయటకు రానివ్వొద్దన్న మంత్రి అవంతి

▸▸ విమానాశ్రయం వద్దే అడ్డుకోవాలన్న వైసీపీ

▸▸ అయినా నివారించని పోలీసులు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)


దాడిలో పగిలిన ఎమ్మెల్యే వెలగపూడి కారు అద్దం

తెలుగుదేశం పార్టీ అధినేత, ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబుకు సరైన రక్షణ, భద్రత కల్పించడంలో విశాఖపట్నం పోలీసులు పూర్తిగా విఫలమయ్యారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆయన పర్యటనను అడ్డుకుంటామని సాక్షాత్తూ మంత్రులే ప్రకటించినా.. వైసీపీ ఎమ్మెల్యేలు, నేతలు మెసేజ్‌ల ద్వారా కార్యకర్తలను విమానాశ్రయానికి తరలించినా.. వారిని అడ్డుకునే ఏర్పాట్లు చేయనేలేదు. వైసీపీ శ్రేణులను విమానాశ్రయం నుంచి వెనక్కి తరలించే ప్రయత్నం కూడా చేయలేకపోయారు. దీనివల్లే గురువారం అక్కడ తీవ్ర ఉద్రిక్తత నెలకొందని ఆరోపణలు వస్తున్నాయి. విశాఖలో చంద్రబాబు పర్యటన గురించి టీడీపీ నేతలు ముందుగానే పోలీసులకు తెలియజేసి అనుమతి కూడా తీసుకున్నారు. పెందుర్తి పర్యటనకు బుధవారం అర్ధరాత్రి 12 గంటలకు షరతులతో అనుమతి ఇచ్చారు. చంద్రబాబును ఎలాగైనా అడ్డుకోవాలని, ఆయన్ను విమానాశ్రయం నుంచి బయటకు రాకుండా చేయాలని జిల్లా మంత్రి అవంతి శ్రీనివాస్ వైసీపీ శ్రేణులకు బుధవారమే పిలుపునిచ్చారు. అదేవిధంగా పెందుర్తి ఎమ్మెల్యే అదీప్ రాజు కూడా పెందుర్తిలో పర్యటనకు భగ్నం కలిగించాలని పార్టీ కార్యకర్తలకు మెసేజ్‌లు పెట్టారు. వైసీపీ తూర్పు నియోజకవర్గ నాయకులు కూడా పెద్ద సంఖ్యలో విమానాశ్రయానికి కార్యకర్తలను తరలించడానికి ప్రణాళిక రూపొందించారు. ఈ విషయాలన్నీ పోలీసులకు ముందుగానే తెలిసినా వారిని నిలువరించే ప్రయత్నం చేయలేదు. పైగా టీడీపీ నాయకులు, కార్యకర్తలను కట్టడి చేయడంపైనే దృష్టిసారించారు.

### టీడీపీ ఎమ్మెల్యేల అడ్డగింత

చంద్రబాబుకు స్వాగతం పలకడానికి టీడీపీ ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, వాసుపల్లి గణేశ్‌కుమార్, అచ్చెన్నాయుడు, మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు తదతరులు విమానాశ్రయానికి రాగా వారిని కూడా మార్గమధ్యంలో అడ్డుకున్నారు. పోలీసు అధికారులతో వాదులాడి వారు ఎలాగోలా ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. ఈ క్రమంలో వెలగపూడి వాహనం అద్దాలను వైసీపీ కార్యకర్తలు ధ్వంసం చేశారు. విమానాశ్రయానికి వస్తున్న టీడీపీ కార్యకర్తలను పోలీసులు ఎక్కడికక్కడ ఆపేశారు. లోపలకు 50 మందికి మించి వెళ్లకూడదంటూ వెనక్కి నెట్టేశారు. అయితే వైసీపీ కార్యకర్తలు వందల సంఖ్యలో తరలి రాగా వారిని అడ్డుకోలేదు సరికదా.. విమానాశ్రయం ప్రాంగణంలోకి అనుమతించారు. చంద్రబాబు ఉదయం 11.40 గంటలకు విమానాశ్రయం నుంచి బయటకు రాగా 'చంద్రబాబూ గో బ్యాక్' అంటూ వైసీపీ నాయకులు, కార్యకర్తలు నినాదాలు చేశారు. కోడిగుడ్లు, టమాటాలు, చెప్పులు విసిరేందుకు యత్నించారు. కాన్వాయ్‌తో విమానాశ్రయం నుంచి బయటకు రావాలని యత్నించగా వైసీపీ నేతలు ఆయన కారుకు అడ్డంగా పడుకున్నారు. ఈ సమయంలో పోలీసులు రంగప్రవేశం చేసి, వారిని తరిమికొట్టాల్సింది పోయి చూస్తుండిపోయారు. వైసీపీ శ్రేణులు ఎంతకూ అక్కడి నుంచి కదలకపోవడంతో చంద్రబాబే కారు దిగి నడుచుకుంటూ బయటకు రావడానికి యత్నించారు. శాంతి భద్రతల సమస్యల తలెత్తుతుందని పోలీసు ఉన్నతాధికారులు అడ్డుకోవడంతో ఆయన తిరిగి కాన్వాయ్ కారులోకి ఎక్కి కూర్చొన్నారు. అలా మధ్యాహ్నం 3.30 గంటల వరకు ఆయన్ను కారు దిగకుండా చేశారు. నాలుగు గంటలసేపు వైసీపీ కార్యకర్తలు వీరంగం వేస్తుంటే పోలీసులు ఏమీ చేయలేదు. చివరకు చంద్రబాబునే వెనక్కి వెళ్లిపోవాలని కోరడం ప్రారంభించారు. దానికి ఆయన నిరాకరించారు. కారు దిగి రోడ్డుపై బైఠాయించారు. కొద్దిసేపు వేచి చూసిన పోలీసు అధికారులు.. అక్కడి నుంచి తరలించే ప్రయత్నం చేశారు. దీనిపై చంద్రబాబు అభ్యంతరం తెలిపారు. ఈ క్రమంలో ఎమ్మెల్యేలు వెలగపూడి, వాసుపల్లిలను పోలీసులు అరెస్టు చేసి తీసుకెళ్లిపోయారు. తాను అనుమతి తీసుకున్నాకే పర్యటనకు వచ్చానని, పోలీసులే తనకు సరైన రక్షణ కల్పించలేకపోతున్నారని చంద్రబాబు మండిపడ్డారు. దాంతో వెస్ట్ డివిజన్ ఏసీపీ అప్పటికప్పుడు ఒక తెల్లకాగితంపై నోటీసు రాసి అందించారు. 'మాజీ ముఖ్యమంత్రి అయినందున భద్రతా కారణాల రీత్యా, అనుచరులతో సహా రక్షణ నిమిత్తం సీఆర్‌పీసీ 151 ప్రకారం ముందస్తు అరెస్టు చేస్తున్నాం' అని అందులో పేర్కొన్నారు. దాంతో బాధ్యత గల నాయకుడిగా సహకరిస్తానని చంద్రబాబు చెప్పడంతో 3.50 గంటల ప్రాంతంలో ఆయన్ను, అనుచరులను విమానాశ్రయంలోని వీఐపీ లాంజ్‌లోకి తరలించారు.

**టమాటాలు, గుడ్లతో ఎయిర్‌పోర్టులోకి**

వైసీపీ కార్యకర్తలు విమానాశ్రయం టెర్మినల్ వద్దకు కోడిగుడ్లు, టమాటాలతో చేరుకోవడాన్ని చూస్తే పోలీసులు ఎలా వ్యవహరించారో అర్థమవుతోందని టీడీపీ శ్రేణులు అంటున్నాయి. కొంత మంది కోడిగుడ్లు, టమాటాలను చేతపట్టుకుని చంద్రబాబు కారు కోసం ఎదురుచూస్తూ బహిరంగంగానే తిరుగుతున్నా.. పోలీసులు కనీసం వాటిని లాక్కునే ప్రయత్నం కూడా చేయలేదు. గుర్తుతెలియని వ్యక్తులు చంద్రబాబుపైకి విసిరిన కోడిగుడ్డు గురితప్పి ఒక కానిస్టేబుల్‌కు తగలడంతో అతని షర్టు తడిచిపోయింది. మరికొందరైతే ఏకంగా చెప్పులు విసిరారు. ఒక పక్క చంద్రబాబు కారుకు నిరసనకారులు అడ్డంగా పడుకుంటే వారికి సర్దిచెప్పి పంపించాల్సిన పోలీసులు.. ఆ పని వదిలేసి పక్కన కూర్చుని మాట్లాడుకుంటూ కనిపించారు.

చంద్రబాబును

## అడ్డుకోవడం సరికాదు

▸▸ చిల్లర రాజకీయాలకు స్వస్తి పలకాలి: ఎమ్మెల్సీ మాధవ్



శృంగవరపుకోట రూరల్, ఫిబ్రవరి 27: "విశాఖలో చంద్రబాబును అడ్డుకోవడం.. కోడిగుడ్లు, టమోటాలతో కాన్వాయ్‌పై దాడి చేయడం సరికాదు. అమరావతినే రాజధానిగా కొనసాగించాలి" అని ఎమ్మెల్సీ పీవీఎల్ మాధవ్ అన్నారు. విజయనగరం జిల్లా ఎస్.కోటలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ ప్రభుత్వం విశాఖను వేదికగా చేసుకుని ల్యాండ్‌పూలింగ్ పేరుతో భూదందా చేయాలని చూస్తోందన్నారు. అభివృద్ధి మాని కక్షసాధింపు ధోరణితో ముందుకు వెళ్లడం మంచిది కాదన్నారు. రాష్ట్రం ఆదాయంలో చాలా వెనుకబడిందని, ఇక్కడ పరిస్థితులను చూసి పారిశ్రామికవేత్తలు వెనక్కి వెళ్తున్నారని అన్నారు. చిల్లర రాజకీయాలకు స్వస్తి పలకాలని మాధవ్ హితవు పలికారు.

### చంద్రబాబు అక్రమ అరెస్టు దుర్మార్గం

▸▸ సీపీఐ రామకృష్ణ, సీపీఎం మధు

అమరావతి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రతిపక్ష నేత, టీడీపీ అధినేత చంద్రబాబును విశాఖపట్నం విమానాశ్రయంలో అడ్డుకోవడాన్ని వామపక్ష పార్టీలు ఖండించాయి. ఈ మేరకు సీపీఐ, సీపీఎం నేతలు ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రజల దగ్గరకు వెళ్లి వారి విధానాన్ని తెలియజేసే హక్కు ప్రతి రాజకీయ పార్టీకి ఉంటుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మధు అన్నారు. ప్రభుత్వ విధానాలపై తమ నిరసన తెలియజేయవచ్చునన్నారు. ప్రతిపక్ష నేత పర్యటనను అడ్డుకొని.. వారిపై చెప్పులు, కోడిగుడ్లు, టమాటాలు వేయడాన్ని ఆయన ఖండించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటువంటి అప్రజాస్వామిక చర్యలు వెంటనే విడనాడాలని విజ్ఞప్తి చేశారు. చంద్రబాబును దాదాపు మూడు గంటల పాటు ఎయిర్‌పోర్టు వద్ద నిర్బంధించడం హేయమైన చర్య అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్నారు. నాటకీయ పరిణామాల మధ్య చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేయడం దుర్మార్గమన్నారు. పోలీసులు, రాష్ట్ర మంత్రులు కుమ్మక్కై ఈ డ్రామా నడుపుతున్నారని విమర్శించారు. చంద్రబాబును విశాఖపట్నం ఎయిర్‌పోర్టులో కలిసి పరామర్శించి, సంఘీభావం తెలిపినట్లు రామకృష్ణ తెలిపారు.

# జగన్ ప్రేరేపిత పోలీస్ ఉద్యమమిది

▸▸ తెలుగుదేశం నేతల ఆగ్రహం

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): విశాఖలో చంద్రబాబు పర్యటనను అడ్డుకోవడం, కాన్వాయ్‌పై వైసీపీ శ్రేణుల దాడి, చంద్రబాబుతో సహా పలువురు నేతలను పోలీసులు అరెస్టు చేయడంపై టీడీపీ నేతలు మండిపడ్డారు. విశాఖలో తమ భూ కబ్జాలు వెలుగులోకి వస్తాయన్న భయంతోనే వైసీపీ ఈ దుర్మార్గానికి ఒడిగట్టిందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. "ప్రజాస్వామ్యాన్ని ఫ్యాక్షన్ రాజ్యంగా చేస్తారా? మీ అరాచకాల కోసం పోలీసు వ్యవస్థను నిర్వీర్యం చేస్తారా?" అంటూ మండలిలో ప్రధాన ప్రతిపక్ష నేత యనమల ప్రశ్నించారు. చంద్రబాబుని విశాఖ వాసులు అడ్డుకుంటారంటే ఎవరూ నమ్మరని టీడీఎల్పీ ఉపనేత అచ్చెన్నాయుడు అన్నారు. ప్రజాచైతన్య యాత్ర ప్రారంభంనుంచీ ప్రజల్లో వస్తున్న స్పందన చూసి వైసీపీ నేతల వెన్నులో వణుకొచ్చి చంద్రబాబును అడ్డుకున్నారని మాజీ ఉపముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి అన్నారు. వైసీపీ ప్రభుత్వాన్ని వెంటనే డిస్మిస్ చేయాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కమిడి కళా వెంకట్రావు డిమాండ్ చేశారు. విశాఖవాసులు చంద్రబాబుకు బ్రహ్మరథం పడతారనే పులివెందుల ఫ్యాక్షన్ సంస్కృతిని చంద్రబాబు పర్యటనలో వైసీపీ నేతలు ప్రదర్శించారని మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. చంద్రబాబు పర్యటనను అడ్డుకోవడం అంటే జగన్ అంతం ప్రారంభమైనట్లేనని మాజీ మంత్రి కాల్వ ఆగ్రహం వ్యక్తం చేశారు. పులివెందుల రాజకీయాన్ని మానుకోకపోతే జగన్ తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందని మాజీ హోంమంత్రి చినరాజప్ప హెచ్చరించారు. ప్రతిపక్ష నేతపై దాడి చేయమని స్వయంగా మంత్రులు వారి ఎమ్మెల్యేలను ఎయిర్‌పోర్టుకు పంపడం దారుణమని మాజీ మంత్రి అమరనాథరెడ్డి విమర్శించారు. "పులివెందుల నుంచి 300 మంది రౌడీలను తీసుకువచ్చి చంద్రబాబు పర్యటనను అడ్డుకోవడం వెనుక మంత్రులు, ఎమ్మెల్యేలు, పోలీసుల పాత్ర ఉంది" అని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ మండిపడ్డారు. ప్రజా సమస్యల పరిష్కారానికి జిల్లాల్లో పర్యటిస్తున్న ప్రతిపక్షనేతను కక్షపూరితంగా అడ్డుకోవడం, అరెస్టు చేయడం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు పూసపాటి అశోక్‌గజపతిరాజు అన్నారు. ప్రతిపక్ష నేతకు భద్రత కల్పించడంలో విఫలమైన, రౌడీ పాలన చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలని ఎంపీ కనకమేడల రవీంద్ర ఢిల్లీలో డిమాండ్ చేశారు.


రాజమహేంద్రవరంలో అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న టీడీపీ నేతలు


పాలకొల్లులో నిరసన వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే నిమ్మల, ఎమ్మెల్సీ రామ్మోహన్


రాష్ట్రపతికి వినతిపత్రం అందజేస్తున్న సోనియా, మన్మోహన్ తదితరులు

# అమిత్ షాను సాగనంపండి

▸▸ **రాష్ట్రపతికి కాంగ్రెస్ బృందం విజ్ఞప్తి**

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27: ఢిల్లీలో అల్లర్ల సమయంలో తన విధులను విస్మరించిన కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో రాజీనామా చేయించాలని కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీ నేతృత్వంలోని పార్టీ నేతల బృందం రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్‌ను కోరింది. కేంద్ర ప్రభుత్వానికి 'రాజధర్మాన్ని' గుర్తుచేయాలని అభ్యర్థించింది. ఈ మేరకు రాష్ట్రపతికి వినతిపత్రం సమర్పించింది. అనంతరం మీడియాతో సోనియా గాంధీ మాట్లాడారు. ఈశాన్య ఢిల్లీలో హింస చెలరేగినప్పుడు అమిత్ షా ఏమైపోయారని ప్రశ్నించారు. సీఎం అరవింద్ కేజ్రీవాల్ కూడా కనిపించలేదని విమర్శించారు.

## అల్లర్లకు కాంగ్రెస్సే కారణం: జావడేకర్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27: ఢిల్లీలో అల్లర్లకు కాంగ్రెస్సే కారణమని కేంద్ర మంత్రి ప్రకాష్ జావడేకర్ ఆరోపించారు. రెండు నెలల క్రితం కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ పిలుపునిచ్చారని, అప్పటినుంచే అల్లర్లు జరుగుతున్నాయని అన్నారు. ఘర్షణలను నివారించాల్సిన బాధ్యతను మరిచి.. ఆప్ నాయకుడు స్వయంగా దాడుల్లో పాల్గొనడమేంటని ప్రశ్నించారు. శాంతిభద్రతల పునరుద్ధరణకు తగిన చర్యలు తీసుకోవాలని ఆరెస్సెస్ ప్రధాన కార్యదర్శి సురేశ్ భయ్యాజీ జోషి కోరారు. 1984లో సిక్కుల ఊచకోతకు పాల్పడ్డ కాంగ్రెస్‌కు.. అమిత్ షా రాజీనామా చేయాలని డిమాండ్ చేసే నైతికతే లేదని బీజేపీ ఎంపీ ప్రజ్ఞాసింగ్ ఠాకూర్ అన్నారు.

## ఢిల్లీ అల్లర్లలో 48 ఎఫ్ఐఆర్‌ల నమోదు

▸▸ **సోనియా, రాహుల్, అసద్‌పైనా వ్యాజ్యాలు**

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27: ఈశాన్య ఢిల్లీలో హింసాకాండకు సంబంధించి ఇంతవరకు 48 ఎఫ్ఐఆర్‌లను నమోదు చేసినట్లు కేంద్రం ఢిల్లీ హైకోర్టుకు తెలిపింది. రాజధానిలో తిరిగి సాధారణ పరిస్థితులు నెలకొనేదాకా ఈ వ్యవహారాల్లో జోక్యం చేసుకోరాదని కూడా కోర్టును కోరింది. హైకోర్టు సీజే డీఎన్ పటేల్ నేతృత్వంలోని ధర్మాసనం ముందు కేంద్ర ప్రభుత్వం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ఈ విషయం చెప్పారు. హింసకు సంబంధించిన ఈ కేసులో కేంద్రం ఇంప్లీడు అయ్యేందుకు హైకోర్టు అనుమతించింది. కాగా కాంగ్రెస్ నేతలు సోనియా, రాహుల్, ప్రియాంక, ఢిల్లీ ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోదియా, మజ్లిస్ అధిపతి అసదుద్దీన్ ఒవైసీ, ఆ పార్టీ ఎమ్మెల్యే అక్బరుద్దీన్ విద్వేష ప్రసంగాలు చేశారని, వారిపై ఎఫ్ఐఆర్ దాఖలు చేయాలని కోరుతూ కొంతమంది వ్యాజ్యాలు వేశారు. ఢిల్లీ అల్లర్లపై అమెరికాకు చెందిన అంతర్జాతీయ మతస్వేచ్ఛ కమిషన్ అబద్ధాలు ప్రచారం చేస్తోందని భారత్ మండిపడింది. దీంతోపాటు ఇస్లామిక్ కోఆపరేషన్ ఆర్గనైజేషన్ కూడా ప్రపంచాన్ని తప్పుదోవ పట్టించే ప్రకటనలు చేస్తోందని ఆరోపించింది. హింసాత్మక సంఘటనలకు సంబంధించి మీడియా స్వీయ నియంత్రణ పాటించాలని ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పీసీఐ) సూచించింది. మతకలహాలను రెచ్చగొట్టేలా, అల్లర్లకు ఊతమిచ్చేలా ఉన్న దృశ్యాలను ప్రసారం చేయొద్దని ఓ ప్రకటనలో పేర్కొంది.

## 'గుజరాత్'ను తలపిస్తున్న ఢిల్లీ: ఎన్సీపీ

ముంబయి, ఫిబ్రవరి 27: ఢిల్లీలో పరిస్థితులు 2002 నాటి గుజరాత్ అల్లర్లను తలపిస్తున్నాయని ఎన్సీపీ ఆరోపించింది. ఇందుకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని ఆ పార్టీ అధికార ప్రతినిధి, మహారాష్ట్ర మంత్రి నవాబ్ మాలిక్ డిమాండ్ చేశారు. ఢిల్లీ ఘర్షణలకు పూర్తిగా బీజేపీదే బాధ్యత అని సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ అన్నారు.

## విద్వేషంలోనూ వికసించిన సామరస్యం

**ఢిల్లీలో మంటల్లో చిక్కుకున్న హిందూ మహిళ**

*తన తల్లిని కాపాడాలని ముస్లిం మిత్రున్ని కోరిన కొడుకు*

*అతడి చొరవతో 12 మంది ముస్లిం యువకుల సాయం*

*చాంద్‌బాగ్‌లో ఆలయ ధ్వంసాన్ని అడ్డుకున్న ముస్లింలు*

*అశోక్‌నగర్‌లో ముస్లింలకు ఆశ్రయమిచ్చిన హిందువులు*

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27: విద్వేషం.. హింస చెలరేగి ఢిల్లీని తగలబెడుతున్న సమయంలో అక్కడే ఓ యువకుడు భారతదేశ వైవిధ్యానికి, మత సామరస్యానికి ప్రతీకగా నిలిచాడు. సోమవారం ముస్తఫాబాద్ ప్రాంతంలో అల్లరిమూకలు ఇళ్లు, దుకాణాలకు నిప్పు పెట్టారు. అక్కడే ఓ ఇంట్లో ఉన్న వృద్ధురాలు మంటల్లో చిక్కుకుంది. ఇంట్లో ఎవరూ లేరు. కుమారుడికి ఫోన్ చేసి విషయాన్ని చెప్పింది. అతడు వెంటనే తన మిత్రుడు మహమ్మద్ అనస్‌ను ఫోన్ చేశాడు. తన తల్లిని రక్షించాలని కోరాడు. కానీ ఆ సమయంలో అనస్ కూడా ఆ ప్రాంతంలో లేడు. తన మిత్రుడి తల్లిని ఎలాగైనా కాపాడాలని ఫేస్‌బుక్ ద్వారా తన మిత్రులను కోరాడు. దీంతో 12 మంది ముస్లిం యువకులు ఘటనా స్థలానికి చేరి ఆ వృద్ధురాలిని కాపాడారు. అనస్ మిత్రుడు మోమిన్ ఇంట్లో ఆమెకు ఆశ్రయం కల్పించారు. ఇపుడు అనస్‌పై ప్రశంసల వర్షం కురుస్తోంది. కాగా, చాంద్‌బాగ్‌లో గురువారం ఓ ఆలయానికి అల్లరి మూకలు నిప్పు పెట్టకుండా కొంతమంది ముస్లింలు అడ్డుకున్నారు. వారిని అక్కడి నుంచి వెళ్లగొట్టారు. ఢిల్లీలోని అశోక్ నగర్ ప్రాంతంలో అల్లరి మూకల దాడిలో నిరాశ్రయులైన కొంత మంది ముస్లింలకు హిందువులు తమ ఇళ్లలో ఆశ్రయం కల్పించారు.



నిర్మానుష్యంగా మారిన ఢిల్లీ వీధుల్లో పోలీసు పహారా... అమిత్ షా రాజీనామా చేయాలంటూ బెంగళూరులో ధర్నా చేస్తున్న విద్యార్థులను అరెస్టు చేస్తున్న దృశ్యం

# మృతులు 38

(మొదటిపేజీ తరువాయి)

ఇప్పటిదాకా 48 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్లు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ఢిల్లీ హైకోర్టుకు తెలిపారు. ఘర్షణలు, దాడులకు సంబంధించి దర్యాప్తును క్రైమ్‌బ్రాంచ్‌కు బదిలీ చేశారు. అలాగే, దర్యాప్తు నిమిత్తం రెండు ప్రత్యేక దర్యాప్తు బృందాలను ఏర్పాటు చేశారు. ఒక్కో బృందంలో నలుగురు ఏసీపీ ర్యాంకు అధికారులు ఉంటారని.. అదనపు కమిషనర్ బీకే సింగ్ పర్యవేక్షణలో వారు దర్యాప్తు కొనసాగిస్తారని పోలీసు వర్గాలు తెలిపాయి. కాగా.. గత 36 గంటలుగా ఈశాన్య ఢిల్లీలో చెప్పుకోదగ్గ పెద్ద సంఘటనలేవీ జరగలేదని కేంద్ర హోం శాఖ ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ ఘర్షణలకు సంబంధించి 514 మందిని పోలీసులు ప్రశ్నిస్తున్నట్టు తెలిపింది.

### గురువారం తెల్లవారుజామునా..

ఈశాన్య ఢిల్లీలో పరిస్థితి నిదానంగా సాధారణ స్థితికి వస్తోందని కొత్తగా నియమితులైన ప్రత్యేక కమిషనర్ ఎస్.ఎన్.శ్రీవాస్తవ తెలిపారు. కానీ.. గురువారం తెల్లవారుజామున కూడా యమునావిహార్ ప్రాంతంలో అల్లరిమూకలు మూడు వాహనాలను తగలబెట్టడం గమనార్హం. దాడులకు పాల్పడినవారు చివరకు పాఠశాలలను కూడా వదల్లేదు. ఆ బడికి రూ.70లక్షల మేర నష్టం జరిగినట్టు అంచనా.

### ఆస్పత్రిలో ఆవేదన..

200మందికి పైగా క్షతగాత్రులకు చికిత్స చేస్తున్న గురు తేజ్‌బహదూర్ ఆస్పత్రి.. బంధువుల రోదనలతో ప్రతిధ్వనిస్తోంది. మృతుల బంధువులు తమవారి మృతదేహాల కోసం ఆస్పత్రి మార్చురీ వద్ద పడిగాపులు కాస్తున్నారు. చనిపోయినవారిలో 22 అష్ఫాక్ హుస్సేన్‌కు 10 రోజుల క్రితమే వివాహమైంది. కరెంటు పనులు చేసుకుని పొట్టపోసుకునే అష్ఫాక్ ఈ ఘర్షణల్లో తుపాకీ తూటాకు బలైపోయాడు. 35 ఏళ్ల ముదస్సిర్ ఖాన్ మృతదేహం కోసం అతడి బంధువులు రెండు రోజులుగా ఎదురుచూస్తున్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నవారి కోసం దాదాపు మూడు డజన్ల మంది సీఆర్పీఎఫ్ జవాన్లు రక్తదానం చేశారు. ఇక.. ఢిల్లీలోని సోనియా విహార్ ప్రాంతానికి చెందిన పదమూడేళ్ల బాలిక సోమవారం నుంచి కనిపించట్లేదని ఆమె తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా.. ఫిబ్రవరి 28, 29 తేదీల్లో జరగాల్సిన 10, 12 తరగతుల పరీక్షలను ఘర్షణల నేపథ్యంలో సీబీఎస్ఈ వాయిదా వేసింది.

### 10 లక్షలు పరిహారం

ఘర్షణల్లో మృతి చెందినవారి కుటుంబాలకు రూ.10 లక్షలు, గాయపడ్డవారికి రూ.2 లక్షలు పరిహారంగా ఇస్తామని ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ప్రకటించారు.

## మిరకిల్ బేబీ!

**ఆ శిశువు జననం ఓ అద్భుతం**

▸▸ *గర్భిణిపై దాడి చేసిన అల్లరిమూక*

▸▸ *భర్తనూ, అత్తనూ తీవ్రంగా కొట్టి.. ఇంటికి నిప్పు*

▸▸ *36 గంటల నొప్పి భరించిన ఇల్లాలు*

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27: సోమవారం రాత్రి... 11: 30... ఢిల్లీలోని కార్వాల్ ప్రాంతంలో ఓ చిన్న ఇంట్లో ఉంటున్న ఓ మహిళ (30) అప్పుడే నిద్రకు ఉపక్రమించబోతోంది. నిండు గర్భిణి అయిన ఆమె మంచం మీద వాలుతున్న సమయంలో అకస్మాత్తుగా ఓ అల్లరి మూక ఆ ఇంటిపై విరుచుకుపడింది. ఇంట్లో సామానంతా ఓ చోట పోసింది. ఆమె వద్దకు వెళ్లి పొత్తికడుపుపై తన్నడంతో బాధతో విలవిల్లాడింది. ఆమెను కాపాడబోయిన ఆమె అత్తమ్మనూ ఆ మూక పక్కకు తోసేసి కొట్టింది. అడ్డం వచ్చిన భర్తనూ చావచితక్కొట్టి ఆ తరువాత వారిని, వారి పిల్లల్ని బయటకు లాగేసి ఆ ఇంటికి నిప్పు పెట్టింది. బాధను తట్టుకోలేని ఆ ఇల్లాల్ని అక్కడకు దగ్గర్లోని ఆసుపత్రికి తీసికెళ్లగా, డాక్టర్లు అల్-హింద్ హాస్పిటల్‌కు వెళ్లండని పంపేశారు. అక్కడ ఆమె 36 గంటల పాటు బాధను భరించింది. ఆ తరువాత ఓ పండంటి మగబిడ్డను ప్రసవించింది. దుండగులు వారింటిని తగలబెట్టడంతో ఇపుడు నిలువనీడ లేని పరిస్థితి వారిది!!

# ఎంపీ ఫిర్యాదునూ పట్టించుకోరా?

*ప్రజల రక్షణకు సాయం కోరినా పోలీసుల నిష్క్రియ*

*నా మాటే వినకపోతే ఢిల్లీలో మంటలు సహజమే*

*అమిత్ షాకు అకాలీ ఎంపీ నరేష్ గుజ్రాల్ లేఖ*



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27: "మౌజ్‌పూర్ ప్రాంతంలో ఓ ఇంట్లో 16 మంది ముస్లింలు చిక్కుబడ్డారు. తలుపులు బిడాయించుకుని వారిపై దాడికి ఓ మూక అదే పనిగా ప్రయత్నిస్తోంది. తలుపులు బద్దలుకొట్టే యత్నం చేస్తోంది. ఈ పరిస్థితి గురించి నాకు తెలిసి వెంటనే ఆ ఇంటికి వెళ్లి వారిని కాపాడాలని ఢిల్లీ పోలీసులను కోరాను. రాత్రి 11:43 గంటల ప్రాంతంలో నా ఫిర్యాదు అందినట్లు చెబుతూ కంప్లయింట్ నెంబరు 946603ను కూడా ఇచ్చారు. కానీ నా ఫిర్యాదుపై పోలీసులు ఎలాంటి చర్యా తీసుకోలేదు. దాన్ని పక్కన పడేశారు. ప్రజల రక్షణకు సాయం కోరినా నిష్క్రియగా వ్యవహరించారు. ఓ ఎంపీ చేసిన ఫిర్యాదుకు వారిచ్చిన విలువ అది. ఎంపీ మాటే పట్టించుకోకపోతే ఇక ఢిల్లీలోని కొన్ని ప్రాంతాలు పోలీసులు నిస్సహాయంగా చూస్తుండగా మంటల్లో కాలిపోతున్నాయని భావించడంలో ఆశ్చర్యం లేదు. చివరకు ఆ 16 మందికీ సాయం అందనే లేదు. ఆ ఇంటి ఇరుగుపొరుగున ఉన్న కొందరు హిందువుల సాయంతో వారు అక్కడి నుంచి తప్పించుకోగలిగారు" ఇది బీజేపీ మిత్రపక్షమైన అకాలీదళ్ రాజ్యసభ సభ్యుడు నరేష్ గుజ్రాల్ ఆవేదన. ఈయన మాజీ ప్రధాని ఐకే గుజ్రాల్ కుమారుడు. పోలీసుల నిష్క్రియను తెలియపరుస్తూ ఆయన కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు, ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ అనిల్ బైజాల్‌కు, ఢిల్లీ పోలీస్ కమిషనర్‌కు లేఖలు పంపారు. ఈ ఘటనలు 1984 నాటి సిక్కుల ఊచకోతను గుర్తుకు తెస్తున్నాయని, భారతీయులెవరూ అలాంటి ఘటనల్ని కోరుకోవడం లేదని ఆయన తెలిపారు.

## అఖిలపక్షాన్ని పిలవండి

**కేజ్రీవాల్‌కు సీపీఎం లేఖ**

ఢిల్లీలో తిరిగి శాంతి నెలకొల్పేందుకు అందరం కలిసి ప్రయత్నిద్దామని సీఎం కేజ్రీవాల్‌కు సీపీఎం సూచించింది. మతసామరస్యాన్ని కాపాడేందుకు తమ వంతు సహకారం అందిస్తామని తెలిపింది. ఈ మేరకు కేజ్రీవాల్‌కు.. సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందా కరత్, ఢిల్లీ కార్యదర్శి కేఎం తివారీ లేఖ రాశారు.

## ఢిల్లీలో హిందువుల పెళ్లికి ముస్లింల రక్షణ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27: చిత్రంలో కనిపిస్తున్న పెళ్లి కూతురు పేరు సావిత్రి. అబ్బాయి పేరు గుల్షాన్. వీరిద్దరికీ మంగళవారం పెళ్లి. కానీ ఆరోజు ఢిల్లీలో విద్వేషాలు పెచ్చరిల్లాయి. సావిత్రి నివాసం ఉండే ప్రాంతంలో ముస్లింల మెజారిటీ ఎక్కువ. ఆ పరిస్థితుల్లో పెళ్లి తంతు జరపడం కష్టమని భావించిన సావిత్రి తల్లిదండ్రులు పెళ్లి వాయిదా వేయాలనుకున్నారు. కానీ చుట్టు పక్కల ఉండే ముస్లింలే వారికి సర్ది చెప్పారు. పెళ్లికి ఎలాంటి అడ్డంకి రాకుండా చూస్తామంటూ ధైర్యం చెప్పారు. వీరి పెళ్లి ఘనంగా జరిగేలా చేశారు.

# సంచలన జడ్జికి స్థానచలనం

▸▸ **జస్టిస్ మురళీధర్ బదిలీపై రగడ**



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27: ఢిల్లీ అల్లర్ల కేసును విచారిస్తున్న ఢిల్లీ హైకోర్టు జడ్జి జస్టిస్ మురళీధర్ ఆకస్మిక బదిలీపై వివాదం చెలరేగింది. రెచ్చగొట్టే ప్రసంగాలు చేసిన ముగ్గురు బీజేపీ నేతల(కేంద్ర మంత్రి, ఎంపీ, మాజీఎమ్మెల్యే)పై ఎఫ్ఐఆర్ నమోదు చేయనందుకు ఆయన బుధవారం ఢిల్లీ పోలీసులను చెరిగి పారేశారు. స్వయానా కోర్టు హాల్లో పోలీసులకు వివాదాస్పద ప్రసంగాలతో కూడిన వీడియో క్లిప్పింగులను చూపారు. ఇది జరిగిన కొద్ది గంటలకే జస్టిస్ మురళీధర్‌ను పంజాబ్ హర్యానా హైకోర్టుకు ట్రాన్స్‌ఫర్ చేస్తూ నోటిఫికేషన్ వెలువడింది. సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ సలహా మేరకు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఈ బదిలీ చేశారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ హఠాన్నిర్ణయం తీవ్ర నిరసనకు దారితీసింది. ఆయన బదిలీ ఎప్పట్నుంచో నలుగుతున్నప్పటికీ ఈ సమయంలో చేయడాన్ని అనేకమంది ప్రశ్నించారు. దీన్ని ఢిల్లీ బార్ అసోసియేషన్ వెంటనే ఖండించింది. ఇది రాజకీయ రంగు కూడా పులుముకుంది. "ద్వేషపూరిత ప్రసంగాలు చేసిన బీజేపీ నేతలను కాపాడేందుకే ఆయనను తప్పించారు. బెదిరించి, కక్ష గట్టడం బీజేపీకి అలవాటు. ఇదీ ఆ కోవలోనిదే" అని కాంగ్రెస్ దుయ్యబట్టింది. "న్యాయాన్ని అణిచేసి, రుజువర్తన గల న్యాయవ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీయడం బీజేపీ లక్ష్యం. ఇది సిగ్గుచేటు, బాధాకరం" అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకావాద్రా విమర్శించారు. రాహుల్ గాంధీ సీబీఐ మాజీ జడ్జి బీహెచ్ లోయా ప్రస్తావన చేశారు. 'ధైర్యవంతుడైన లోయా గుర్తుకొస్తున్నారు. ఆయనను బదిలీ చేయలేదు" అని నర్మగర్భంగా ట్వీట్ చేశారు. గతంలో అమిత్ షా నిందితుడిగా ఉన్న గ్యాంగ్‌స్టర్ సొహ్రాబుద్దీన్ షేక్ హత్య కేసును విచారించిన జడ్జి లోయా అనుమానాస్పద పరిస్థితుల్లో నాగ్‌పూర్‌లో చనిపోయారు. కాగా, కాంగ్రెస్‌వాదుల విమర్శలను బీజేపీ తిప్పికొట్టింది. "ఇది సాధారణంగా జరిగిన బదిలీ. దీన్ని రాజకీయం చేయడం ద్వారా న్యాయవ్యవస్థపై తనకెంత పలుచని గౌరవం ఉందో కాంగ్రెస్ బయటపెట్టుకుంది. జస్టిస్ మురళీధర్ బదిలీని ఈనెల 12న సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు చేసింది. దానికి అనుగుణంగానే రాష్ట్రపతి నిర్ణయం వెలువడింది" అని కేంద్ర న్యాయ మంత్రి రవిశంకర్ ప్రసాద్ పేర్కొన్నారు. సీపీఎం కూడా ఈ బదిలీని తప్పుబట్టింది.

### మీరే స్ఫూర్తి: లాయర్లు

చివరిరోజున జస్టిస్ వీ కామేశ్వరరావుతో కలిసి ఓ ధర్మాసనంలో కేసు తీర్పును జస్టిస్ మురళీధర్ వెలువరించారు. ఈ కోర్టులో ఇదే నా ఆఖరి రోజు అని ఆయన అన్నపుడు కొందరు యువ న్యాయవాదులు ఆయన విచారణ శైలిని మెచ్చుకుంటూ - 'మీరే మాకు స్ఫూర్తి. మీ బాటను మేం అనుసరిస్తాం' అని పేర్కొన్నారు.

### ఇది మూడోసారి..!

ఆయన బదిలీ సిఫారసు పై 2018 డిసెంబరు, 2019ల్లో కొలీజియంలో చర్చ జరిగింది. అయితే ఆనాటి చీఫ్ జస్టిస్ రంజన్ గొగోయ్ ఆ బదిలీకి తిరస్కరించారు. ఈ నెల 12న మూడోమారు చర్చకొచ్చి- బదిలీకి కొలీజియం సిఫారసు చేయడంతో అది న్యాయ శాఖకు చేరింది. అయితే దీనిని ఆమోదముద్ర వేసిన టైమింగ్‌ను అందరూ తప్పుబట్టారు.

### సాహస తీర్పులకు మారుపేరు

1984 సెప్టెంబరులో న్యాయవాదిగా చెన్నైలో ప్రాక్టీసు ఆరంభించిన మురళీధర్ మూడేళ్ల తరువాత ఢిల్లీకి మారారు. 2006లో ఢిల్లీ హైకోర్టు జడ్జిగా నియమితులైన ఆయన సాహస నిర్ణయాలకు మారుపేరుగా నిలిచారు. తనను యువర్ లార్డ్‌షిప్ అనకూడదన్న ఆయన సూచన సంచలనం రేపింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తుల్లో ఎందరు తమ ఆస్తిపాస్తులు వెల్లడించారో చెప్పాలంటూ వచ్చిన ఓ ఆర్టీఐ దరఖాస్తుపై తీర్పు ఇచ్చిన ధర్మాసనంలో ఆయన ఒకరు. స్వలింగ సంపర్కం నేరం కాదని తీర్పిచ్చిన బెంచ్‌లోనూ ఉన్నారు. 1984లో సిక్కుల ఊచకోతకేసులో యూపీ సాయుధ పటాలానికి వ్యతిరేకంగా తీర్పు ఇచ్చారు. బీమా కోరెగాం కేసులో హక్కుల నేత గౌతమ్ నవ్‌లఖాకు అనుకూలంగా తీర్పు ఇచ్చారు. ఒక న్యాయవాదిగా ఆయన భోపాల్‌గ్యాస్ బాధితుల పక్షాన వాదించారు.

# కాలేజీల్లో కల్లోలం!

(మొదటి పేజీ తరువాయి)

సాధారణ స్థాయి కాలేజీల పరిస్థితి ఇలాగే ఉంది. దీనికి రాష్ట్ర ప్రభుత్వ 'కొత్త' విధానాలే కారణం! భవిష్యత్తుల్లో విద్యార్థుల నుంచి ఫీజు వసూలుకు 'గ్యారెంటీ' ఉంటే తప్ప అడ్మిషన్లు ఇవ్వకూడదని కాలేజీలు నిర్ణయించుకునేలా ప్రభుత్వం మరిన్ని కొత్త నిర్ణయాలు తీసుకుంటోంది.

**కొత్త కొత్తగా...:** 'విద్యా దీవెన' పేరిట ఫీజుల చెల్లింపు పథకంలో తీసుకొస్తున్న మార్పులు ప్రైవేట్ కాలేజీలను మూత దిశగా నడిపిస్తున్నాయి. ఇప్పుడు జూనియర్ కాలేజీల పరిస్థితి అగమ్య గోచరంగా తయారుకాగా, మున్ముందు డిగ్రీ, ప్రొఫెషనల్ కాలేజీల పరిస్థితి కూడా ఇదే మాదిరిగా ఉంటుందన్న సంకేతాలు కనిపిస్తున్నాయి. దీనికి కారణం... కాలేజీలకు ఇప్పటిదాకా ఫీజు రీఇంబర్స్‌మెంట్ నిధులు అందనే లేదు. ఈ ఏడాదికి ఫీజులను నిర్ణయించనే లేదు. ప్రభుత్వం ఇచ్చిన భరోసాతో అప్పులుచేసి పిల్లలకు భోజనాలు పెట్టామని, ఇప్పుడు వాటి మాటే ఎత్తకుంటే కాలేజీలు ఎలా నిర్వహించాలని యాజమాన్యాలు వాపోతున్నాయి. ఇలాంటి సందర్భాల్లో ఇంటర్ కాలేజీల నిర్వాహకులు విద్యార్థుల నుంచి ఫీజు వసూలు చేసుకుని, ప్రభుత్వం రీఇంబర్స్ చేసినప్పుడు తిరిగి ఇస్తుంటాయి. పరీక్షలకు హాల్ టికెట్ ఇచ్చేముందే విషయాన్ని సెటిల్ చేసుకుంటాయి. కానీ... ఇప్పుడు ప్రభుత్వం హాల్‌టికెట్ విషయంలో కాలేజీకి-విద్యార్థులకు మధ్య కనెక్షన్ కట్ చేసేసింది. నేరుగా వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్ డౌన్‌లోడ్ చేసుకునే వెసులుబాటు కల్పించింది. ఒకటి... హాల్ టికెట్‌లో తప్పు ఒప్పు లుంటే సరిదిద్దడం ఎలా? ఎవరు చేయించాలి? రెండు... ఫీజులు వసూలు చేసుకోవడం ఎలా? 'అమ్మ ఒడి'లో ఇంటర్‌నూ చేర్చి... విద్యార్థి తల్లి ఖాతాలో ఒకేసారి రూ.15వేలు జమ చేశారు. ట్యూషన్ ఫీజు చెల్లింపు మాటెత్తడంలేదు. ఇప్పుడు విద్యార్థులు నేరుగా హాల్ టికెట్లు తీసుకుని పరీక్షలు రాసుకునే వెసులుబాటు కల్పించేశారు. గతంలో హాల్ టికెట్‌పై తప్పనిసరిగా ప్రిన్సిపాల్ సంతకం ఉండాలనే నిబంధన ఉండేది. సంతకం పెట్టే సమయంలోనే సదరు విద్యార్థి కాలేజీకి ఏమైనా ఫీజు బకాయిలు ఏమైనా ఉంటే వసూలు చేసుకునే వారు. ఇప్పుడు ప్రిన్సిపాల్ సంతకం కూడా అక్కర్లేదని ఇంటర్ బోర్డు తేల్చేసింది. ఇప్పుడు... ప్రభుత్వం ఫీజులు ఇవ్వక, విద్యార్థుల నుంచి వసూలు చేసే అవకాశం లేక కాలేజీలు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయాయి. ఇంటర్ విద్యార్థులకు ట్యూషన్ ఫీజులను ఇవ్వకూడదని ప్రభుత్వం నిర్ణయించిందనే సమాచారంతో... ఇకపై కాలేజీలో చేరే విద్యార్థుల నుంచి ముందుగానే ఫీజుల సొమ్ము ముక్కుపిండి వసూలు చేసే అవకాశముంది. ఇంటర్ బోర్డు గతంలో ఎప్పుడూ లేని వింత నిర్ణయాలు తీసుకుంటోందని విద్యావేత్తలు విమర్శిస్తున్నారు.

### ఇతర కాలేజీల పరిస్థితి...

ఇంటర్ కాలేజీల పరిస్థితి ఇప్పటికే గందరగోళంలో పడిపోగా... ఇంజనీరింగ్‌తోపాటు ఇతర ప్రొఫెషనల్ కాలేజీలు కూడా సర్కారు వైఖరి పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ట్యూషన్ ఫీజులను ముందస్తుగా వసూలు చేసుకునే ఆలోచన చేస్తున్నాయి. లేకపోతే అప్పుల భారం పెరిగి కాలేజీలను మూత వేసుకోవాల్సిన పరిస్థితి తప్పకపోవచ్చని భావిస్తున్నాయి. 'విద్యా దీవెన' కింద పూర్తి ఫీజు ఇస్తామంటూ సర్కారు చెబుతున్న మాటలకు, జరుగుతున్న కసరత్తుకు మధ్య పొంతన కుదరడంలేదన్నది వీరి వాదన. ఫీజు మొత్తాన్ని తగ్గించే ప్రయత్నాలు, ఆంక్షలతో విద్యార్థుల సంఖ్యను తగ్గించడం వంటి విధానాలు కాలేజీ యాజమాన్యాలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఇప్పటికి మూడు క్వార్టర్ల ట్యూషన్ ఫీజు, స్కాలర్‌షిప్ మొత్తాలు కాలేజీలకు ప్రభుత్వం బకాయి పడింది. "గతంలో ఏడాదికి నాలుగు విడతలుగా ట్యూషన్ ఫీజులను రీయింబర్స్ చేసేవారు. జగన్ ప్రభుత్వం వచ్చిన తర్వాత అసలు ఆ విషయాన్నే విస్మరించింది. నెలల తరబడి చెల్లింపులు పెండింగ్ పెట్టడం వల్ల కాలేజీల్లో పనిచేస్తున్న సిబ్బందికి జీతాలు ఇవ్వలేకపోతున్నాం" అని యాజమాన్యాలు వాపోతున్నాయి.

### కొత్తగా చేసిన మార్పు ఇదీ...

గతంలో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని పూర్తిగా మార్చేశారు. నవ రత్నాల్లో భాగంగా పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్స్ విధానాన్ని మార్చి జగనన్న విద్యా దీవెన(ఆర్‌టీఎఫ్), జగనన్న వసతి దీవెన(ఎంటీఎఫ్) పథకాలను ప్రవేశపెట్టారు. విద్యార్థి ఫీజును సంబంధిత కళాశాల ఖాతాకు, వసతి సొమ్మును తల్లి లేదా సంరక్షకుని బ్యాంక్ ఖాతాకు జమ చేస్తామన్నారు. ఈ రెండు పథకాల కింద ఇప్పటి వరకూ కాలేజీలకు నయాపైసా అందజేయలేదు. విద్యా దీవెన కింద అర్హత ఉన్న ప్రతి విద్యార్థికి పూర్తి ఫీజు రీయింబర్స్ చేస్తామని... వసతి దీవెన కింద విద్యార్థి వసతి, మెస్ ఖర్చులకు ఐటీఐ విద్యార్థులకు రూ.10 వేలు, పాలిటెక్నిక్ విద్యార్థులకు రూ.15 వేలు, డిగ్రీ, ఆపైన విద్యార్థులకు రూ.20 వేల చొప్పున ఏటా ఫిబ్రవరి, జులైలో రెండు దఫాలుగా అందజేస్తామని ప్రకటించారు. ఇందులో భాగంగా కళాశాలల యాజమాన్యాలు అర్హత గల విద్యార్థుల పూర్తి వివరాలను జ్ఞానభూమి వెబ్‌సైట్‌లో ఆయా విభాగాలకు అప్‌లోడ్ చేశాయి. రాష్ట్రవ్యాప్తంగా 11,87,904 మంది విద్యార్థులు ఇందుకోసం అర్హత పొందినట్లు ప్రభుత్వ గణాంకాలు చెబుతుండగా... చాలామంది పేర్లు అర్హుల జాబితాలో లేవని కాలేజీలకు సమాచారం అందటం గమనార్హం. వసతి దీవెన సొమ్మును కూడా తల్లి లేదా సంరక్షకుని బ్యాంక్ ఖాతాలో జమచేస్తుండటంతో... మెస్‌లో భోజన వసతి కల్పించిన కాలేజీలకు ఆ మొత్తం ఎలా అందుతుందన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. పరీక్షలు ముంచుకొస్తున్న తరుణంలో హాస్టల్, మెస్ చార్జీలు ఇవ్వాలని డిమాండ్ చేస్తే తల్లులు ఇస్తారా? సొమ్ము కడితేనే హాల్ టికెట్లు ఇస్తామంటే ప్రభుత్వం ఒప్పుకొంటుందా? అని కళాశాలల యాజమాన్యాలు ప్రశ్నిస్తున్నాయి. ఒకవైపు ట్యూషన్ ఫీజు రీయింబర్స్ చేయకుండా... మరోవైపు వసతి, మెస్ ఖర్చులు తల్లుల బ్యాంక్ ఖాతాల్లో వేస్తే కాలేజీల నిర్వహణ ఎలాగని వాపోతున్నాయి.

**- అమరావతి-ఆంధ్రజ్యోతి**

# ఇరాన్‌ను వణికిస్తున్న కరోనా

## 26కు చేరిన మరణాలు

▸▸ **దేశ ఉపాధ్యక్షురాలికీ వైరస్**

టెహ్రాన్, బీజింగ్, ఫిబ్రవరి 27: మొన్న చైనా, నిన్న దక్షిణ కొరియా, నేడు ఇరాన్.. కరోనా తాకిడితో విలవిల్లాడుతున్నాయి. ఎక్కడో సుదూరాన ఉన్న వూహాన్‌లో పుట్టుకొచ్చిన కొవిడ్-19.. అనూహ్యంగా మధ్య ప్రాచ్యంలోని ఇరాన్‌ను వణికిస్తోంది. చైనా బయట ఎక్కువ మరణాలు ఈ దేశంలోనే నమోదవుతున్నాయి. గురువారం నాటికి వైరస్ కారణంగా ఇరాన్‌లో మృతుల సంఖ్య 26కు, నిర్ధారిత కేసులు 245కు చేరాయి. దేశ ఉపాధ్యక్షురాలు (మహిళా, కుటుంబ వ్యవహారాలు) మౌసమ్ ఎబ్టెకార్ సైతం వైరస్ బారినపడ్డారు. 63 కేసులు ఖ్వామ్ నగరంలోనే నమోదయ్యాయి. మరోవైపు ప్రఖ్యాత ఆధ్యాత్మిక కేంద్రాలైన మక్కా, మదీనాలకు యాత్రికుల రాకను సౌదీ అరేబియా గురువారం నుంచి తాత్కాలికంగా నిలిపివేసింది. 220 కేసులు నమోదవడంతో పర్యాటక వీసాలతో దేశంలోకి ప్రవేశాన్ని రద్దు చేసింది. మొత్తమ్మీద గల్ఫ్‌లో 350 పైనే కేసులు నమోదయ్యాయి. కాగా.. వూహాన్ నుంచి 76 మంది స్వదేశీయులు సహా 36 మంది విదేశీయులను, టోక్యో నుంచి 119 మంది స్వదేశీయులు, ఐదుగురు విదేశీయులను ప్రత్యేక విమానాల్లో భారత్ తరలించింది. పరిస్థితి తీవ్రంగా ఉన్నా ఆందోళనకరం కాదని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పేర్కొనడం గమనార్హం. జపాన్‌లో కొన్ని వారాల పాటు బడులను మూసివేయనున్నారు.


వూహాన్ నుంచి తీసుకొచ్చిన భారతీయులకు వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

### వూహాన్‌లోనే జ్యోతి

కర్నూలు జిల్లాకు చెందిన అన్నెం జ్యోతి (22)తో పాటు సత్య సాయికృష్ణ ఇప్పటికీ కరోనా కేంద్ర స్థానం వూహాన్‌లోనే ఉన్నారు. క్యాంపస్ సెలక్షన్స్‌లో ఎంపికైన వీరిని ఓ సంస్థ ట్రైనీ ఇంజనీర్లుగా చైనా తీసుకెళ్లింది. అక్కడ సరైన మందులు లేవని, మాంసాహారమే అందుబాటులో ఉందని ఆమె బంధువొకరు తెలిపారు.

## కరోనాపై అప్రమత్తమైన గల్ఫ్

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి): కరోనా బాధితులు చైనా తర్వాత ఇరాన్‌లో ఎక్కువ ఉన్నట్లు వెల్లడి కావడం, ఆ దేశానికి వెళ్లివచ్చిన తమ పౌరులు పలువురికి వైరస్ సోకినట్లు తేలడంతో గల్ఫ్ దేశాలన్నీ అప్రమత్తమయ్యాయి. ఇరాన్ నుంచి అన్ని రకాల రాకపోకలను నిషేధించాయి. మరికొన్ని దేశాలు ఇరాన్‌తో సరిహద్దులను మూసివేశాయి. గల్ఫ్ చమురుకు పెద్ద మార్కెట్లయిన చైనా, దక్షిణ కొరియా కొవిడ్- 19తో విలవిల్లాడుతుండటంతో చమురు ధరలు పతనమయ్యాయి. పీపా 50 డాలర్లకు చేరుకుంది. కాగా.. ఇరాన్ ఉప ఆరోగ్య మంత్రి సైతం వైరస్ బారినపడటం పరిస్థితి తీవ్రతను చాటుతోంది. ఈ దేశంలోని ఖోం ఆధ్యాతిక నగరాన్ని ప్రపంచవ్యాప్తంగా ఉన్న షియా ముస్లింలు సందర్శిస్తుంటారు. ఇప్పుడు గల్ఫ్‌లోని వైరస్ బాధితులంతా.. అక్కడికి వెళ్లివచ్చినవారే.

## బ్రిటన్‌లో పెరిగిన భారతీయ విద్యార్థులు

బ్రిటన్‌లో చదువుతున్న భారతీయ విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. 2019 విద్యా సంవత్సరంలో విద్యా (టైర్-4) వీసాలు పొందిన భారతీయ విద్యార్థుల సంఖ్య 37,500కి చేరుకుంది. అంతకు ముందు ఏడాదితో పోలిస్తే ఇది 93 శాతం ఎక్కువ. గత ఎనిమిదేళ్లలో ఇంత మంది విద్యార్థులకు వీసాలు లభించటం కూడా ఇదే మొదటిసారి. దీంతోపాటు యూకేలో నైపుణ్య వీసా కేటగిరిలో (టైర్-2) 57 వేల కన్నా ఎక్కువ మంది భారతీయుల ఉద్యోగులు టైర్-2 వీసాను పొందారు. మొత్తం టైర్-2 వీసాల్లో ఇది 50 శాతం పైనే. వీటితో పాటు బ్రిటన్ పర్యాటక వీసాల సంఖ్య కూడా బాగా పెరిగింది. నిరుడు 5.15 లక్షల మందికి టూరిస్టు వీసాలు లభించాయి. 2018తో పోలిస్తే ఇది 8 శాతం అధికం. - **స్పెషల్ డెస్క్**

## అసెంబ్లీ సీట్ల పెంపు లేదు: కిషన్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): నిర్ణీత గడువులోగా తెలుగు రాష్ట్రాల్లో అసెంబ్లీ సీట్లు పెంచే అవకాశమే లేదని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. గత కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని, సీట్ల పెంపు అంశాన్ని విభజన చట్టంలో రాత్రికి రాత్రి చేర్చారని విమర్శించారు. గతంలో దేశవ్యాప్తంగా నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ జరిగినప్పుడే ఉమ్మడి ఏపీలో కూడా జరిగిందని, ఇప్పుడు కూడా దేశవ్యాప్తంగా ఒకేసారి జరుగుతుందని తెలిపారు.

## బెంగాల్ నుంచి రాజ్యసభకు ఏచూరి

కోల్‌కతా, ఫిబ్రవరి 27: పశ్చిమ బెంగాల్ నుంచి రాజ్యసభ అభ్యర్థిగా పోటీ చేయడానికి తమ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి పేరును ఆ రాష్ట్ర సీపీఎం ప్రతిపాదించింది. ఇందుకు కాంగ్రెస్ మద్దతును తీసుకోనుంది. ఈ విషయాలపై సీపీఎం పొలిట్‌బ్యూరో తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. మార్చి 26న పశ్చిమ బెంగాల్‌లో ఐదు రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు జరుగుతాయి.

ప్రపంచకప్‌లో నేటి మ్యాచ్‌లు

| దక్షిణాఫ్రికా x థాయ్‌లాండ్ | ఇంగ్లండ్ x పాకిస్థాన్ |
|---|---|
| (గ్రూప్-బి) | (గ్రూప్-బి) |
| ఉ.9.30 నుంచి | మ. 1.30 నుంచి |

స్టార్‌స్పోర్ట్స్ 2, 1 (తెలుగు)

శనివారం
తెల్లవారు జామున 4 గం. నుంచి స్టార్‌స్పోర్ట్స్ 1లో...

# పరువు దక్కేనా?

టెస్టుల్లో నెం.1 జట్టు భారత్.. పరువు కోసం పోరాడుతోంది. తొలి టెస్ట్‌లో 10 వికెట్లతో చిత్తుగా ఓడిన టీమిండియా.. శనివారం నుంచి న్యూజిలాండ్‌తో జరిగే రెండో టెస్ట్‌లో విజయమే లక్ష్యంగా బరిలోకి దిగుతోంది. అయితే, బ్యాటింగ్ వైఫల్యం భారత్‌ను తీవ్రంగా కలవరపరుస్తోంది. తొలి టెస్ట్‌లోని రెండు ఇన్నింగ్స్‌లోనూ 200 పరుగుల మార్క్‌ను కూడా చేరుకోలేకపోవడం టాప్ ర్యాంక్ జట్టుకు ఘోర అవమానం. ఈ నేపథ్యంలో బలహీనతలకు చెక్ చెప్పి.. విజయంతో టూర్‌ను ముగించి సిరీస్‌ను సమం చేయాలని కోహ్లీ సేన భావిస్తోంది.


కోహ్లీ

- రేపటి నుంచి కివీస్‌తో భారత్ రెండో టెస్ట్
- బ్యాట్స్‌మెన్‌కు పరీక్షా సమయం
- పృథ్వీ ఆడేది అనుమానమే

**క్రైస్ట్‌చర్చ్:** సుదీర్ఘ న్యూజిలాండ్ పర్యటనలో ఆఖరి మ్యాచ్‌ను ఆడబోతున్న టీమిండియా ఘన విజయంతో స్వదేశానికి తిరిగి వెళ్లాలని భావిస్తోంది. రెండు టెస్ట్‌ల సిరీస్‌లో భాగంగా శనివారం నుంచి హాగ్లే ఓవల్‌లో కివీస్‌తో జరిగే ఆఖరి టెస్ట్‌కు కోహ్లీసేన అస్త్రాలను సిద్ధం చేసుకుంటోంది. అయితే వెల్లింగ్టన్ తరహాలోనే ఈ మ్యాచ్‌లో కూడా భారత బ్యాట్స్‌మెన్‌కు విషమ పరీక్ష ఎదురుకానుంది. మరోవైపు ఓపెనర్ సమస్యతోపాటు తుది జట్టు కూర్పు కూడా మేనేజ్‌మెంట్‌కు తలనొప్పిగా తయారైంది. తొలి టెస్ట్‌లో కొత్త ఓపెనింగ్ జోడీ పృథ్వీ షా-మయాంక్ అగర్వాల్‌ను టీమిండియా పరీక్షించింది. అగర్వాల్ ఫర్వాలేదనిపించినా.. షా ఆకట్టుకోలేకపోయాడు. షార్ట్ బాల్స్‌ను ఎదుర్కోవడంలో విఫలమైన పృథ్వీ 16, 14 పరుగులే చేశాడు. అయితే, ఎడమకాలు వాయడంతో గురువారం ప్రాక్టీస్ సెషన్‌కు పృథ్వీ హాజరుకాలేదు.

**అశ్విన్ స్థానంలో జడేజా..?**

బౌలింగ్ విభాగానికొస్తే పేస్‌గన్ బుమ్రా.. కివీస్ బ్యాట్స్‌మెన్‌ను ఏమాత్రం ఇబ్బంది పెట్టలేకపోతున్నాడు. సీనియర్ ఇషాంత్ శర్మ స్ఫూర్తిదాయక ప్రదర్శన ఒక్కటే తొలి టెస్ట్‌లో భారత్‌కు ఊరటనిచ్చే అంశం. స్పిన్నర్ అశ్విన్ కూడా పెద్దగా రాణించలేదు. ఈ నేపథ్యంలో జడేజావైపు మేనేజ్‌మెంట్ మొగ్గుచూపే అవకాశాలున్నాయి. ఒకవేళ ఐదుగురు బౌలర్ల వ్యూహంతో బరిలోకి దిగాలనుకుంటే పేసర్ ఉమేష్‌కు తుది జట్టులో చోటు దక్కవచ్చు. మరోవైపు తొలి టెస్ట్ విజయంతో న్యూజిలాండ్ ఆత్మవిశ్వాసంతో కనిపిస్తోంది. తొలి మ్యాచ్‌లో యాంగిల్డ్ డెలివరీలతో బ్యాట్స్‌మెన్‌కు చుక్కలు చూపించిన పేసర్లు ట్రెంట్ బౌల్ట్, సౌథీ, జేమిసన్ నుంచి మరోసారి ఆ ప్రదర్శనను జట్టు ఆశిస్తోంది. కెప్టెన్ కేన్ విలియమ్సన్, రాస్ టేలర్ బ్యాటింగ్‌కు వెన్నెముకగా నిలుస్తున్నారు. వెల్లింగ్టన్ మ్యాచ్‌కు దూరమైన నీల్ వాగ్నర్ మళ్లీ జట్టులోకి రావడంతో సెలెక్షన్‌లో డైలమా నెలకొంది. ఈ నేపథ్యంలో స్పిన్నర్ అజాజ్ పటేల్ స్థానంలో వాగ్నర్‌ను తీసుకోవచ్చు.

**భయపెడుతున్న కోహ్లీ వైఫల్యం..**

వన్‌డౌన్‌లో నయా వాల్ పుజార ఆశించిన మేర రాణించకపోవడంతో భారత్‌పై పెనుభారమే పడుతోంది. అన్నింటికంటే జట్టును ఎక్కువగా ఇబ్బంది పెడుతున్నది కోహ్లీ వైఫల్యం. రహానె మెరుగైన టెక్నిక్‌తో ఎదురు నిలిచినా.. జట్టును మాత్రం ఆదుకోలేకపోయాడు. ఇతడి నుంచి టీమ్ భారీ ఇన్నింగ్స్ ఆశిస్తోంది. కాగా, భారత్-ఎ టూర్‌లో ఇదే పిచ్‌పై విహారి (51, 100 నాటౌట్) రాణించడం అతడిపై అంచనాలను పెంచేసింది.

## రోలర్‌నూ నడిపిస్తా: ధోనీ



**రాంచీ:** వన్డే ప్రపంచకప్ తర్వాత క్రికెట్‌కు దూరమైన ధోనీ.. ఐపీఎల్ సమీపిస్తుండడంతో రాంచీ క్రికెట్ స్టేడియంలో సాధన చేస్తున్నాడు. ఈ సందర్భంగా అతడు పిచ్‌ను మరమ్మతు చేసే పనిలో పడ్డాడు. దీనికోసం ధోనీ ఏకంగా రోలర్ డ్రైవర్‌గా మారి సీరియస్‌గా పిచ్‌ను చదును చేస్తూ కనిపించాడు. మరోవైపు ధోనీ సేంద్రీయ వ్యవసాయంలోనూ అడుగుపెట్టాడు. 'ప్రస్తుతం పుచ్చకాయల సాగును ప్రారంభిస్తున్నా. మరో 20 రోజుల్లో బొప్పాయిని సాగు మొదలుపెడతా'నంటూ ఫేస్‌బుక్‌లో వీడియో పోస్ట్ చేశాడు.

## క్రీడలపై 'కరోనా' పంజా

**న్యూఢిల్లీ:** ప్రపంచాన్ని భయపెడుతున్న కరోనా వైరస్ దెబ్బకు క్రీడాకారులు విలవిల్లాడుతున్నారు. విశ్వక్రీడల నేపథ్యంలో భారత షూటర్ల కోసం ఇటలీ క్యాంప్ ఏర్పాటు చేద్దామనుకున్న జాతీయ షూటింగ్ సమాఖ్య ఆ ఆలోచనలను మానుకుంది. దక్షిణ కొరియాలో ఏర్పాటు చేయాలనుకున్న షూటింగ్ బేస్ క్యాంప్‌ను కూడా రద్దు చేసింది. ఇటలీ, కొరియా, ఇరాన్‌లో కరోనా విజృంభించడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు.

## మళ్లీ వార్నర్‌కు సన్‌రైజర్స్ పగ్గాలు

**హైదరాబాద్:** ఆస్ట్రేలియా విధ్వంసకర బ్యాట్స్‌మన్ డేవిడ్ వార్నర్ ఐపీఎల్‌లో మరోసారి సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. 2016లో తన సారథ్యంలోనే సన్‌రైజర్స్‌ను విజేతగా నిలిపిన 33 ఏళ్ల వార్నర్.. బాల్ టాంపరింగ్ వివాదంతో 2018 సీజన్‌కు దూరమయ్యాడు. వార్నర్ గైర్హాజరీలో న్యూజిలాండ్ స్టార్ కేన్ విలియమ్సన్ కెప్టెన్‌గా బాధ్యతలు తీసుకున్నాడు. గతేడాది తిరిగి జట్టులో చేరినా.. వార్నర్‌కు సన్‌రైజర్స్ యాజమాన్యం కెప్టెన్సీ అప్పగించలేదు. ఈసారి వార్నర్‌నే కెప్టెన్‌గా నియమిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఏప్రిల్ 1న ఉప్పల్ స్టేడియంలో ముంబైతో సన్‌రైజర్స్ తొలి మ్యాచ్‌ను ఆడనుంది.

# హ్యాట్రిక్‌తో ఘనంగా..

వరుసగా మూడు మ్యాచ్‌లు.. మూడు విజయాలు. తీవ్ర ఒత్తిడిని తట్టుకుంటూ అసాధారణ ఆటతీరుతో మహిళల ప్రపంచకప్‌లో భారత అమ్మాయిలు వహ్వా.. అనిపిస్తున్నారు. కివీస్‌తో మ్యాచ్‌లోనూ ఎప్పటిలాగే టీనేజ్ సెన్సేషన్ షఫాలీ వర్మ ప్రత్యర్థి బౌలింగ్‌ను తుత్తునియలు చేస్తూ మెరుపు ఆరంభాన్నివ్వగా.. ఆ తర్వాత స్వల్ప స్కోరును కాపాడే బాధ్యత బౌలర్లపై పడింది. ఈసారీ ఉత్కంఠను అధిగమిస్తూ వారు జట్టుకు విజయాన్నందించారు. తద్వారా ఈ మెగా టోర్నీలో సెమీస్‌కు చేరిన తొలి టీమ్‌గా నిలిచింది. అయితే 12 బంతుల్లో 34 పరుగులు చేయాల్సిన దశలోనూ కివీస్ బ్యాట్స్‌వుమన్ అమేలియా కెర్ ఆఖరి బంతి వరకూ భారత శిబిరంలో ఓటమి భయాన్ని రేపింది. కానీ శిఖా పాండే సూపర్ బౌలింగ్‌తో జట్టు గట్టెక్కింది.

## సెమీస్‌లో భారత్

- న్యూజిలాండ్‌పై ఉత్కంఠ విజయం
- చెలరేగిన షఫాలీ
- టీ20 మహిళల ప్రపంచకప్


షఫాలీ వర్మ (46)



**షఫాలీ రికార్డు**

16 ఏళ్ల షఫాలీ వర్మ కొత్త రికార్డు నెలకొల్పింది. తొలిసారిగా ఈ మెగా టోర్నీలో ఆడుతున్న ఆమె ఇప్పటి వరకు మూడు మ్యాచ్‌ల్లో 172.72 స్ట్రయిక్ రేట్‌తో 114 పరుగులు సాధించింది. దీంతో ఓ టీ20 ప్రపంచకప్‌లో అత్యధిక స్ట్రయిక్ రేట్ సాధించిన ప్లేయర్‌గా నిలిచింది. బౌండరీ (11 ఫోర్లు, 8 సిక్సర్లు)ల పరంగా కూడా ప్రస్తుతానికి ఈ టోర్నీలో ఆమే ముందుంది. ఇక అంతర్జాతీయ మహిళల టీ20ల్లో కనీసం 200 పరుగులు చేసిన వారిలోనూ షఫాలీ స్ట్రయిక్ రేట్ (147.97) అత్యధికం కావడం విశేషం. ఆ తర్వాత క్లో ట్రియాన్ (దక్షిణాఫ్రికా 138.31), అలీసా హీలీ (ఆసీస్ 129.66) ఉన్నారు. షఫాలీ 17 టీ20ల్లో 438 పరుగులు సాధించింది.

**మెల్‌బోర్న్:** ఆస్ట్రేలియా గడ్డపై భారత మహిళల జట్టు అంచనాలకు మించి రాణిస్తోంది. బ్యాటింగ్‌లో షఫాలీ వర్మ (34 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సర్లతో 46) మాత్రమే రాణించినా బౌలర్ల సమష్టి దాడితో గురువారం జరిగిన ఉత్కంఠపోరులో న్యూజిలాండ్‌పై మూడు పరుగుల తేడాతో గెలిచింది. దీంతో వరుసగా మూడు విజయాలతో అజేయంగా నిలిచిన భారత్ ఇతర జట్లకన్నా ముందే సెమీఫైనల్ బెర్త్ ఖరారు చేసుకుంది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 133 పరుగులు చేసింది. తానియా భాటియా (23) ఫర్వాలేదనిపించగా.. ఆఖర్లో రాధా యాదవ్ (9 బంతుల్లో 1 సిక్స్‌తో 14 నాటౌట్) కీలక పరుగులు సాధించింది. అమేలియా కేర్, రోజ్‌మేరీ మెయిర్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో కివీస్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 130 పరుగులు చేసి ఓడింది. అమేలియా కేర్ (19 బంతుల్లో 6 ఫోర్లతో 34 నాటౌట్) టాప్ స్కోరర్. దీప్తి, శిఖా, రాజేశ్వరి, పూనమ్, రాధా యాదవ్ తలో వికెట్ తీశారు. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా షఫాలీ వర్మ నిలిచింది.

**ఆఖర్లో ఉత్కంఠ రేపినా..:** 134 పరుగుల లక్ష్యం కివీస్ ముందు తక్కువే అనిపించింది. అయితే ఈసారి కూడా బౌలర్లు మాయ చేయకపోరా అన్న అంచనాలను మనోళ్లు నిజం చేసి చూపించారు. రెండో ఓవర్ నుంచే వికెట్ల పతనాన్ని ఆరంభించారు. కీలక బ్యాటర్స్ సోఫీ డివైన్ (14), సుజీ బేట్స్ (6) విఫలమవడంతో కివీస్ 34 రన్స్‌కే 3 వికెట్లు కోల్పోయింది. పూనమ్ యాదవ్, రాధా యాదవ్ స్పిన్‌తో ఇబ్బందిపెట్టారు. అయితే మిడిలార్డర్ ప్లేయర్స్ భారత బౌలింగ్‌ను సమర్థవంతంగా ఎదుర్కొన్నారు. మార్టిన్ (25), మ్యాడీ గ్రీన్ (24) కలిసి నాలుగో వికెట్‌కు 43 రన్స్ జోడించినా స్వల్ప వ్యవధిలోనే అవుటయ్యారు. నిలకడగా ఆడుతున్న ఈ జోడీ అవుటయ్యారనే ఆనందం ఎక్కువసేపు లేకుండా కెర్, జెన్సెన్ (11) కాసేపు భారత్‌ను భయపెట్టారు. 12 బంతుల్లో 34 పరుగులు రావాల్సిన దశలో కెర్ చుక్కలు చూపించింది. పూనమ్ వేసిన 19వ ఓవర్‌లో ఆమె నాలుగు ఫోర్లు బాది 18 పరుగులు రాబట్టడంతో ఒక్కసారిగా టెన్షన్ మొదలైంది. దీంతో చివరి 6 బంతుల్లో 16 రన్స్ కష్టం కాదేమో అనిపించింది. శిఖా పాండే వేసిన ఓవర్ తొలి బంతినే జెన్సెన్ ఫోర్‌గా మలిచింది. అయితే ఆ తర్వాత మూడు బంతులకు సింగిల్స్ మాత్రమే వచ్చాయి. ఇక రెండు బంతుల్లో రెండు ఫోర్లు సాధిస్తే మ్యాచ్ సూపర్ ఓవర్‌కు వెళుతుందనగా ఐదో బంతిని కెర్ అద్భుత స్కూప్ షాట్‌తో బౌండరీకి తరలించింది. అయితే యార్కర్‌గా వేసిన చివరి బంతిని కెర్ భారీ షాట్ ఆడాలని చూసినా విఫలమైంది. దీనికితోడు రెండో పరుగు కోసం వెళ్లి జెన్సెన్ రనౌట్ కావడంతో మ్యాచ్ భారత్ వశమైంది.

**భారత బ్యాటింగ్.. అదే తీరు:** ఓపెనింగ్‌లో షఫాలీ చెలరేగడం.. మిగతా వారంతా బ్యాటెత్తేయడం.. వరుసగా మూడో మ్యాచ్‌లోనూ ఇదే సీన్ కనిపించింది. అయితే చివర్లో టెయిలెండర్లు విలువైన పరుగులు జోడించడం భారత్‌కు కలిసివచ్చింది. స్టార్ బ్యాట్స్‌వుమెన్ స్మృతి మంధాన (11), జెమీమా (10), హర్మన్‌ప్రీత్ (1) విఫలమైనా భారత్ పోరాడే స్కోరును సాధించడం షఫాలీ పుణ్యమే. రెండు ఫోర్లతో టచ్‌లో ఉన్నట్టే కనిపించిన స్మృతి రెండో ఓవర్‌లోనే వెనుదిరిగింది. ఈదశలో తానియా, షఫాలీ జోడీ ఆదుకుంది. ఐదో ఓవర్‌లో వర్మ వరుసగా రెండు భారీ సిక్సర్లు బాదింది. 8, 10వ ఓవర్‌లో తానిచ్చిన రెండు క్యాచ్‌లను కివీస్ ఫీల్డర్లు వదిలేశారు. రెండో వికెట్‌కు ఈ జోడీ 51 పరుగులు జోడించింది. అయితే 11వ ఓవర్ నుంచి కివీస్ బౌలర్లు పైచేయి సాధించారు. 12వ ఓవర్‌లో జెమీమా అవుట్ కాగా, షఫాలీ మాత్రం 4,6తో ఎదురుదాడికి దిగింది. కానీ 18 పరుగుల తేడాతో హర్మన్, షఫాలీ, వేద (6), దీప్తి (8)ల వికెట్లు కోల్పోవడం భారత్ స్కోరుపై ప్రభావం చూపింది. చివరి ఓవర్‌లో రాధా యాదవ్ వేగంగా ఆడి 12 రన్స్ సాధించడంతో గౌరవప్రదమైన స్కోరును సాధించింది.

**స్కోరుబోర్డు**

**భారత్:** షఫాలీ వర్మ (సి) జెన్సెన్ (బి) కెర్ 46; స్మృతి మంధాన (బి) తహుహు 11; తానియా భాటియా (సి) కెర్ (బి) మెయిర్ 23; జెమీమా (సి) కెర్ (బి) మెయిర్ 10; హర్మన్‌ప్రీత్ (సి అండ్ బి) కాస్పెరెక్ 1; దీప్తి శర్మ (సి) జెన్సెన్ (బి) డివైన్ 8; వేద (ఎల్బీ) కెర్ 6; శిఖా పాండే (నాటౌట్) 10; రాధా యాదవ్ (రనౌట్) 14; **ఎక్స్‌ట్రాలు: 4; మొత్తం: 20 ఓవర్లలో 133/8. వికెట్ల పతనం:** 1-17, 2-68, 3-80, 4-93, 5-95, 6-104, 7-111, 8-133. **బౌలింగ్:** తహుహు 2-0-14-1; మెయిర్ 3-0-27-2; డివైన్ 2-0-12-1; అన్నా పీటర్సన్ 2-0-19-0; జెన్సెన్ 3-0-20-0; కెర్ 4-0-21-2; కాస్పెరెక్ 4-0-19-1.

**న్యూజిలాండ్:** రాచెల్ ప్రీస్ట్ (సి) రాధా యాదవ్ (బి) శిఖా పాండే 12; డివైన్ (సి) రాధా యాదవ్ (బి) పూనమ్ 14; సుజీ బేట్స్ (బి) దీప్తి శర్మ 6; గ్రీన్ (సి) తానియా (బి) గైక్వాడ్ 24; మార్టిన్ (సి) రోడ్రిగ్స్ (బి) రాధా యాదవ్ 25; కెర్ (నాటౌట్) 34; జెన్సెన్ (రనౌట్) 11; **ఎక్స్‌ట్రాలు: 4; మొత్తం: 20 ఓవర్లలో 130/6. వికెట్ల పతనం:** 1-13, 2-30, 3-34, 4-77, 5-90, 6-129. **బౌలింగ్:** దీప్తి శర్మ 4-0-27-1; శిఖా పాండే 4-0-21-1; రాజేశ్వరి గైక్వాడ్ 4-0-22-1; పూనమ్ యాదవ్ 4-0-32-1; రాధా యాదవ్ 4-0-25-1.



**బంగ్లాపై ఆసీస్ విజయం**

**కాన్‌బెరా:** వరల్డ్‌కప్‌లో ఆస్ట్రేలియా జట్టు వరుసగా రెండో విజయాన్ని నమోదుచేసింది. గ్రూప్-ఎలో భాగంగా గురువారం జరిగిన మ్యాచ్‌లో ఆసీస్ 86 పరుగుల తేడాతో బంగ్లాదేశ్‌ను ఓడించింది. తొలుత ఆసీస్.. ఓపెనర్లు అలీసా హీలీ (83), బెత్ మూనీ (81 నాటౌట్) అర్ధసెంచరీలతో అదరగొట్టడంతో నిర్ణీత 20 ఓవర్లలో వికెట్ నష్టానికి 189 పరుగులు సాధించింది. గార్డెనర్ 22 పరుగులతో అజేయంగా నిలిచింది. ఛేదనలో బంగ్లా.. మెగాన్ షట్ (3/21), జెస్ జొనాసెన్ (2/17) బౌలింగ్ ధాటికి 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 103 పరుగులకే పరిమితమైంది. బంగ్లా బ్యాట్స్‌వుమెన్‌లో అత్యధికంగా ఫర్గానా హోక్ 36 రన్స్ చేసింది. అలీసా హీలీకి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది.

## వచ్చేస్తోంది విశాఖ ఎక్స్‌ప్రెస్..!

కోడి వెంకట శశికాంత్.. తాజా రంజీ సీజన్‌లో సంచలనాలకు కేంద్ర బిందువు. విశాఖ పోర్ట్ జట్టుకు ఆడిన నాన్న అడుగుజాడల్లో నడుస్తూ క్రికెట్‌లో ఓనమాలు నేర్చుకున్న ఈ మీడియం పేసర్.. ప్రస్తుతం కెరీర్‌లోనే అత్యుత్తమ ఫామ్‌లో ఉన్నాడు. ఇప్పటివరకు ఆడిన 20 రంజీల్లో 70 వికెట్లు తీస్తే, అందులో ఈ సీజన్‌లోని ఎనిమిది మ్యాచ్‌ల్లోనే 37 వికెట్లు నేలకూల్చాడు. ఇలా.. అద్భుతమైన ఫామ్‌ను చాటుకుంటూ ఆంధ్ర విజయాల్లో కొంతకాలంగా ముఖ్య భూమిక పోషిస్తున్న ఈ 24 ఏళ్ల కుర్రాడు.. జాతీయ జట్టులో చోటే లక్ష్యంగా దూసుకెళ్తున్నాడు. త్వరలోనే టీమిండియా జెర్సీని తండ్రికి బహుమతిగా ఇస్తానంటున్న శశికాంత్.. క్రికెట్ ప్రయాణం ఎలా మొదలైందో అతడి మాటల్లోనే..


శశికాంత్

**క్రికెట్ వైపు అడుగులు పడ్డాయిలా..**

నాన్న పేరు రామకృష్ణ. ఆయన విశాఖ పోర్ట్ క్రికెట్ జట్టు తరపున లెగ్ స్పిన్నర్‌గా ఆడేవారు. పలు రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో కూడా పాల్గొన్నారు. చిన్నతనంలో ఆయనతో పాటు గ్రౌండ్‌కు వెళ్లేవాడిని. నాన్న వాళ్ల టీమ్ ఆడుతుంటే గ్యాలరీలో కూర్చొని గోల చేసే వాడిని. నన్ను కంట్రోల్ చేయడానికి నాన్న స్నేహితులు కొందరు నాతో బౌలింగ్ చేయించడం ప్రారంభించారు. అలా మొదలైన నా క్రికెట్ ప్రస్థానం నాన్న ప్రోత్సాహంతో ఈ స్థాయికి వచ్చింది.


నాన్నతో..

**కెరీర్‌లో టర్నింగ్ పాయింట్..**

2017లో సీకే నాయుడు అండర్-23 టోర్నమెంట్‌లో 34 వికెట్లు పడగొట్టి అత్యధిక వికెట్లు తీసిన ఆటగాడిగా నిలిచా. ఈ టోర్నీలో హిమాచల్‌ప్రదేశ్‌తో జరిగిన క్వార్టర్ ఫైనల్లో ఐదు (5/57) వికెట్లు పడగొట్టడంతో పాటు సెంచరీ (157 నాటౌట్) కూడా చేశా. ఈ ప్రదర్శనతో జట్టులో స్థానం పదిలమైంది. ఆ తర్వాత మధ్యప్రదేశ్‌తో రంజీ పోరులో ఆరు (6/18) వికెట్లు తీశా. అప్పటినుంచి కెరీర్ వేగం పుంజుకుంది.

**రంజీల్లో అరంగేట్రం చేసి నాలుగేళ్లవుతున్నా ఇప్పటివరకు వెలుగులోకి రాలేదు ఎందుకంటే..**

ఆంధ్ర రంజీ జట్టు తరపున 2015 అక్టోబరులో ఉత్తరప్రదేశ్‌పై అరంగేట్రం చేశా. టీమ్‌లో ఉన్న పోటీ కారణంగా అడపాదడపా చోటు దక్కేదేకానీ, రెగ్యులర్ బౌలర్‌ని కాదు. సీనియర్లు అందుబాటులో లేనప్పుడు లభించిన అవకాశాలను ఉపయోగించుకొనే వాడిని. గత రెండేళ్ల నుంచి నిలకడగా చాన్సులు లభిస్తుండడంతో నా బౌలింగ్ మునుపటి కంటే బాగా మెరుగైంది. సీమ్ పొజిషన్, లైన్ అండ్ లెంగ్త్, రనప్ సమస్యలను కోచింగ్ సిబ్బంది సహకారంతో అధిగమించా. ప్రస్తుత ఫామ్‌ను కొనసాగిస్తూ ఈ ఏడాది మరింతగా రాణించేందుకు ప్రయత్నిస్తా.

**అభిమానించే క్రికెటర్..**

సచిన్ టెండూల్కర్‌కు వీరాభిమానిని. పేసర్ గ్లెన్ మెక్‌గ్రాత్, ఆల్‌రౌండర్ జాక్ కలిస్ ఆటనూ అభిమానిస్తా. బౌలింగ్‌లో అయితే మెక్‌గ్రాత్ నాకు రోల్ మోడల్.

**ఖాళీ సమయాల్లో..**

అర్జిత్ సింగ్ పాటలంటే ఇష్టం. అతడి ఆల్బమ్స్ ఎక్కువగా వింటుంటా. వైజాగ్‌లో ఉంటే ఫ్రెండ్స్‌తో కలిసి ఆర్కే బీచ్‌లో షికారు చేస్తా. బాల్యం నుంచే భోజన ప్రియుడిని కావడంతో అమ్మ (వెంకటలక్ష్మి)తో కలిసి కిచెన్‌లో ప్రయోగాలు చేస్తుంటా.

**భవిష్యత్ లక్ష్యం..**

భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించడమే నా లక్ష్యం. ఇండియన్ టీమ్ జెర్సీని నాన్నకు గిఫ్ట్‌గా ఇస్తా. ఆయన స్వప్నాన్ని సాకారం చేస్తా.

(ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి-హైదరాబాద్)

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.